ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-4-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 69 పేజీలు: 10+4 వెల: 6.50



ఓట్లు దంచేశారు.. 3 రాష్ట్రాల్లో అంచనాలు మించి ఓటింగ్ 75% దాటిన పోలింగ్ 5

## లెబనాన్‌లో విధ్వంసం

### 254 మంది మృతి

10 ఆయుధ నిల్వ కేంద్రాలు ధ్వంసం

హెజ్‌బొల్లా అగ్రనేత యూసఫ్ హతం

ఇజ్రాయెల్ భద్రతలో రాజీపడబోం: ఐడిఎఫ్



పశ్చిమాసియాలో ఉత్కంఠకు తెరపడలేదు. ఉద్రిక్తతలూ తొలగిపోలేదు. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. 5

## సౌదీ పైప్‌లైన్‌పై ఇరాన్ దాడి



పంపింగ్ స్టేషన్‌లో ఎగిసిపడ్డ అగ్నికీలలు

హార్ముజ్ జలసంధిని మూసేసిన ఇరాన్



## ట్రంప్ వార్నింగ్

వెనక్కి తగ్గేది లేదు

హార్ముజ్ తెరవకపోతే కఠినంగా వ్యవహరిస్తాం..



గురువారం బోనకల్‌లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న డి.సిఎం భట్టి

## జూన్ 2 నుండి ఇందిరమ్మ బీమా

రైతుల అభివృద్ధి లక్ష్యంగా సాగునీటి వనరుల విస్తరణ

విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు అల్పాహారం

మధిరలో అభివృద్ధి పనులకు శ్రీకారం: డి.సిఎం భట్టి

**మధిర, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నదని అందుబాటులో ఉన్న ప్రతి సాగునీటి వనరులను విస్తరించడం జరుగుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గ >>2

## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్9:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఆయన వెళ్తున్నారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు. మధ్యాహ్నం జరగనున్న సిడబ్ల్యుసి సమావేశంలో సిఎం పాల్గొంటారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,.పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రితో పాటు టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ మంత్రులు దామోదర రాజనర్సింహా, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు కూడా ఈ పర్యటనలో సిఎం వెంట వెళ్లే అవకాశంఉంది. రాష్ట్రంలో పాలనపరంగా 28 >>2

# మేడిగడ్డ బ్యారేజికి మరమ్మతులు

## ఎన్‌డిఎస్‌ఎ సూచనల మేరకే పనులు



గురువారం కాళేశ్వరంపై సమీక్షలో సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

కాళేశ్వరంలోని మూడు ఆనకట్టలకు మరమ్మతులు చేపట్టాలి

పనుల్లో వేగం పెంచాలి, నిరంతరం పర్యవేక్షించాలని ఏజెన్సీలు, అధికారులకు ఆదేశం

మంత్రి ఉత్తమ్‌తో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్9:** కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను పూర్తి చేయాలన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని తననివాసంలో గురువారం రాత్రి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపైన సమీక్ష నిర్వహించారు. మరమ్మత్తులకోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏజెన్సీలన్నింటిని అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సిడబ్ల్యుపిఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టెన్సీస్‌తో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లర్లే కాకుండా మొత్తం 1.6 కిలో మీటర్ల బ్యారేజ్‌ని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తొవ్వాల్సి ఉందని, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకోవాలని సూచిం చారు. వీలైనంత త్వరగా ఈ పని >>2



# యాసంగి ధాన్యం కొనుగోళ్లు షురూ

రాష్ట్ర వ్యాప్తంగా 8251 కేంద్రాలు ఏర్పాటు

రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోనే సొమ్ము జమ

కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలకు పెద్దపీట

ఎస్‌హెచ్‌జిల నిర్వహణలోనే 40 శాతం కేంద్రాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌కు సంబంధించి కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. కొనుగోళ్లు సజావుగా జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా 8,251 కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ధాన్యం అమ్మిన తర్వాత రెండు రోజుల్లోనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నారు. సన్నరకం వడ్లకు ఇచ్చే బోనస్‌ను కూడా వెంటనే జమ చేయనున్నారు. సన్నరకం బియ్యంపై క్వింటాకు రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్ అందిస్తున్న విషయం తెలిసిందే. ఆ బోనస్ కూడా వెంటనే పంపిణీ చేయనున్నారు. రబీ సీజన్‌లో మొత్తం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో మొత్తం 54.48 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. దాదాపు 152.03 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వరికోతలు ముమ్మరం కావడంతో ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. 2024-25 రబీ సీజన్‌లో 137.10 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. అయితే ప్రభుత్వం 70.13 లక్షల టన్నులు సేకరించాలని భావించగా అంతకంటే ఎక్కువగా ఏకంగా 73.70 లక్షలు వచ్చింది. ఈ సారి 90 లక్షల టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ధాన్యం కొనుగోళ్లలోమహిళా స్వయంసహాయక సంఘాలుకీలకంగా పనిచేస్తున్నాయి. ఇందిరా క్రాంతి పథం (ఐకెపి) ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రాల సంఖ్య సీజన్ సీజన్‌కూ వేగంగా పెరుగుతోంది. గ్రామీణఆర్థిక వ్యవస్థలో కొత్తమార్పునకు దారితీస్తున్నాయి. ఈ >>2



మూడ్రోజులూ..

## మండుటెండలే!

40° ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం

ఖమ్మం, మహబూబ్‌నగర్‌కు ఆరెంజ్ అలెర్ట్ జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం9గంటల నుంచే సూర్యుడు తన భగభగలను మొదలు పెడుతుండటంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఏప్రిల్ నెలారంభంలోనే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచి కొడుతుండడంతో జనంబెంబేలెత్తి >>2

# జీవన్ రెడ్డి సేవలు బిఆర్‌ఎస్‌కి అవసరం

నిబద్ధత గల ప్రజాసేవకులు, మాజీ మంత్రి..

జీవన్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం: బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



గురువారం జగిత్యాలలో జీవన్‌రెడ్డిని సత్కరిస్తున్న కెటిఆర్

**జగిత్యాల, ఏప్రిల్ 9, ప్రభాతవార్త బ్యూరో:** మాజీ మంత్రి జీవన్ రెడ్డి సేవలు బిఆర్‌ఎస్ పార్టీకి ఎంతో అవసరమని, బిఆర్‌ఎస్ పార్టీలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేరాలని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్‌ఎస్ వర్కింగ్ పార్టీ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్‌రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పుడి నుంచో ఉన్నదని అన్నారు. రెండు సందర్భాల్లో నాకండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్‌రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల >>2

అనర్హుల రేషన్‌కార్డులు రద్దు.. క్షేత్రస్థాయిలో ముమ్మర సర్వే 3





గురువారం మంచుదుప్పటిలో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం

## యువతి అనుమానాస్పద మృతి

### రాయపర్తి మండలం ఎకె తండాలో ఘటన

**వరంగల్ క్రైం /రాయపర్తి ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం వర్ధన్నపేట నియోజకవర్గం రాయపర్తి మండలంలో ప్రేమ పేరుతో వేధింపులు తాళలేక మహేశ్వరి (21) అనే ఓ యువతీ ఇంట్లో ఉరి వేసుకొని సూసైడ్ చేసుకుంది. ఆకతాయి కుర్రోడి వేధింపులు తట్టుకోలేక తమ కూతురు ఆత్మ హత్యకు పాల్పడిందని బాధితురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. గురువారం వర్ధన్నపేట మార్చురీ వద్ద మృతురాలి బంధువుల ఆందోళనకు దిగి వరంగల్ ఖమ్మం హైవే పై బైఠాయించి ఆందోళన చేశారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులకు సర్ది చెప్పి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించు కున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని మృతుని బంధువులు ఖరఖండిగా చేబుతున్నారు.

## బిఆర్ఎస్‌కి అవసరం

>> ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్టాంటిదంటే.. కేసీఆర్ రూ.75 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు..2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు, కాంగ్రెస్‌లోనే కొనసాగుతా అని అన్నారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల విషయాలపై చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ చాలా ముఖ్యమైనదని, దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో (అప్పుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి) సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్.టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసనసభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డి కి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు.అనంతరం మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 10 సంవత్సరాలు మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో మెరుగైన పాలన చేశారని, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో తిరోగమన దిశగా పరిపాలన ఉన్నదని ప్రజలు మళ్ళీ కేసీఆర్ అధికారంలోకి రావాలని కోరుతున్నారని మిత్రులను ప్రజలను ప్రజాప్రయసేశానని కెసిఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం మాకు వచ్చిందని పేర్కొన్నారు, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రైతులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి బాధలు చూడలేకపోతున్నానని పేర్కొన్నారు. జీవితం చివర అంకంలో ఉన్నదని ప్రజాసేవ చేసే ఆలోచనలో ఉన్నానని అందుకోసమే టిఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నానని ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సేవ చేసే అవకాశం కలుగుతుందని భావనతో మాజీ సీఎం కేసీఆర్ తో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.రెండు మూడు రోజులలో మాజీ సీఎం కేసీఆర్ ను కలిసి పాత విషయాలు కొత్త విషయాలు చర్చించుకున్న తర్వాత బి ఆర్ఎస్ పార్టీలో చేరే విషయం తేదీని ఖరారు పేర్కొన్నారుఅంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. మాజీ మంత్రి కేటీఆర్ వెంట మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్సీ ఎల రమణ, కరీంనగర్ కోరుట్ల హుజురాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్ డాక్టర్ సంజయ్ కౌశిక్ రెడ్డి నాయకులు బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి దామోదర్ రావు వినోద్ కుమార్, జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు వసంత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్

>>నెలలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలు,రాష్ట్ర కేబినెట్ విస్తరణ లేదా నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా అధిష్ఠానంతో సిఎంప్రాథమిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.సాయంత్రం ఎఐసిసిఅగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే,రాహుల్ గాంధీలతో ముఖ్యమంత్రి విడివిడిగా భేటీ అయ్యే అవకాశం ఉంది.

## ధాన్యం కొనుగోళ్లు షురూ

>> రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మహిళా సంఘాలు, వ్యవసాయ సహకారం సంఘాల ద్వారా మొత్తం 8,251 పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అందులో 3,403 కేంద్రాలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఐకెపి సెంటర్లు నిర్వహించేలా అవకాశం కల్పించింది. దీంతో మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 40 శాతం కంటే ఎక్కువ కేంద్రాలు మహిళా సంఘాలకే అవకాశం ఇచ్చినట్లయింది. మహిళా సాధికారత విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు ఈ పరిణామం నిదర్శనంగా నిలుస్తోంది. ప్రస్తుతం యాసంగి వరి కోతలు మొదలు కావడంతో రాష్ట్రంలో దాదాపు 500 ఐకెపి కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ నెలాఖరు నాటికి అన్ని 3,403 కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలు కేవలం కొనుగోలు వ్యవస్థకే పరిమితం కాకుండా వారి ఆర్థిక స్థిరత్వానికి ప్రధాన ఆధారంగా మారాయి. గత ఖరీఫ్ సీజన్‌లో మహిళా సంఘాలు పంట కొనుగోల్ల ద్వారా రూ. 80.60 కోట్ల కమిషన్ ఆర్జించగా గత యాసంగి సీజన్‌లో రూ. 81.65 కోట్ల ఆదాయం నమోదు కావడం వారి సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది.

# రేషన్ షాపుల వద్ద బారులు

### ఎండలోనే బియ్యం కోసం పడిగాపులు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఒకేసారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీతో ఇటు లబ్దిదారులు అటు రేషన్‌డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ఎండల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఎప్రిల్, మె, జూన్ మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ ఈ నెల 1 నుండి ప్రారంభమైంది. దీంతో ఎండలను సైతం లెక్కచేయకుండా ఎక్కడ చూసినా చౌకధరల దుకాణాల వద్ద లబ్దిదారులు బారులు తీరుతున్నారు. ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణి కొనసాగుతుందని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నా పోర్టబులిటి నేపథ్యంలో సమీప దుకాణంలో ఎక్కడ బియ్యం అయిపోతాయోమెనన్న ఆందోళనతో లబ్దిదారులు రేషన్‌దుకాణాలకు పోటెత్తుతున్నారు. అయితే రేషన్ దుఖాణాల్లో బియ్యం నిల్వ సామర్థ్యం ఆధారంగా మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి కాకుండా ఎంఎల్ఎస్ పాయింట్ల నుండి విడతల వారిగా సరఫరా అవుతున్నాయి. అయితే రేషన్ బియ్యం పంపిణీకి అనుగుణంగా బియ్యం సరఫరా ఉండటం లేదని లబ్ధిదారులు, డీలర్లు వాపోతున్నారు. 3 నెలల కాలానికి సంబంధించిన బియ్యం చౌకధరల దుకాణాల్లో నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడం ఒక కారణం కాగా మరోవైపు రేషన్ దుకాణంలో నిండుకున్న నిల్వల స్థానంలో కొత్త కోటా విడుదల చేసే అవకాశం లేకపోవడంతో దుకాణాల ముందు నో స్టాక్ బోర్డ్ పెట్టాల్సిన పరిస్థితి తతెత్తుతోందని డీలర్లు వెల్లడిస్తున్నారు.

ఈ రేషన్ బియ్యం వచ్చిన వెంటనే లబ్ధిదారులు పెద్ద ఎత్తున ఎగబడుతున్నారు. 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో తూకం వేసి ఇస్తుండటంతో కొద్దిసేపటికే నిల్వలు నిండుకుంటున్నాయి. నిండుకున్న బియ్యం స్థానంలో కొత్తవి తీసుకురావడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న వాహనాలు, అదే హమాలీ కార్మికులతో 3 నెలల బియ్యం రవాణా చేయాల్సి వస్తోందని, దీంతో చౌకధరల దుకాణాలను వర్గీకరించి రోజుకో ప్రాంతానికి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇలా చేస్తుండటంతో ముందుగా రేషన్ బియ్యం నిల్వలు నిండుకున్న దుకాణాలకు 3 రోజులు అవుతున్నా రావడం లేదని తెలుస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆ రేషన్ దుకాణాల వద్దకు వచ్చి నో స్టాక్ బోర్డు చూసి వెనుదిరుగుతున్నారని సమాచారం. చౌకధరల దుకాణాలను అద్దెకు తీసుకునే సమయంలో వారి కోటా సామర్థ్యానికి అనుగుణంగా దుకాణాలను అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వం 3 నెలల కాలానికి బియ్యం ఏకకాలంలో పంపిణీ చేపడుతుండటంతో రేషన్ దుకాణాలు సరిపోవడం లేదని డీలర్లు అంటున్నారు. సాధారణంగా రేషన్ బియ్యం తీసుకునేందుకు చాలా వరకు మహిళలు, వృద్ధులు చౌకదరల దుఖాణాలకు వస్తుంటారు. ఈ క్రమంలో వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని రేషన్ దుకాణాల వద్ద తప్పనిసరిగా తాగునీరు, నీడ కోసం టెంట్ తదితర కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా చాలా వరకు రేషన్‌డీలర్లు సౌకర్యాల కల్పనకు మంగళంపాడారు. చాలాచోట్ల కనీసం తాగునీటి వసతి కూడా లేకపోవడంతో రేషన్ బియ్యం కోసం వచ్చిన లబ్ధిదారుల గొంతెండుతోంది. ప్రస్తుతం తెలంగాణలో తెలంగాణలో సుమారు 17,170 సరసమైన ధరల దుకాణాలు ఉన్నాయి. ఇన రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య కోటి మార్కును దాటి సుమారు 1.01 కోట్లకు చేరుకుంది. వీటిల్లో 99.36 లక్షల కార్డులు ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 3.25 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారు.

# రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

### స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారం కనుగొనాలి

### అధికారులకు సూచించిన సిఎస్, డిజిపి

### 13 నుంచి 18 వరకు నిర్వహించే అరైవ్ అలైవ్ కార్యక్రమాలపై ఉన్నత సమీక్ష



గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సిఎస్, డిజిపి

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం సచివాలయంలో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై తగిన చర్యలను చేపడుతున్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆయన తెలిపారు. వాహనాల సంఖ్య పెరగడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడమే ఈ ప్రమాదాలకు కారణమని ఆయన పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లు రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలను కనుగోనాలని ఆయన ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తక్షణమే నిర్వహించి, వారాంతర అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. దీనిలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని తెలిపారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజల ప్రాణాలను రక్షించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సురక్షిత రహదారులను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సిఎస్ పేర్కొన్నారు. రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం సాధారణ కార్యక్రమం కాదని, ఇది పలు శాఖల సమన్వయంతో కూడిన సమగ్ర చర్య అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులే బాధితులవుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు కూడా తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, సిపిఆర్ ప్రియాంక, జిల్లా కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

10-04-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
అష్టమి రా.11.13
పూర్వాషాఢ ఉ.11.25
వర్జ్యం : రా.8.09-రా.9.54
దు.ఉ.8.24-ఉ.9.14,
2)మ.12.33-మ.1.23
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిపినా మీ ప్రమేయం లేకుండా మానసికంగా ఆలోచనలు చోటు చేసుకుంటాయి.

**వృషభం:** పలురంగాల పట్ల మీకున్న అనుభవం మీకు ఉపకరిస్తుంది. స్థిరాస్తి విషయంలలో ఒక నిర్ణయమునకు వస్తారు.

**మిథునం:** సంతాన పురోగతి మీరు ఆశించిన దానికంటే ఎక్కువగా ఉంటుంది. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** తమ నైపుణ్యమునకు, సామర్థ్యంనకు తగినటువంటి స్థానం సంపాదించు కోవటానికి విశేషంగా కృషిచేస్తారు.

**సింహం:** నూతన విద్యావకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. వాహనసౌఖ్యం.

**కన్య:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు.

**తుల:** మీ పరిధులను, మీ యొక్క శక్తిని దృష్టిలో ఉంచుకొని ఉద్దేశ్య పూర్వకంగానే ఒక అవకాశాన్ని వదిలివేస్తారు.

**వృశ్చికం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. షేర్ల క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**ధనుస్సు:** జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం చెప్పదగినది. ఋణాలు తీరుస్తారు.

**మకరం:** అన్నీ సానుకూలంగా ఉన్నా వ్యవహార పురోభివృద్ధిలో ఏదో ఒక వెలితి ఏర్పడుతుంది.కొత్త మిత్రులు పరిచయ మవుతారు.

**కుంభం:** పెదవి దాటితే పృథివి దాటుతుందన్న నానుడి గుర్తుంచుకోవడం, తదనుగుణంగా నడుచుకొంటారు.

**మీనం:** చెప్పుకోదగిన ఒడుదుడుకులు లేకుండా కాలం గడుస్తుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం తిరువనంతపురంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద వేటువేసేందు వచ్చిన సిఎం పినరయ్ విజయన్

## మూడ్రోజులూ.. మండుటెండలే!

>> పోతున్నారు.సాయంత్రం 5 గంటల వరకు సూర్యుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. తెలంగాణలోని చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటుతున్నాయి. వాతావరణశాఖ తాజా బులెటిన్ మేరకు ఈ నెల 12 నుంచి 22 వరకు రాష్ట్రానికి హీట్‌వేవ్ హెచ్చరిక జారి అయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటుతాయని, ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతల కంటే మరో 3 డిగ్రీల సెల్సియస్ మేర వేడి పెరిగే అవకాశం ఉంది. రాబోయే రెండు మూడు రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇక్కడ ఉష్ణోగ్రతలు 43 ది నుంచి 44 ది వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత అధికంగానే ఉంటుందని, అందుకే ఆ జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనూ రానున్న 10 రోజుల పాటు 40 నుంచి 41డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ పేర్కొంది. మధ్యాహ్నం వేళల్లో వడ గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు మధ్యాహ్నసమయంలో బయటకు వెళ్లొద్దని, తరచుగా నీరుతాగుతూ డీహైడ్రేషన్ బారినపడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర మైతే తప్ప బయటకు రాకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నాయి.కాగా.. ఎండల తీవ్రతకు రాష్ట్రం లోని పలు ప్రాంతాల్లో భూ గర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లిలో భూగర్భ జల మట్టం పాతాళానికి పడిపోయింది. దీంతో సాగు, తాగునీటికి తీవ్ర కటకట నెలకొంది.

**ఎండకు వెళ్లకుండా చూసుకోవాలి...తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరక్టర్**

తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని.. ఈ నేపథ్యంలో ప్రజలు వడగాలుల నుంచి రక్షణ పొందడానికి తగిన చర్యలు తీసుకోవాలని పబ్లిక్‌హెల్త్ డైరక్టర్ సూచించారు. రాబోయే 3 రోజుల్లో తెలంగాణలో గరిష్టంగా 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ అంచనా వేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పౌరులు పాటించవలసినవి, పాటించకూడని వాటి గురించి తెలిపారు. దాహం వేయకపోయినా, వీలైనప్పుడల్లా తగినంత నీరు త్రాగాలని, ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్(ఓఆర్ఎస్)ను ఉపయోగించాలని హెల్త్ డైరక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ సూచించారు. నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు, ఉప్పుచక్కెర ద్రావణం వంటి ఇంట్లో తయారుచేసిన పానీయాలను సేవించాలన్నారు. ప్రయాణ సమయంలో నీటిని వెంట తీసుకువెళ్లాలన్నారు. పుచ్చకాయ, కర్బూజా, నారింజ, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయలతోపాటు స్థానికంగా లభించే ఇతర పండ్లు, కూరగాయల వంటి అధిక నీటి శాతం ఉన్న కాలానుగుణ పండ్లను, కూరగాయలను తినేలా చూసుకోవాలన్నారు. ఎండులు పెరుగుతున్న నేపథ్యంలో పలుచగా వదులుగా ఉండే కాటన్ దుస్తులను, వీలైతే లేత రంగు వాటిని ధరించాలన్నారు. ఎండ తగిలేటప్పుడు గొడుగు, టోపీ, క్యాప్, టవల్ వంటి సాంప్రదాయ తలపాగాలను ఉపయోగించి తలను ఎండనుంచి రక్షించుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నించాలని, అవసరమైతే తప్ప బయటికి రావొద్దని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల మధ్య ఎండలోకి వెళ్లడం మానుకోవాలని, మధ్యాహ్నం పూట శ్రమతో కూడిన కార్యకలాపాలను నివారించుకోవాలని, చెప్పులు లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. మద్యం, టీ, కాఫీ, కార్బోనేటెడ్, శీతల పానీయాలు, అధిక చక్కెర ఉన్న పానీయాలను సేవించడం మానుకోవాలని, అవి తీసుకోవడం మూలగా శరీర ద్రవాలు ఎక్కువగా కోల్పోవడానికి దారితీస్తాయని, కడుపు నొప్పికి కారణం కావచ్చన్నారు.

## ఇందిరమ్మ బీమా

>> పరిధిలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ముదిగొండ మండలంలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవన పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం బోనకల్ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 నుండి 12వ తరగతి చదువుతున్న 777 మంది విద్యార్థులకు సైకిలను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 648 విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యంగా భవిష్యత్తు మానవ వనాలను సృష్టించే లక్ష్యంతో వంద నియోజకవర్గాలలో ఒక్కొక్క టి 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ల నిర్మాణం చేపడుతున్నదని తెలిపారు. అలాగే రాబోయే విద్యా సంవత్సరం నుండి 119 నియోజకవర్గ కేంద్రాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. విద్య రంగాన్ని బలోపేతం చేయడం లో భాగంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతి విద్యార్థి అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో విద్యనభ్యసించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార ను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలు రైతుల పిల్లలకు మెరుగైన విద్య అందించడంతోపాటు ఆ కుటుంబాలకు ఆర్థికంగా మేలు జరుగుతుందని డిప్యూటీ సీఎం అన్నారు. ఎఫ్ ఆర్ ఎస్ హాజరు లో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం జరిగిందని భవిష్యత్తులో కూడా విద్యారంగం మరింత పటిష్టం కానున్నదని ఆశాభం వ్యక్తం చేశారు. అనంతరం భీమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ 36.50 కోట్ల అంచనా తో కట్టలేరు ప్రాజెక్టు ఆనకట్ట కాలువల ఆధునికరణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని అన్నారు. ప్రతి సాగునీటి వనరులను విస్తరించడం ద్వారా రైతాంగానికి సాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో వంగమూడి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో నియోజకవర్గ పరిధిలోని వైరా మున్నేరు కట్టలేరు నదుల స్థిరీకరణ నీటి వనరుల సద్వినియోగంపై నిరక్ష్యం కొనసాగిందన్నారు. సీతారామ ప్రాజెక్టు నీటిని కాలువల ద్వారా మళ్లించడం ద్వారా నియోజకవర్గంలో చివరి భూములకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. జూన్ 2 నుండి ఇందిరమ్మ బీమా అమలు:రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా జూన్ 2 నుండి ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రూ.18.30 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో మధిర మండల పరిధిలోని అంబర్పేటమాటూరు పేట, మల్లారం నుండి మిట్టగూడెం వరకు రహదారుల నిర్మాణాలకి 18. 30 కోట్లతో భూమి పూజలు నిర్వహించారు. మధిర పట్టణంలో రూ. 40 లక్షలతో నిర్మించిన విద్యుత్ శాఖ నూతన కార్యాలయంను ఎన్పీడీసీఎల్ ఎండి వరుణ్ రెడ్డి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ప్రారంభించిన ఆయన, నూతనంగా నిర్మించిన ఈ ఆర్ సి భవనం, ఎస్ పి ఎం భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేసే విధంగా రోడ్లు నిర్మించడం విస్తరించడం జరుగుతుందన్నారు. అలాగే రైల్వే కారిడార్ ను కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటనలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరరావు నదిలో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజికి మరమ్మతులు

>> పూర్తి చేయాలని ఆదేశించారు. మరమ్మతులకు సంబంధించి డిజైన్‌లు సిద్ధం చేయాలని సూచించారు.డిసెంబరు వరకు చేయాల్సిన పనులపైన పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. పనులలో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కల్గనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశం లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా విద్యుత్ పంపిణి, ఆస్తుల విభజన

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మూడో విద్యుత్ పంపిణి సంస్థ నిర్వహణ, ఆస్తుల విభజనలో పారదర్శకంగా ఉండేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మూడో డిస్కం నిర్మాణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత సమగ్రంగా, సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు గురువారం హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సమావేశం జరిగింది. వివిధ అంశాలపై ఇందులో చర్చించారు. ఆస్తుల విభజన మరియు మానవ వనరుల కేటాయింపు ప్రక్రియలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయడానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. అదేవిధంగా వినియోగదారుల విభజన, డేటా సమీకరణ, ఉద్యోగుల కూర్పు వంటి అన్ని కీలక ప్రక్రియలను సమయపాలనతో పూర్తి చేసి, రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాటికి ఈ కొత్త డిస్కం పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రణాళిక సిద్ధం చేసింది.

ఈ కొత్త విద్యుత్ పంపిణీ సంస్థ పాలసీ, నిర్వహణ, ఆర్థిక, విభజన తదితర అంశాలకు సంబంధించి లోతైన చర్చలు జరిపారు. దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థల నుంచి మూడో డిస్కంకు బదిలీ చేయాల్సిన ఆస్తుల గుర్తింపు, విలువ నిర్ణయం, మరియు పారదర్శకంగా విభజన చేపట్టే విధానాలపై చర్చించినట్లు ఈ సందర్భంగా మూడో డిస్కం సిఎండి ఫరూఖీ తెలిపారు. సాంకేతిక, ఆర్థిక పరమైన ప్రభావాలను కూడా సమీక్షించడం జరిగిందన్నారు. అలాగే ఉద్యోగుల కేటాయింపు, నైపుణ్యాల ఆధారంగా విభజన, శిక్షణా కార్యక్రమాలు, సేవా నిబంధనల రూపకల్పనపై మార్గ దర్శకాలు రూపొందించినట్లు చెప్పారు. ప్రధానంగా వ్యవసాయ, నీటి పారుదల, వాటర్ వర్క్స్ ఇతర వినియోగదారులను వేరు చేసి ఈ కొత్త డిస్కంకు అనుసంధానం చేసే ప్రక్రియ, డేటా సమీకరణ, వినియోగదారుల డేటాబేస్ తయారీ, సేవల సరళీకరణపై చర్చించినట్లు పేర్కొన్నారు.

## జీవన్‌రెడ్డి విషయంలో ఢిల్లీ నాయకత్వమే రంగంలోకి దిగాల్సింది: జగ్గారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్9:** మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడటంపై టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పందించారు. జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు పార్టీని వీడటం బాధాకరమన్నారు. సోనియాగాంధీ,రాహుల్‌గాంధీ కటుంబానికి విధేయుడిగా ఉన్నారని తెలిపారు. జీవన్‌రెడ్డి విషయంలో అంతర్గతంగా ఏం జరుగుతుందో ఎఐసిసి స్థాయిలో చెక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నేరుగా ఢిల్లీ నాయకత్వమే రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, ఎమ్మెల్యేలు,నాయకులు పార్టీలు మారడం ప్రస్తుతం రాజకీయాల్లో సహజమన్నారు. జీవన్‌రెడ్డి పార్టీ మారేందుకు గల కారణాలను బహిరంగంగా మీడియాతో చెప్పలేమని,అంతర్గతంగా పార్టీలో చర్చిస్తామని జగ్గారెడ్డి తెలిపారు.

# అనర్హుల రేషన్‌కార్డులు రద్దు.. క్షేత్రస్థాయిలో ముమ్మర సర్వే

## ఇప్పటికే లక్ష మంది అనర్హుల గుర్తింపు

## రేషన్‌కార్డుతో పాన్‌కార్డు, జీఎస్టీ నంబర్లు లింకు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఏ అర్హత లేకపోయినా వివిధ డొంక తిరుగుడు మార్గాల్లో రేషన్ కార్డులు పొందినవారిపై వేటు వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రేషన్‌కార్డు అనర్హులను ఏరివేసేందుకు సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ సర్వే నిరంతరం కొనసాగుతుందని రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో కొనసాగుతున్న రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియలో అనర్హులుగా తేలినవారి కార్డులను అధికారులు రద్దు చేస్తున్నారు. ఇటీవలి వెరిఫికేషన్‌లో లక్షమందికిపైగా అనర్హులను గుర్తించి వారి రేషన్ కార్డులను రద్దు చేశారు.

తాజాగా మరికొంత మంది రేషన్ కార్డులను రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే అనర్హుల గుర్తింపు ప్రక్రియ అనేది నిరంతరం కొనసాగుతున్న నేపథ్యంలో అన ర్హులుగా తేలితే ఎప్పుడైనా రేషన్ కార్డు రద్దు చేసే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి సర్వేలో హైదరాబాద్‌లో దాదాపు 2 లక్షల మంది ఐటీ చెల్లింపుదారులు రేషన్ కార్డులు కలిగి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో అనర్హుల రేషన్ కార్డులను రద్దు చేయడంతో పాటు ఇప్పటివరకు పొందిన సబ్సిడీలను రికవరీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పాన్ కార్డు, జీఎస్టీ నంబర్లను రేషన్ కార్డు డేటాతో లింక్ చేశారు. దీంతో హైదరాబాద్ నగరంలో దాదాపు 2 లక్షల మంది ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తూ రేషన్‌కార్డు పొందుతున్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ ఉద్యోగుల కార్డులు, ఐటి చెల్లింపుదారులను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో గుర్తించారు. అనంతరం అనర్హుల డేటా బయటకు వచ్చింది. ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించేవారి రేషన్ కార్డులను రద్దు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఆధార్, పాన్ వివరాలను ఇన్‌కమ్ ట్యాక్స్ డేటా సాయంతో పరిశీలిస్తోంది. అనంతరం వారి ఆర్థిక స్తోమతను అంచనా వేసి కార్డుల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఇక ఖరీదైన వాహనాలు కలిగి ఉన్నవారిని కూడా లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఇక మరణించిన వ్యక్తుల పేర్లపై ఉన్న కార్డులను కూడా తొలగించే ప్రక్రియ ప్రారంభమైంది. ఇక పిఎం కిసాన్ డేటా ప్రకారం 52 వేల మందికిపైగా ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లిస్తున్నట్లు వెల్లడైంది. రేషన్‌కార్డులకు పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామాల్లో రూ.1.50 లక్షల్లోపు వార్షిక ఆదాయం ఉన్నవారు అర్హులు.

# ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 9:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ప్రస్తుతం మోరంపూడి అనిల్ కుమార్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఉన్నారు. ఆయన స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు చేపడుతారు. వీరిద్దరూ తెలుగువారే. సురేశ్ బత్తినిని నియమిస్తూ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. సురేశ్ బత్తిని గతంలో హైదరాబాద్ రీజియన్‌లో చీఫ్ కమిషనర్‌గా పని చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపన్ను శాఖకు సంబంధించి అత్యున్నత పదవి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పదవి. పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షించడంతో పాటు చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటివి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ప్రధాన బాధ్యతలు.

# పవన్ ఖేరా యాంటిసిపేటరీ బెయిల్‌పై నేడు హైకోర్టు తీర్పు

## రాజకీయ కక్షతో కేసు నమోదు: అభిషేక్ మనుసింఘ్వీ

## హైదరాబాద్‌తో సంబంధం ఏమిటి?: అసోం ఏజి దేవ్‌జిత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 9:** కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా అరెస్ట్ అవుతారా లేదా అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య ఆస్తులు, పాస్‌పోర్టులపై చేసిన ఆరోపణల కేసులో తనను అరెస్ట్ చేయకుండా ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ కోరుతూ ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో గురువారం జస్టిస్ సుజన బెంచ్ ముందు విచారణ జరిగింది. ఖేరా తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపుతో నమోదు చేసినదేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, పరువు నష్టం కేసులో అరెస్ట్ చేయడానికి ఇంటికి వంద మందిని పంపిస్తారా? అని సింఘ్వీ వాదించారు. అయితే అసోం అడ్వకేట్ జనరల్ దేవజిత్ లోన్ సైకియా ఈ వాదనలను ఖండిస్తూ, ఢిల్లీ నివాసి అయిన ఖేరా హైదరాబాద్‌లో ముందస్తు బెయిల్ ఎందుకు కోరారో సరైన కారణాలు చూపలేదని కోర్టుకు తెలిపారు. ఈ కేసును విచారించే పరిధి తెలంగాణ హైకోర్టుకు లేదని, ఖేరా ఆధార్ అడ్రస్ ఢిల్లీలో ఉందని, ఆయనకు హైదరాబాద్‌లో ఏం సంబంధమని ప్రశ్నించారు. కాగా, అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ భార్యకు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో ప్రకటించని ఆస్తులు ఉన్నాయని పవన్ ఖేరా ఇటీవల ఒక ప్రెస్ మీట్‌లో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై అసోం పోలీసులు ఆయనపై పరువునష్టం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర వంటి భారతీయ న్యాయ సంహితలోని 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ ఇవ్వాలని ఖేరా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్ నమోదైన రాష్ట్రంలోని పోలీసులు అరెస్ట్ చేయకుండా కాపాడేది ఈ బెయిల్, ఆ తర్వాత ఆయన సంబంధిత రాష్ట్రంలోని కోర్టును ఆశ్రయించేందుకు వీలు కలుగుతుంది. కాగా, పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పిటీషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరగగా హైకోర్టు ధర్మాసనం తీర్పు వెల్లడిని శుక్రవారానికి వాయిదా వేసింది.

# ఆరోగ్యం సరిగా లేకుంటే సంపాదన ఎంతున్నా వృథానే

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## కేబుల్‌బ్రిడ్జిపై వైద్య శాఖ వలంటీర్ల మానవహారం



వలంటీర్లతో కలిసి కేబుల్‌బ్రిడ్జిపై మానవహారంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఆరోగ్యం సక్రమంగా లేకపోతే ఎంత సంపాదన ఉన్నా వ ృథానే అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మాదాపూర్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధ్వర్యంలో మిషన్ ఎయిడ్స్ సురక్ష పేరిట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాదాపూర్‌లోని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జీ మీద వైద్య శాఖ వాలంటీర్లు మానవ హారం నిర్వహించి ఎయిడ్స్ వ్యాధిపై అవగా హన కలి ్పంచారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిదిగా హాజరై వలంటీర్లతో కలిసి మానవహారంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్‌ను మానసిక వేదన, ప్రాణాంతక వ్యాధిగా భావించామని, ఎయిడ్స్ వ్యాధి బాధితులు ఎన్నో అవమానాలకు గురయ్యారని అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మరింత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మానవ హారాలు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. హెచ్ఐవీ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పరీక్షలు, చికిత్స, మందులు అందజేస్తుందనా ్నరు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ప్రమాదకరమైన ఇంజక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకుంటే హెచ్ఐవీ వంటి ఇతర రోగాలు వా ్యపించే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్య క్రమంలో తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారా యణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# పొంగులేటి కాదు.. పొంగులూటి

## అక్రమాలన్నీ బయట పెడతాం

## అవినీతి బాగోతం బట్టబయలయ్యేసరికి బూతులు

## వనపర్తిలో మీడియాతో మాజీమంత్రి హరీశ్‌రావు

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** నేనొక్కన్నే అవినీతిపరుడుని కాదు అందరూ మంత్రులు అవినీతిపరులే అని తేల్చారని, జూపల్లి కృష్ణారావు సీఎం బట్టి సహ రాష్ట్రంలో అవినీతి కుంభకోణాల చిట్టా ఆయనే చదివారని పొంగులేటి కాదు పొంగులూటీ అని ఆయనే చెప్పకనే చెప్పారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. అవినీతి బాగోతం బట్టబయలు అయ్యేసరికి డిఫెన్స్‌లో పడి బూతులు తిట్లు పిట్టకథలు చెప్పాడంటూ హరీష్ రావు ఫైర్ అయ్యారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత పవిత్రమైన సచివాలయంలో పొంగులేటి మాటలు ఆయన బూతులు చూస్తే ఫ్రస్టేషన్ తెలుస్తుంది అన్నారు. ఒక రాష్ట్ర మంత్రిగా కాకుండా రాఘవ కన్స్ట్రక్షన్స్ అధినేతగా మాట్లాడారని పేర్కొన్నారు. తన కొడుకును కాపాడుకునే ప్రయత్నం చేశారని పిట్ట కబుర్లు చెప్పి బయటపడాలని అనుకున్నాడని అన్నారు. పొంగులేటి పొగరు తగ్గించుకో అంటూ హితవు పలికారు. రాఘవకు మైనింగ్ లేదని ఎందుకు చెప్పలేదని, అసెంబ్లీలో ఉండి కూడా నాది కాదని ఎందుకు చెప్పలేదు జవాబు ఇవ్వాలన్నారు. నాగర్‌కర్నూల్ భూములు కాపాడింది బీఆర్ఎస్ పార్టీ అని స్పష్టం చేశారు. నిషేధిత భూముల జాబితాలో పెట్టింది, హైకోర్టులో కూడా కొట్లాడింది బీఆర్ఎస్ అని వివరించారు. అవి ప్రభుత్వ భూములు అయితే రోజుకొక పేరు ఎందుకు మారుతుందని, భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని, ఎందుకు కంపెనీల బోర్డులు మారుతున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకవేళ నిజంగా ప్రభుత్వ భూములు అయితే హైడ్రాక్ గడ్డి పీకుతుందా అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆర్డిఓ ఏం చేస్తున్నారు ప్రభుత్వ ల్యాండ్ అని ఆర్డర్ ఉండగా హైడ్రా ఎందుకు కండ్లు మూసుకుంది. నిజాయితీ ఉంటే చిత్తశుద్ధి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొంగులేటి ఇప్పటికైనా తప్పు ఒప్పుకో ప్రజలకు క్షమాపణ చెప్పు అంటూ హితవు పలికారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతపై తనిఖీ బృందాల కన్ను

## రాష్ట్రవ్యాప్తంగా 299 తనిఖీ బృందాలు ఏర్పాటు

## ఇప్పటికే 4,600 పాఠశాలల్లో తనిఖీలు

## వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరింత దూకుడు

## ముఖ్యమంత్రి కార్యాలయ ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 9:** పాఠశాల విద్యలో నాణ్యతను మెరుగుపరచాలనే లక్ష ్యంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు చూపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ 2025 సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించేందుకు 299 బృందాలను నియమించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ముగ్గురు ఉపాధ్యాయులతో, ఉన్నత పాఠశాలలకు తొమ్మిది మంది ఉపాధ్యాయులతో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ ఈ తనిఖీ బృందాలను గుర్తించి నియమించింది.

| బృందాల సంఖ్య | చేపట్టిన తనిఖీలు |
|---|---|
| ప్రాథమిక 168 | 3,409 |
| ప్రథమికోన్నత 35 | 557 |
| ఉన్నత 96 | 589 |
| మొత్తం 299 | 4,555 |

ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కనీసం 10 సంవత్సరాల అనుభవం, ఇన్‌సర్వీస్ శిక్షణ, డిజిటల్ అక్షరాస్యత, క్రమశిక్షణా రికార్డు సవ్యంగా ఉన్న టీచర్లను ఇన్‌స్పెక్టింగ్ అధికారులుగా ఎంపిక చేశారు. కేటాయించిన పాఠశాలల్లో తనిఖీలు పూర్తి చేసి, ప్రతి వారం డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లకు (డిఈఓ) నివేదికలు సమర్పించాలని మార్గదర్శకాలు జారీ చేశారు.

ఇప్పటిదాకా సుమారు 4,600 పాఠశాలల్లో తనిఖీలు జరిగాయి. వీటిలో 3,966 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు; 589 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పనితీరు ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉపాధ్యాయుల వివరాలు, సిలబస్ పూర్తి చేయడంలో వెనుకబడిన తరగతుల స్థితిగతులు. ఈ నివేదికల్లో క్రమం తప్పకుండా నమోదవుతున్నాయి. ఈ తనిఖీల ప్రభావం ఉపాధ్యాయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. బోధనలో నిర్లక్ష ్యం వహిస్తున్న ఉపాధ్యాయుల్లో ఈ బృందాల పట్ల ఆందోళన పెరిగిందని చర్చ జరుగుతోంది. అదే సమయంలో, కొందరు ఉపాధ్యాయులు నివేదికల రూపకల్పన, పాఠశాల పరిపాలనా వ్యవహారాల పేరుతో పాఠ్యాంశాలు నిర్ణీత సమయంలో పూర్తి చేయడంలో వెనుకబడుతున్నట్లు తేలింది. బోధనలో లోపాల వల్ల విద్యార్థులు నాణ్యమైన చదువుకు దూరం కాకుండా చూడటమే ఈ బృందాల ప్రధాన లక్ష ్యం. ఆకస్మిక తనిఖీలతో పాటు, ఇప్పటికే తనిఖీ చేసిన పాఠశాలలను మళ్ళీ పర్యవేక్షి ంచే బాధ్యత కూడా ఈ బృందాలకు అప్పగించారు. తొలి తనిఖీ తర్వాత పాఠశాలలు మళ్ళీ పాత పద్ధతులకు మళ్ళకుండా నిరంతర పర్యవేక్షణ సాగిస్తున్నారు.

జిల్లాలోని ప్రతి పాఠశాలలో తనిఖీలు జరిగేలా, ఒక్కో బృందానికి మూడు నెలల వ్యవధిలో 100 ప్రాథమిక/ప్రాథమికోన్నత లేదా 50 ఉన్నత పాఠశాలల చొప్పున లక్ష్యాలను నిర్దేశించారు. అయితే, కొన్ని జిల్లాల్లో తనిఖీలు ఆశించిన స్థాయిలో సాగలేదని గుర్తించి, వచ్చే విద్యా సంవత్సరం నుండి మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, పాఠశాల తనిఖీలు అత్యధికంగా సంగారెడ్డి (811), సూర్యాపేట (442), ఆదిలాబాద్ (429), నాగర్ కర్నూల్ (367) జిల్లాల్లో జరగ్గా పెద్దపల్లి, నిర్మల్, మెదక్, వికారాబాద్ లలో అసలు తనిఖీలే మొదలవ్వలేకపోవడం గమనార్హం.

# 12న ఇంటర్ ఫలితాలు?

## ఫలితాలను ముఖ్యమంత్రి విడుదల చేసే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలను ఈ నెల 12న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరే విద్యాశాఖ కూడా కొనసాగుతున్నందున ఇంటర్ ఫలితాలను సీఎం స్వయంగా విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఫలితాలను సీఎం ఇంటి దగ్గర విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీఎం ఫలితాలను విడుదల చేయడానికి కారణం.. రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయడంతోపాటు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు, పాలు కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మార్చి 20న ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఇందుకు సంబంధించి నిధులను సైతం కేటాయించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం రూ. 70 కోట్లను కేటాయించగా.. బ్రేక్‌ఫాస్ట్, పాలు ఇవ్వడం కోసం రూ. 56 కోట్లను కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను అమలు చేసే విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటిస్తూ.. ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 12న కాకపోతే 13న ఇంటర్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభమై మార్చి 18తో ముగిశాయి. ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 15 నుంచి 20 కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ నెల1తో మూల్యాంకన ప్రక్రియ ముగిసింది. మూల్యాంకన అనంతరం ఫలితాల విడుదలకు సంబంధించిన క్రోడీకరణ పనులను ఇంటర్ బోర్డు అధికారులు ఈ నెల 8 వరకు పూర్తి చేశారు. ఇంటర్ ఫలితాల విడుదల కోసం ఇంటర్ బోర్డు ప్రభుత్వానికి ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఏదో ఒకరోజు విడుదల చేయడానికి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. గురువారం ఇంటర్ బోర్డు అధికారులు విద్యాశాఖ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నెల 12న ఫలితాలను విడుదల చేయడానికి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఒకవేళ ఈ నెల 12న వీలుకాకపోతే 13న ఇంటర్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది.

# థియేటర్లలో పర్సంటేజ్ చిచ్చు

## నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ముదురుతున్న వివాదం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** తెలంగాణలోని సినిమా రంగంలో థియేటర్ల చిచ్చు రేగింది. పర్సంటేజ్ విధానం అమలుపై థియేటర్ యజమానులు (ఎగ్జిబిటర్స్), నిర్మాతల (ప్రొడ్యూసర్స్) మధ్య వివాదం చెలరేగి తారాస్థాయికి చేరింది. పర్సంటేజ్ విధానం ప్రకారం సినిమా టికెట్ కలెక్షన్లలో ఒక నిర్దిష్ట శాతం నిర్మాతలు, థియేటర్ యజమానుల మధ్య పంచుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న రెంటల్ లేదా ఫిక్స్‌డ్ మోడల్ విధానం రద్దు చేసి పర్సంటేజ్ పద్ధతిని ప్రొడ్యూసర్స్ తెరమీదకు తెచ్చారు. సినిమా థియేటర్లలో పర్సంటేజ్ విధానం అమలు చేస్తే తమ ఆదాయం స్థిరంగా ఉండే అవకాశం ఉందని ఎగ్జిబిటర్స్ చెబుతున్నారు. అయితే యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ మాత్రం ఈ విధానానికి వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. నిర్మాతల వాదన ప్రకారం పర్సంటేజ్ విధానం వల్ల తమకు వచ్చే లాభాలు తగ్గే ప్రమాదం ఉందని ఆభ్యతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల విషయంలో ఈ విధానం అనుకూలంగా ఉండదని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్సంటేజ్ విధానం పట్ల అనుకూల, వ్యతిరేక వైఖరి అవలంబించడంతో ఇరువర్గాల మధ్య ఈ విభేదాలు పరిష్కా రం కాక మరింత బిగుసుకుంటోంది. దీంతో చిత్ర పరిశ్రమలో అనిశ్చితి నెలకొంది. త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న డెకాయిట్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ వంటి సినిమాలపై ఈ వివాదం ప్రభావం చూపే అవకాశముంది. పరిస్థితులు చక్కబడకపోతే రిలీజ్ తేదీలు మారే అవకాశం ఉండటంతో పాటు కొన్ని సినిమాలు వాయిదా పడే పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఇప్పటికే టాలీవుడ్ మార్కెట్‌పై ఈ పరిస్థితి ప్రతికూల ప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి.

# రాష్ట్రంలో పెరిగిన వరి దిగుబడి

## తెలంగాణకు బాయిల్డ్ రైస్ కోటాను పెంచాలి

## కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రానికి ఉడికించిన బియ్యం లక్ష్యాన్ని (2024-25 రబి సిజన్‌కు) 5 లక్ష మెట్రిక్ టన్నుల మేర పెంచాలని, అదే స్థాయిలో ముడి బియ్యం లక్ష్యాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 8.45 లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా సరఫరా చేయాల్సి ఉన్న నేపథ్యంలో మరో 60 రోజుల గడువు ఇవ్వాలని కోరారు. తెలంగాణలో పండిన వరి నాణ్యత అధికంగా ఉండటంతో, ఉడికించిన బియ్యం తయారికి అనుకూలమని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు కూడా కేవలం 5శాతం బ్రోకెన్స్‌తో సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, కేంద్రం తగ్గిస్తున్న కొనుగోలు లక్ష్యాల మధ్య అసమతౌల్యత ఏర్పడుతున్న నేపథ్యంలో గురువారం ఆయన కేంద్ర ఆహారశాఖమంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ముందు మూడు ముఖ్యమైన డిమాండ్లను ఉంచారు. 2025-26 (ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి) కోసం ఉడికించిన బియ్యం లక్ష్యాన్ని 20 లక్ష మెట్రిక్ టన్నుల మేర పెంచాలని డిమాండ్ చేశారు. ఇది రాష్ట్రంలో పెరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా అవసరమని స్పష్టం చేశారు. రబి 2024-25 బియ్యం సరఫరాకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని కేంద్రాన్ని ఆయన కోరారు. ఖరీఫ్ వరి నిల్వల భౌతిక పరిశీలన ఇంకా పూర్తికాకపోవడంతో మిల్లింగ్ ప్రక్రియకు అదనపు సమయం అవసరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని లేఖలో మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్రం డి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ స్కీమ్ ద్వారా వరి కొనుగోలు చేస్తోందన్నారు. అయితే కేంద్రం కస్టమ్ మిల్లింగ్ రైస్, ఉడికించిన బియ్యం లక్ష్యాలను తగ్గించడంతో రాష్ట్రానికి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని లేఖలో స్పష్టం చేశారు. ఎఫ్‌సిఐకి 2024-25లో సరఫరా చేసిన ఉడికించిన బియ్యం శాతం 66.78 కు పడిపోయిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి భారీగా పెరుగుతున్నా.. కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానాలు అందుకు అనుగుణంగా లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# విజిలెన్స్ అప్రమత్తతతో రూ.90 కోట్ల ఆదాయ నష్టనివారణ

## అక్రమంగా రవాణా చేస్తున్న 2,669 మె.ట ఇసుక స్వాధీనం

## 134 వాహనాల సీజ్, 27 ఎఫ్ఐఆర్‌లు నమోదు

## రూ.103.70లక్షల పిడిఎస్ బియ్యం స్వాధీనం

## పనితీరు సమీక్షించిన డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్

## అత్యుమ ప్రతిభ ప్రదర్శించిన అధికారులకు నగదుపురస్కారం



విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆరునెలల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తన ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాల్లో అప్రమత్తతో వ్యవహరిస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ తెలంగాణ ప్రభుత్వంకు చెందిన వివిధ శాఖల్లో ఆరునెలల కాలంలోనే రూ.90 కోట్ల మేర ఆదాయ నష్టనివారణ చేయడం జరిగిందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్ తెలిపారు. గురువారం బిఆర్‌కెభవన్‌లో ఎనిమిది ప్రాంతీయ విభాగాల సిబ్బందితో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గత ఆరునెలల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాత్రనకా పగలనకా, వర్షం, చలి, ఎండా లెక్క చేయకుండా ఒక టీమ్‌లా మనం పనిచేయడంతో రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా రవణా చేయబడుతున్న 2,669 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం ఈ ఆరు నెలల కాలంలోనే స్వాధీనం చేసుకొన్నామని చెప్పారు. ఇసుక అక్రమరవాణాపై 27 ఎఫ్ఐఆర్‌లు నమోద య్యాయని, 134 వాహనాలను సీజ్ చేశారని తెలిపారు. రైస్‌మిల్లులపై ఆకస్మిక దాడులు చేసి పెద్ద ఎత్తున అక్రమాలను కట్టడి చేయగలిగామని ఇదే స్ఫూర్తితో ముందుముందు పనిచేయాలని సిబ్బందిని కోరారు. ప్రజాపంపిణీ బియ్యం రూ.103.70 లక్షల విలువగలవి అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకున్నామని గణాంకాలతో అధికారులకు వివరించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి విచారణల పట్ల సమగ్ర విధానాన్ని అవలంబించడంపై దృష్టి కేంద్రీకరణ చేయాలని శిఖా హితవు చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేది కేవలం ప్రభుత్వ ఆదాయ లీకేజీలను గుర్తించడమే కాకుండా, సేవా పంపిణీ లోపాలను కూడా పరిష్కరించాలని, అవసరమైన చోట అధికారులపై బాధ్యతను నిర్ణయించాలని ఆమె నొక్కి చెప్పారు. ప్రాంతీయ విభాగాలు ఎవరి ఆదేశాల కోసం వేచి చూడకుండా చురుకుగా వ్యవహరించాలని, తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా తమ పనితీరును మెరుగు పరచుకోవాలని ఆదేశించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సేవా రంగంలో అత్యుత్తమ ప్రతిభను గుర్తించడానికి త్రైమాసిక నగదు పురస్కారంను ప్రారంభించామని ఆమె ప్రకటించారు. విజిలెన్స్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్, విచారణలు, అడ్మినిస్ట్రేటివ్ పని అనే మూడు విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని గౌరవించడానికి మొట్టమొదటిసారి ఈ రివార్డ్స్ రోల్‌ను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. పారదర్శకతను నిర్ధారించడం, సమర్థవంతమైన పాలనను బలోపేతం చేయడంపై నిరంతర దృష్టితో, ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేది శాఖ యొక్క ప్రధాన బాధ్యతగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం మళ్లింపు. ఆహార కల్తీ వంటి అంశాలపై శాఖ ప్రాథమికంగా దృష్టి సారిస్తుందని డిజి స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి, పన్ను ఎగవేతను నిరోధించడానికి, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటానికి, రవాణా, వాణిజ్య పారిశ్రామిక చట్టాలకు కట్టుబడి ఉండేలా ప్రతిక్షణం డేగకన్నువేసి ఉండాలని కోరారు. అక్రమాలు లేదా ప్రభుత్వ నిధులు వనరుల దుర్వినియోగం గురించి పౌరుల నుంచి సమాచారం విరివిగా అందుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్14432 బహుళ ప్రచారంలోకి తీసుకొని రావాలని ప్రతి గ్రామపంచాయతీ గోడపై, పాఠశాలల గోడలపై ముద్రించాలని ఆమె కోరారు. విజిలెన్స్ శాఖలో ఉద్యోగులు గుర్తింపుప్రేరణను పెంపొందించడానికి ప్రతి త్రైమాసికంలో ఈ రివార్డ్స్ రోల్‌ను నిర్వహిస్తామని ఆమె ప్రకటించారు. విధి పట్ల అసాధారణమైన నిబద్ధత, చిత్తశుద్ధి సేవా పంపిణీని ప్రదర్శించిన 67 మంది అధికారులకు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆర్.సి. పురం సమర్ధవంతమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరుకు, హైదరాబాద్‌రూరల్ అత్యధిక విచారణల పరిష్కారానికి, కరీంనగర్ ఆదాయ నష్ట నివారణ గుర్తింపులో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో శిఖా ఆయా యూనిట్లను అభినందించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎ.ఆర్. శ్రీనివాస్, ఐపిఎస్ , డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అభిషేక్ మహంతి, ఐపిఎస్, ఎస్పీ బాల స్వామి, ఐపిఎస్, అందరూ రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.

**ఇ-వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది సాధారణ ప్రజానీకానికి సమాచారం నిమిత్తం ప్రకటించునది ఏమనగా వివిధ కేటగిరీల 1800 సంఖ్య, ఆకు పచ్చని నిట్టనిలువు చెట్లు దేవరయాంజల్, హకీంపేట్, సికింద్రాబాద్ వద్ద 29.04.2026న ఉ.11.00 గం.కు ఇ-వేలం ద్వారా ఎయిర్ వార్‌ఫేర్ కళాశాల యొక్క రీలొకేషన్ కొరకు విక్రయించబడును. ఆ చెట్లు కాంట్రాక్టర్‌కు 27.04.2026న, 28.04.2026 11.00 గం. వరకు చూపించబడును. ఉద్దేశ్యం ఉన్న బిడ్డర్ సదరు చెట్లను వీక్షించటానికి మరియు లొకేషన్ చూడటానికి, చెట్ల తనిఖీకి రావటానికి స్థానిక మిలటరీ అథారిటీతో (మొబైల్ నం. 7073766150, 9205458451) సంప్రదించినట్లయితే అనుమతించబడతారు. ఇ-వేలంలో పాల్గొనటానికి https://eauction.gov.in/eAuction/app వద్ద ప్రభుత్వ ఇ-వేలం సిస్టమ్ యొక్క పోర్టల్‌ను దయచేసి వీక్షించండి.

సం/- (C. దినేష్ కుమార్ రెడ్డి)
డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్
T & AP సర్కిల్, సికింద్రాబాద్

వార్త

ఓర్పు లేకపోవడం ఒక రకమైన దౌర్జన్యం. అది ప్రజాస్వామ్య ప్రగతికి అవరోధం.

- మహాత్మా గాంధీ

# ప్రకృతితో చెలగాటాలొద్దు !

మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. పర్యావరణాన్ని కాపాడకపోతే మానవుడి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతున్నా పట్టించుకునేవారే లేకుండాపోతున్నారు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. ప్రస్తుతం అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న అణుయుద్ధంలో ఎంతటి విధ్వంసం జరుగుతున్నది వేరే చెప్పక్కర్లేదు. ముఖ్యంగా పర్యావరణానికి ఎంతటి చేటు తెస్తుందో శాస్త్రజ్ఞుల అంచనాలకు అందడం లేదు. ఇక అభివృద్ధి పేరుతో పాలకులు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి ఎంతో హాని చేస్తున్నాయి. ఇష్టానుసారంగా తవ్వకాలు మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ విధ్వంసం జరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత దేశ జనాభాయే మరో దశాబ్దం నాటికి నూటయాభై కోట్ల వరకు చేరుకుంటుందని అందుకు తగినట్టుగా దేశంలో సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్‌లో ప్రతిరోజూ దాదాపు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూములు అదృశ్యమైపోతున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీ లోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ కాగితాలు మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈ ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంత నష్టం చేకూరుస్తున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార వర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. పెట్రోలు, డీజిల్, ఇథనాల్ వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. ఎన్ని చట్టాలు చేసినా, మరెందరిపై జరిమానాలు విధించినా పెరుగుతున్న వాహనాల సంఖ్య రెట్టింపుస్థాయిలో వాహన కాలుష్యాన్ని పెంచుతున్నది. ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళి కణాలు, తదితరవన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని విస్తరిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ లాంటి ప్రదేశాల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా చలికాలంలో పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. నీటి కాలుష్యం పరిస్థితి అదుపు తప్పుతున్నదేమో. పెరుగుతున్న మురికివాడలనుంచి వెలువడుతున్న కలుషిత నీరు అంచలంచెలుగా నదుల్లోకి చేరుకొని పెద్దపెద్ద నదులను మురికి కూపాలుగా మారుస్తున్నాయి. ఈ నది, ఆ నది అని కాదు. దేశంలోని నదుల్లో నీటి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఇలాంటి ఎన్నో కారణాలతో భూ ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే ఇందుకు ప్రతీగా ప్రకృతి రెట్టింపు స్థాయిలో స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురియడం లేదు. కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం, వరదలు, తుఫాన్‌లు భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకొంటున్నాయి. యేటా దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు పోగొట్టుకుంటే కోట్ల సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతీ, న్యూజిలాండ్, నేపాల్ లాంటి ఎన్నో దేశాలలో వస్తున్న భూ కంపాలు విలయాన్నే సృష్టిస్తున్నాయి. సిరియాలో భూకంపం కారణంగా దాదాపు తొమ్మిదివేల మందికిపైగా అసువులు బాసారు. మెరోకోలో వచ్చిన భూకంప ప్రకంపనాలతో దాదాపు నాలుగువేల మంది జీవితాలు సజీవమయ్యాయి. పశ్చిమ ఆఫ్ఘానిస్థాన్‌లో భూప్రకంపనాలు విలయాన్నే సృష్టించాయని చెప్పొచ్చు. భారత్‌కు సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూప్రకంపన వార్తలు వింటూనే ఉంటున్నాం. చెన్నై, ముంబయి, కోల్‌కతా, పూణె, ఢిల్లీ లాంటి దాదాపు డెబ్బై నగరాలకు భూప్రకంప నాలు పొంచి ఉన్నట్లు శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇక వరదలు, తుఫాన్‌లతోవ్యవసాయ రంగం కుదేలైపోతున్నది. తుఫాన్‌ల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించుకోలేకపోతున్నాయి. గతంలో దివిసీమలో సంభవించిన తుఫాన్ సిరిధాన్యాలతో తులతూగే ఆ ప్రాంతాన్ని శవాల దిబ్బగా మార్చేసింది. ఇప్పటికీ ఆ బీభత్సం గురించి మరచిపోలేకపోతున్నారు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో విలయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించక తప్పదు.

సంతృప్తిపడే వ్యక్తి ఏనాటికీ పేదవాడు కాదు. అలాగే అసంతృప్తి చెందే వ్యక్తి ఎన్నటికీ సంపన్నుడు కాలేడు.



థామస్ జెఫర్సన్

నేరస్తులను శిక్షించుటే ప్రధానంకాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్‌కామూ

## ప్రజావాక్కు



### రోగులపై దయ,దాక్షిణ్యాలు చూపండి

అందినకాడికి రోగుల నుంచి దోచుకోవడమే ఈ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల పని. రోగులకు వున్న సాధారణ జబ్బును కూడా మసి పూసి మారేడు కాయ చేసి వారి జేబులకు చిల్లులు పడేలా చేయడమే వారి పని. అదేమో గాని అక్కడి వాతావరణం చూస్తే గుండె ఆగినంత పని అవుతూ ఉంటుంది. అటురోగులకు, ఇటు రోగుల బంధువులకు కూడా. ఎందుకంటే ఒక్క రోజులో డిశ్చార్జ్ చేసే పేషెంట్‌ను కుడా మూడు రోజులు పెట్టుకొని వారికి కావలసిన కాడికి దండుకోవడమే వారి పని. కాబట్టి మనమంతా మన పెద్దలు సెలవిచ్చిన కొన్ని మంచి ఆరోగ్య చిట్కాలు పాటిస్తే కార్పొరేట్ ఆసుపత్రుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకుంటూ మన ఆరోగ్యాన్ని మరో పది కాలాల పాటు వర్ధిల్లేలా చేసుకోవచ్చు. అలా చేయకుండా మన ఇష్టానుసారం ఒక పద్ధతి పాడు లేకుండాఆహారాన్ని తీసుకుంటే మాత్రం ఎవ్వరూ కాపాడలేరు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### అక్రమ వ్యాపారాలను రద్దు చేయాలి

ఎస్సీ,ఎస్టీ పేదలు రాళ్లు రప్పలు సాగు చేసుకుంటున్న భూములను 1978లో గుర్తించి ప్రభుత్వం ఇనాం భూమిగా ఇచ్చింది. అట్టి భూమిని కేవలం వ్యవసాయ పంట పొలాలకు మాత్రమే వినియోగించాలి. ఇట్టి పంచారాయి భూములు రిజిస్ట్రేషన్ కావు.కానీ అక్రమంగా రెవెన్యూ రికార్డులలో పట్టా భూములుగా నమోదు చేసుకుని ప్రభుత్వబ్యాంకుల ద్వారారుణాలు తీసుకొని బర్లషెడ్డు నిర్మించి, పాడిగేదెలపై ఋణం తీసుకొని, అనుమతి లేని పాల డైరీలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి అట్టి వ్యాపారాలను రద్దు చేయాలి. అదే ప్రాంతాలలో బెల్టు షాపుల దందా ఊరి చివరన జరుగుతున్న ఇలాంటి సంఘటనలను ప్రభుత్వం రద్దు చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

### అహంకారం వీడితే

పంతాలను, దోషాలను విడిచిపెట్టి పరస్పరం సహకరించుకుంటూ ఇండియా కూటమి పార్టీలు రంగంలోకి దిగాలి.ఐక్యమత్యంతో పనిచేసి గెలుపును అందిపుచ్చుకోవాలి. అలాకాక మాకు ఎవరితోనూఅవసరం లేదు, నేను గొప్ప, నా పార్టీ గొప్ప, ఏ పార్టీతోనూ పొత్తు లేదు అంటూ అహంకారపు మాటలు వల్లే వేస్తూ ఒంటరిగా బరిలోకి దిగితే నష్టపోయేది ఇండియా కూటమి పార్టీలే.

-రాశి, హైదరాబాద్

### వృద్ధులను నిర్లక్ష్యం చేయొద్దు

నేటి ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై వ్యష్టికుటుంబాలు పెరగడంవల్ల వృద్ధులు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఒకప్పుడు ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్నవారు నేడు ఒంటరితనంతో కొట్టుమిట్టాడుతున్నారు. పిల్లలు ఉద్యోగాల రీత్యా దూరమవ్వడం, కనీస పలకరింపు కరువవ్వడం వల్ల వారిలో మానసిక వేదన, నిరాశ పెరుగుతున్నాయి. ఆర్థికంగా ఇతరులపై ఆధారపడటం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోంది. వృద్ధాశ్రమాల సంఖ్య పెరగడం సామాజిక పతనానికి నిదర్శనం. ఆస్తుల కోసం తల్లిదండ్రులను వేధించడం, వారిని భారంలా భావించి వదిలేయడం మానవత్వానికే మచ్చ. వృద్ధులు అనుభవాల గనులు. వారి జ్ఞానం నేటి తరానికి ఎంతో అవసరం. వారిని కేవలం ఇంటి పనులకే పరిమితం చేయకుండా,కుటుంబనిర్ణయాల్లో భాగస్వాములను చేయాలి. ప్రభుత్వాలు కూడా వృద్ధుల సంక్షేమం కోసం కఠినమైన చట్టాలు, ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### జలంతో చెలగాటం

వేసవి సెలవుల్లో ఎండ వేడిమికి ఉపశమనం కోసంకాలువ, చెరువు, బావి, సముద్రం, నదుల్లో ఈతకు వెళ్లి మృత్యువాత పడికన్నవారిని బంధుమిత్రులను దుఃఖసాగరంలోకి నెట్టుతున్నారు. పిల్లలు పెద్దలు ప్రమాదమని తెలిసి కూడా ఏమీ కాదులే అన్న నిర్లక్ష్యం వల్ల బంగారు జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. నిత్యం ఏదోఒక చోట ఇలాంటి దుర్ఘటనలు జరుగుతుండడం ఆందోళనకరం. అందుకే భయం కూడా మనిషికి వరమంటారు. లైఫ్‌లో సరదా ఒక భాగమని గుర్తించాలి. పర్యాటనలు, పండుగలు ఎంజాయ్ చేయాలికానీ జలంతో చెలగాటం వద్దు.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### సంబంధాల అనుభూతులు

నేటి కాలంలో రక్త సంబంధాల కంటే స్నేహ సంబంధాలు, పరిచయ సంబంధాలు చాలా గొప్పవి. రక్త సంబంధాలు ఎల్లప్పుడూ మనకు దగ్గరగా ఉంటాయి. స్నేహ సంబంధాల వారితో అన్ని విషయాలు పంచుకోవచ్చు. అందరూ ఒకే వేదికపై పని చేసి అర్థాంతరంగా మనకు అనుభూతుల్ని పంచి మననుండి దూరంగా వెళ్తారు.ఇలాంటి స్నేహ సంబంధాలను జీవితాంతం గుర్తుంచుకోవాలి.ఇలాంటి బంధాలు చాలా పదునుగా నమ్మకంగాను ఉంటాయి. అందుకే వీలైనంత వరకు నిరంతరం స్నేహ సంబంధాలను ముందుకు తీసుకెళ్లండి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# బకాయిల భారంతో 'విద్య'కు దారేది?

**విద్య అనేది కేవలం వ్యక్తిగత ప్రయోజనం కాదు, అది సామాజిక అభివృద్ధికి పునాది. బహుజన వర్గాల విద్యాభివృద్ధి లేకుండా సమానత్వం సాధ్యం కాదు. కాబట్టి ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయదృష్టితో చూడాలి. మొత్తంగా చూస్తే, విద్యహక్కు కేవలం రాజ్యాంగంలో ఉన్న ఒక నిబంధనగా మిగలకుండా, ప్రతి పేద విద్యార్థి జీవితంలో నిజంగా అమలవ్వాలంటే ప్రభుత్వాలు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి. లేకపోతే శతాబ్దాలుగా కొనసాగుతున్న అన్యాయం మరో రూపంలో కొనసాగుతుంది. బహుజన వర్గాల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంది. ఆ విద్యను కాపాడటం అనేది కేవలం ఒక విధానం కాదు, అది ఒక సామాజిక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం. విద్యనుహక్కుగా మాత్రమేకాకుండా, సమానత్వానికి మార్గంగా భావించే దిశగా అడుగులు వేయాల్సిన సమయంఇదే.**



మన్నారం నాగరాజు

భారతదేశ చరిత్రలో విద్య అనేది కేవలం జ్ఞానాన్ని అందించే సాధనం మాత్రమే కాదు, అది అధికారాన్ని, అవకాశాలను, సమానత్వాన్ని నిర్ణయించే అత్యంత ప్రభావవంతమైన ఆయుధంగా పనిచేసింది.కానీ ఈ ఆయుధం అందరికీ సమానంగా అందలేదు. శతాబ్దాలుగా వర్ణవ్యవస్థ కట్టుబాట్లలో బంధించబడిన బహుజన వర్గాలు,ప్రత్యేకంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ సమాజాలు, విద్య అనే హక్కు నుండి దూరం చేయబడ్డాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి అమానుష ఆచారాలు కేవలం వారి గౌరవాన్ని మాత్రమే కాదు, వారి భవిష్యత్తును కూడా కట్టడి చేశాయి. ఈ చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడానికి భారత రాజ్యాంగం ఒక మహత్తర సాధనంగా అవతరించింది.రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ స్పష్టంగా గుర్తించిన విషయం ఏమిటంటే,సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న అసమానతలను కేవలం చట్టపరమైన సమానత్వంతోనే తొలగించలేమని, అందుకే రాజ్యాంగంలో ప్రత్యేక నిబంధనలు చేర్చి అణగారిన వర్గాల విద్యా, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్టికల్ 21ఎ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించడం, ఆర్టికల్ 46 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధికి రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొనడం,ఈ నిబంధనలన్నీ చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికే ఉద్దేశించబడ్డాయి. అయితే,రాజ్యాంగంలో ఉన్న ఈ గొప్ప ఆలోచనలు వాస్తవ జీవితంలో ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్న నేటికీ నిలిచే ఉంది. నేటి భారత సమాజంలో అక్షరాస్యత శాతం పెరిగినప్పటికీ, వర్గాల మధ్య అసమానతలు మాత్రం స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. అగ్రవర్ణాలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యా స్థాయి ఇంకా వెనుకబడినట్టే ఉంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది చారిత్రకంగా ఏర్పడిన సామాజిక అడ్డంకులప్రతిబింబం. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల కొరత, ఉపాధ్యాయుల లోపం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, చిన్న వయస్సులోనే పని చేయాల్సిన పరిస్థితులు, ఈ కారకాలన్నీ అణగారిన విద్యార్థులను విద్యా వ్యవస్థ నుండి దూరం చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలలో ఫీజు రీయింబర్స్మెంట్ ఒక కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యలోకి అడుగుపెట్టే అవకాశం పొందారు. ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు చదవడం కేవలం కలగానే ఉన్న కుటుంబాల్లో ఈ పథకం ఆశలను నింపింది. ఇది ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ఇది ఒక సామాజిక మార్పుకు దారి తీసిన సంస్కరణ. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఈపథకం అమలులో వచ్చిన మార్పులు గత ప్రభుత్వం చేసిన ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చింది, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు ఆరు గ్యారెంటీలలో విద్యను ఆలస్యం, నిర్లక్ష్యం, ఇవన్నీ తీవ్ర ఆందోళనలను రేకెత్తించాయి. బకాయిల చెల్లింపుల్లో నెలలు కాదు, సంవత్సరాల ఆలస్యం జరుగుతుండటంతో కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో విద్యా



ర్థులు హాల్ టికెట్లు పొందలేక పరీక్షలు రాయలేని స్థితికి చేరుతున్నారు. ఇది విద్యా హక్కును ప్రత్యక్షంగా ప్రభుత్వం దెబ్బతీసే పరిణామం. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవచ్చని చెప్పడం ద్వారా, బాధ్యతను ప్రభుత్వం నుంచి విద్యార్థులపై మళ్లించినట్లైంది. పేద విద్యార్థుల పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా వచ్చిన ఈ తీర్పు సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని అనేక విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన సూచనలు, పేద విద్యార్థుల హక్కుల పరిరక్షణ, వీటన్నింటినీ పట్టించుకోనట్లు అనిపిస్తోంది. ఇక్కడ ప్రధానంగా నిలిచే ప్రశ్న ఏమిటంటే, ప్రభుత్వం తన బాధ్యతను ఎంతవరకు నిర్వర్తించింది? కోర్టులో సరైన వాదనలు వినిపించడంలో విఫలమవడం, పథకం అమలులో నిర్లక్ష్యం చూపడం ఇవన్నీ పరిపాలనా అసమర్థతను సూచిస్తున్నాయి. అడ్వకేట్ జనరల్ పాత్రపై వచ్చిన విమర్శలు కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. విద్యార్థుల భవిష్యత్తు వంటి కీలకమైన అంశంలో ప్రభుత్వ నిర్లక్ష్యం అనేది అంగీకరించలేని విషయం. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు బకాయిలను విడుదల చేయడంలో ఆలస్యం చేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ఫీజులు చెల్లించమని కాలేజీలు ఒత్తిడి తెస్తుండగా, మరోవైపు ప్రభుత్వం స్పందించకపోవడం విద్యార్థులను మానసికంగా కుంగదీస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే దానిప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలోనేకాదు, సమాజస్థాయిలో కూడా తీవ్రంగా కనిపిస్తుంది. సుమారు14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడితే, అది రాష్ట్ర అభివృద్ధిపై కూడాప్రభావం చూపుతుంది. విద్య లేకుండా ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. తద్వారా పేదరికం, అసమానతలు మరింత పెరుగుతాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు చేపట్టిన నిరసనలు ఒక సహజ ప్రతిస్పందనగా కనిపిస్తున్నాయి. తమ హక్కుల కోసం పోరాడడం ప్రజాస్వామ్యంలో ఒక ప్రాథమిక హక్కు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనాలని వారు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు అవసరమైనది ఏమిటంటే, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడం. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. హైకోర్టు తీర్పుపై అప్పీల్ చేయడం ద్వారా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలి. పథకాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలి. కాలేజీలతో సమన్వయం పెంచి విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి. అదే సమయంలో సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి. విద్య అనేది కేవలం వ్యక్తిగత ప్రయోజనం కాదు, అది సామాజిక అభివృద్ధికి పునాది. బహుజన వర్గాల విద్యాభివృద్ధి లేకుండా సమానత్వం సాధ్యం కాదు. కాబట్టి ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయదృష్టితో చూడాలి. మొత్తంగా చూస్తే, విద్య హక్కు కేవలం రాజ్యాంగంలో ఉన్న ఒక నిబంధనగా మిగలకుండా, ప్రతి పేద విద్యార్థి జీవితంలో నిజంగా అమలవ్వాలంటే ప్రభుత్వాలు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి. లేకపోతే శతాబ్దాలుగా కొనసాగుతున్న అన్యాయం మరో రూపంలో కొనసాగుతుంది. బహుజన వర్గాల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంది. ఆ విద్యను కాపాడటం అనేది కేవలం ఒక విధానం కాదు, అది ఒక సామాజిక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం. విద్యనుహక్కుగా మాత్రమేకాకుండా, సమానత్వానికి మార్గంగా భావించేదిశగా అడుగులు వేయాల్సిన సమయంఇదే. ●

# రక్షణ చట్టంతోనే సామాజిక న్యాయం సాధ్యం!

మేకల క్రిష్ణ

ఒకే దేశం - ఒకే చట్టం అనే నినాదం వినడానికి ఆకర్షణీయంగా అనిపించవచ్చు. కానీ భారతదేశం వంటి విభిన్న సామాజిక వర్గాలు ఉన్న దేశంలో అది ఎంతవరకు న్యాయం చేస్తుందన్న ప్రశ్న తప్పనిసరిగా ఎదురవుతుంది. ఎందుకంటే మన సమాజం ఒకే స్థాయిలో లేదు. కులం, వృత్తి, ఆర్థిక పరిస్థితి, విద్యా అవకాశాలు. ప్రతి అంశంలోనూ స్పష్టమైన అసమానతలు కనిపిస్తూనే ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో అందరికీ ఒకే చట్టం అమలు చేస్తే నిజమైన సమాన న్యాయం సాధ్యమవుతుందా అన్నది ఆలోచించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా, రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ హామీ పూర్తిగా కార్యరూపం దాల్చలేదనే వాస్తవాన్ని ఒప్పుకోవాల్సిందే. ముఖ్యంగా జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు, ఇప్పటికీ అనేక రంగాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటూనే ఉన్నారు. ఉద్యోగాల్లో, ఉన్నత విద్యలో, పాలనలోవారి ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో లేదు. ఇది కేవలం సంఖ్యల సమస్య కాదు, అవకాశాల పంపిణీలో అసమానాతలకు సంకేతం. సామాజికంగా అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకు రావడం ప్రభుత్వ బాధ్యత. అందుకే ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలను నిరోధించేందుకు అట్రాసిటీ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా బాధితులకు రక్షణ లభించడమే కాకుండా, న్యాయం కోసం ముందుకు వచ్చే ధైర్యం కూడా పెరిగింది. అంటే, ప్రత్యేక రక్షణ ఉన్నప్పుడే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యం. ఇదే సమయంలో బీసీల పరిస్థితిని పరిశీలిస్తే, సమస్యలు ప్రత్యక్షంగా కనిపించకపోయినా చాలా ఉన్నాయి. వృత్తుల్లో పరిమితులు, ఆర్థికంగా స్థిరపడలేకపోవడం, నాణ్యమైన విద్యకు అడ్డంకులు, రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లేకపోవడం ఇవన్నీ బీసీ వర్గాల అభివృద్ధిని నిరోధిస్తున్న అంశాలు. గ్రామీణ ప్రాంతాల్లో భూమి లేని కుటుంబాల్లో, చిన్నచిన్న ఉపాధులపై ఆధారపడే వర్గాల్లో బీసీల శాతం గణనీయంగా ఉంది. అంటే, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరలేదన్నది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడం ఒక శుభ పరిణామం. స్వతంత్ర భారతదేశంలో 50 శాతానికి పైగా జనాభా కలిగిన వర్గం ఇప్పటికీ సామాజికంగా వెనుకబడిన స్థితిలో ఉండటం ఆలోచించాల్సిన విషయం. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అనేక రూపాల్లో అణచివేతను ఎదుర్కొంటున్నారనే వాదనను పూర్తిగా విస్మరించలేం. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం అవసరమా అన్న చర్చ సహజంగానే ముందుకు వస్తోంది. ఇది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు.సామాజిక న్యాయసాధనలో ఒక ముఖ్యమైనఅడుగు. ఒక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటికి చట్టపరమైన రక్షణ కల్పించడం ద్వారానే సమానత్వాన్ని సాధించవచ్చు అన్నది వాస్తవం. సమానత్వం అంటే అందరికీ ఒకే విధంగా వ్యవహరించడం కాదు. అసమాన పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రత్యేక రక్షణ ఇవ్వడం ద్వారానే నిజమైన సమాన న్యాయం సాధ్యమవుతుంది. భారత రాజ్యాంగం కూడా ఇదే భావనను ప్రతిపాదిస్తుంది. అందుకే రిజర్వేషన్లు, ప్రత్యేక చర్యలు అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన బీసీల రక్షణ చట్టంపై చర్చ తెలంగాణలోనూ ముందుకు రావాల్సిన అవసరం ఉంది. బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న అన్యాయాలు, అణచివేతలు కనిపించకపోయినా అవి వాస్తవాలు. వాటిని గుర్తించి చట్టబద్ధమైన రక్షణ కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. తెలంగాణలో కూడా బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడం కేవలం ఒక విధాన నిర్ణయం కాదు, అది సామాజిక న్యాయానికి ఇచ్చే హామీ. అణగారినవర్గాల గౌరవం, భద్రత, హక్కులు రక్షించబడినప్పుడే సమాజం సమానత్వ దిశగా సాగుతుంది. అందుకే తెలంగాణలోనూ బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి. అదే నిజమైన న్యాయం, అది ప్రభుత్వ బాధ్యత కూడా. ●

# యుద్ధోన్మాదం వీడండి.. శాంతివైపు అడుగులేయండి

వి.వి.కె.సురేష్

పర్యావరణ పరిరక్షణ, కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సద్వినియోగం, ఉపాధి పరిరక్షణ వంటి మానవాళి మౌలిక సమస్యలపై సునిశితమైన దృష్టి పెట్టాల్సిన కీలక నేపథ్యంలో, గత నెల రోజులకు పైగా అమెరికా, ఇజ్రాయిల్ ఒక ప్రక్క, మరోవైపు ఇరాన్ కొనసాగిస్తున్న అమానుష యుద్ధం ఫలితంగా ప్రపంచ దేశాలపై తీవ్రమైన దుష్ప్రభావం పడింది. ఎటువంటి యుద్ధంలోనైనా ఇరు ప్రక్కల వినాశనం తప్ప,ఏ ఒక్కరికీ విజయం మాత్రం దక్కదని, పరాజితులు తప్ప, యుద్ధాల్లో చివరకు విజేతలు ఎవరూ ఉండరని చరిత్రలో ఎన్నో సందర్భాల్లో స్పష్టంగా రుజువైంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అహంకారపూరిత వైఖరి మాత్రమే ఈ యుద్ధానికి ముఖ్యకారణం అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటికే పాలస్తీనాలోని ప్రాంతాలపై గత రెండేళ్లకు పైగా మారణహోమం సాగిస్తున్న ఇజ్రాయిల్, అమెరికాకు వంతపాడుతూ ఈ యుద్ధంలో మరో భాగస్వామిగా ఉంది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ (ఐ.సి.సి) ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఒక యుద్ధ నేరస్తునిగా ఇప్పటికే ప్రకటించింది. ట్రంప్ వలలో చిక్కుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించిన నాటో దేశాలను తప్పనిసరిగా అభినందించాలి. ఇరాన్‌పై తప్పుడు ఆరోపణలతో, అవివేకమైన అంచనాలతో యుద్ధబరిలోకి ఏకపక్షంగా దిగిన ట్రంప్ ఇప్పుడు దిక్కుతోచని సంకట స్థితితో సతమతమవుతున్నాడు. అసలు ఏ లక్ష్య సాధనకు యుద్ధం మొదలు పెట్టాడో అర్థం కాని అయోమయ స్థితికి ట్రంప్ నెట్టబడ్డాడు. చివరకు తన సొంత దేశమైన అమెరికా ప్రజల తీవ్ర ఆగ్రహానికి ఆయన గురయ్యారు. మితిమీరిన ఆయన యుద్ధకాంక్షను అమెరికన్ కాంగ్రెస్ కూడా తప్పు పట్టింది. యుద్ధ ప్రభావాన్ని చర్చించిన బ్రిటిష్ పార్లమెంట్ కూడా మిత్ర దేశమైన అమెరికాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఐక్యరాజ్య సమితి చేసిన పలు తీర్మానాలను, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను అమెరికా ఉల్లంఘిస్తోంది. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రారంభిస్తే, యుద్ధాన్ని మాత్రం తామే ముగిస్తామని ఇరాన్ ధీమాగా చెబుతోంది. ఇరాన్ పై ఆకస్మికంగా, అన్యాయంగా యుద్ధాన్ని ప్రారంభించిన ట్రంప్, గడియ గడియకో మాట చెబుతూ, రోజుకొక విధానం అనుసరిస్తున్నాడు. ఇరాన్‌ను మళ్లీ రాతియుగంలోకి పంపిస్తామని బెదిరిస్తున్నాడు. ఇరాన్ పై దాడి చేసి వందల మంది పిల్లలను చంపేయడం వర్ణించలేని కిరాతక చర్య. మొత్తం యుద్ధంలో ఇరుపక్షాల వైపు చమురు క్షేత్రాలు, మిలటరీ కేంద్రాలు, ఆసుపత్రులు, విద్యుత్‌ప్లాంట్లు, పాఠశాలలు, వంతెనల వంటి కీలక కేంద్రాలు ధ్వంసమవుతున్నాయి. ఇరాన్ శక్తియుక్తుల్ని తక్కువగా అంచనా వేయడమే ట్రంప్ అహంకారానికి, అనాలోచిత వైఖరికి నిదర్శనం. చరిత్రను విశ్లేషిస్తే, అమెరికా ఎటువంటి గుణపాఠాలు నేటికీ నేర్చుకోలేదని అర్థమవుతోంది. గతంలో చిలీ, లిబియా, ఇరాక్ వంటి దేశాలకు సంబంధించి అమెరికా అత్యంత



దుర్మార్గంగా వ్యవహరించింది. వియత్నాం చేతుల్లో ఘోరంగా దెబ్బతింది. వెనిజువేలా అధ్యక్షుడు మదురోను అర్థరాత్రి వేళ అక్రమ పద్ధతుల్లో కిడ్నాప్ చేసి ఆయన్ను బంధించి అమెరికాకు తరలించడం దేశాల సార్వభౌమాధికారంపై దాడి చేయడమే. అర్థంపర్థం లేనివిధంగా పలు దేశాలపై ట్రంప్ భారీ సుంకాలు విధించడం కూడా ఆర్థిక అగ్రవాదమే. ఒక రకంగా అదీ యుద్ధమే. మరోవైపు ఇరాన్ సమయస్ఫూర్తితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా ఎంచుకుని వాటిపై దాడి చేస్తోంది. సామ్రాజ్యవాద, దురహంకార పెత్తనం చెలాయించే అమెరికాకు ఇరాన్ రూపంలో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. అసలు గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలు దీర్ఘకాలంగా ఉండటమే అమెరికా ఆధిపత్య ధోరణికి నిదర్శనం. తన రక్షణ వ్యాపారం కోసం, చమురు సంపద కోసం, పశ్చిమాసియాపై తన రాజకీయ, ఆర్థిక పెత్తనం కోసం అమెరికా ఈ దుర్నీతికి అనేక సంవత్సరాలుగా పాల్పడుతోంది. ఫలితంగా పశ్చిమాసియాలో తీవ్ర అనిశ్చితి నెలకొంది. హార్ముజ్ జలసంధిని ఇప్పుడు ఇరాన్ మూసేసింది. ఫలితంగా భారత్‌తో సహా అన్ని దేశాలు చమురు కష్టాలు పడుతున్నాయి. చమురు బ్యారెల్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. అమెరికాతో సహా పలు దేశాలు తమ రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచేసాయి. యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉండటంతో ప్రపంచ దేశాలకు పలు రకాల ఇబ్బందులు ఎదురయ్యాయి. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమవుతున్నాయి. ద్రవ్యోల్బణం, ధరలు పెరిగాయి. ఎగుమతులు, దిగుమతుల వ్యవస్థలు దెబ్బతిని వాణిజ్య రంగం కునారిల్లుతోంది. హార్ముజ్ జలసంధి ద్వారా జరిగే చమురు రవాణాకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఇరాన్‌తో భారత్ కున్న సాంప్రదాయక మిత్రుత్వం వల్ల కొంత మేరకు ఉపశమనం లభించింది. అయితే రూపాయి విలువ రికార్డ్ స్థాయి పతనం, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల, భారీ వాణిజ్యలోటు వంటి తీవ్ర సమస్యలను భారత్ ఎదుర్కొంటోంది. గల్ఫ్ దేశాల నుండి సుమారు 4 లక్షల మంది భారత్‌కు తిరిగి వచ్చేసారు. ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ యుద్ధాన్ని వెంటనే విరమించాలని అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ దేశాలకు గట్టిగానే చెప్పారు. కానీ ప్రపంచ శాంతి, దేశాల భద్రత కోసం ఆయన చేసిన సూచనలను పెడచెవిన పెట్టడం సహించరాని విషయం. వీటో అధికారం కల్గిన అమెరికా వంటి ఒక అగ్రదేశం ఐక్యరాజ్య సమితి నిర్ణయా లను ఖాతరు చేయకపోవడం అనైతికం. అదే సందర్భంలో 'ప్రతి దేశం తమ సొంత ప్రయోజనాల కన్నా, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు కట్టుబడి ఉండటం ఎంతో మిన్న' అంటూ స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ ఇచ్చిన అపూర్వమైన సందేశం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. అంతే కాకుండా ఇజ్రాయిల్ నుండి తమ దేశ రాయబారిని వెనక్కు రప్పించి యుద్ధం పట్ల తీవ్ర వ్యతిరేకతను ఆయన గట్టిగా వ్యక్తం చేశారు.ఇప్పటికైనా తక్షణమే యుద్ధ విరమణ జరగాలి. అప్పుడే విపత్కర పరిస్థితుల నుండి భారత్‌తో సహా మొత్తం ప్రపంచ దేశాలు బయట పడతాయి. యుద్ధ విరమణ కోసం అన్ని దేశాలు తమ వంతు కృషి చేయాలి, అంతే కాదు బిగ్గరగా గళమెత్తాలి. తద్వారా ప్రపంచం యావత్తు అస్థిరతలో కూరుకుపోయే పెను ప్రమాదాన్ని నివారించాలి. ●



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

## అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతమే

### లక్ష్యం: మంత్రి సీతక్క

**మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త:** క్షేత్రస్థాయిలో అంగన్వాడి సేవలను బలోపేతం చేయడానికి మొబైల్ ఫోన్‌లు ఎంతగానో దోహదపడుతాయని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభించి అంగన్వాడి టీచర్లకు 1313 మొబైల్‌ఫోన్‌ల పంపిణీ, పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు భూక్య మురళినాయక్, కోరం కనకయ్య, కలెక్టర్ స్నేహాశబరీష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి మొబైల్ ఫోన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 12లక్షల వ్యయంతో వయోవృద్ధుల కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, స్వచ్ఛంద సంస్థల ద్వారా ఈ కేంద్రాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని వారిని బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో వదిలేయడం తగదని సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖను బలోపేతం చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా వయోవృద్ధులు, గర్భిణిలు బాలింతలు చిన్నపిల్లలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని శాసనభలో వృద్ధుల సంక్షేమ చట్టం ప్రవేశపెట్టి అమలుపరిచినందున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్‌ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** చదువు నేర్పిన వివేకం పోరాట పటిమగా మారినప్పుడే దేశ చరిత్ర మారుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సమాజంలో ఏ విప్లవాత్మక మార్పు రావాలన్నా, దానికి విద్యార్థి ఉద్యమమే తొలి అడుగు అన్నారు. ఇది చరిత్ర నిరూపించిన సత్యం, అక్షరాన్ని ఆయుధంగా మలచుకొని, వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే ఆ చారిత్రక తొలి అడుగుకు, దశాబ్దాలుగా ఒక శక్తిమంతమైన వేదికగా నిలుస్తుందన్నారు. దశాబ్దాలుగా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుతూ. దేశానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడంలో ఎన్.ఎస్.యు.ఐ పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయం, స్ఫూర్తిదాయకం అన్నారు. గురువారం ఎన్.ఎస్.యు.ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదమే ప్రాతిపదికగా విద్యార్థి లోకాన్ని ముందుకు నడిపిస్తున్న కార్యకర్తలందరికీ నా హృదయపూర్వక అభినందనలు. శుభాకాంక్షలు.

## మహిళా రిజర్వేషన్‌లో

## బిసి రిజర్వేషన్ కోసం 16న చలో ఢిల్లీ

### పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:**మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు రాజ్యాధికారంలో పాత్ర ఉండేందుకు రిజర్వేషన్ కోటా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న ఛలో ఢిల్లీ ఉద్యమం చేపడుతున్నామని మాజీ పిసిసి అధ్యక్షుడు వి. హనుమంతరావు తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కుల గణన చేసి సమాజంలో మేమెంతో మా కేటగిరికి అంత రిజర్వేషన్ చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు అందరూ మద్దతు ఇవ్వాలనీ ఆయన కోరారు. మహిళా బిల్లు లో మా బిసి ల వాటా మాటేమిటి ? కేటగిరి రిజర్వేషన్ రెండోసారి చేస్తామని అంటున్నారు. దీనిపై మాకు నమ్మకం లేదు అని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మహిళా రిజర్వేషన్లపై ఈ నెల 16న చలో ఢిల్లీ కార్యక్రమం ఉందనీ దీని కోసం తెలంగాణలో బిసిలు కూడా కదలిరావాలిన ఆయన కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రతి మహిళా తరలి రావాలనీ ఆయన సూచించారు.

## 11న జెఇఇ మెయిన్ సెషన్-2 ప్రాథమిక కీ

### 20న తుది ఫలితాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఈ నెల 2 నుంచి 8 వరకు జరిగిన జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 11న విడుదల చేయనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్ షీట్లను అదే రోజు విడుదల చేయనున్నట్టు తెలిపింది. ప్రొవిజనల్ కీపై అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం ఈ నెల 20న ఫలితాలను ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. ఈ నెల 2 నుంచి 8 వరకు ఆరు రోజుల పాటు పది సెషన్లలో జేఈఈ సెషన్-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు దాదాపు 11.23 లక్షల మంది హాజరయ్యారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు 93 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎన్‌టిఏ వెల్లడించింది. అందులో పేపర్-1 బీఈ/బీటెక్) పరీక్షకు ఇండియాలో సుమారు 11.06 లక్షల మంది హాజరయ్యారు. విదేశాల్లోని పలు సెంటర్లలో 4,229 మంది విద్యార్థులు రాసినట్లు ఎన్‌టిఏ పేర్కొంది. పేపర్-2 (బి ఆర్క్, బి ప్లానింగ్) పరీక్షకు 54,953 మంది హాజరైనట్లు తెలిపింది. జేఈఈ మెయిన్‌కి సంబంధించి రెండు సెషన్లలో విద్యార్థులు సాదించిన మెరుగైన స్కోరు ఆధారంగా విద్యార్థులకు ఫైనల్ ర్యాంకులను ఎన్‌టిఏ ప్రకటించనుంది.

## ర్యాగింగ్ బాధ్యులపై సస్పెన్షన్ వేటు

### వరంగల్ కెఎంసిలో కలకలం

### వారం రోజుల్లో చర్యలు తీసుకున్న అధికారులు

**వరంగల్ క్రైం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల మధ్య జరిగిన ర్యాగింగ్ పై అధికారులు చర్యలు తీసుకున్నారు. జూనియర్ వైద్య విద్యార్థులపై సీనియర్ వైద్య విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడిన ఘటనలో జూనియర్ వైద్య విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ జరిపి ఏడుగురు సీనియర్ వైద్య విద్యార్థులను ఆరు నెలల పాటు కళాశాల నుండి సస్పెన్షన్ విధించారు. ఆ పిదప హాస్టల్ ఇతరత్ర సదుపాయలు నిషేధం చేసి బయట నుండి విద్యను కొనసాగించేలా ఆదేశాలు ఇచ్చారు. ఈ ఘటన వివరాలు కళాశాల ప్రిన్సిపాల్ డా సంధ్య వెల్లడిస్తూ కళాశాలలో ఎన్ని కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నా రాగింగ్ భూతం విద్యార్థులను వదిలిపెట్టడం లేదని అన్నారు. ఇటీవల సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను మోకాళ్ళ పై కూర్చోబెట్టి ఇబ్బందులకు గురి చేసినట్లు రుజువు అయ్యిందని అన్నారు. రాగింగ్ అనగానే కొత్తగా కళాశాల విద్యార్థులు సీనియర్స్ మధ్య ఉంటుందని అందరూ భావిస్తారు. ఇక్కడ మాత్రం ఎంబీబీఎస్ రెండు, మూడవ సంవత్సరాలు చదువుతన్న విద్యార్థుల మధ్య రాగింగ్ జరిగింది. రెండవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థుల వాట్సప్ గ్రూప్ లో మూడవ సంవత్సరం విద్యార్థుల గురించి తప్పుగా మాట్లాడారన్న సమాచారం అందుకుని తమ గురించి జూనియర్స్ తప్పుగా మాట్లాడడం సరియైనది కాదని కోపానికి గురయ్యారు. హాస్టల్ టెర్రస్ పైకి 20 మంది జూనియర్ మెడికోస్ ను పిలిచి మోకాళ్లపై కూర్చో బెట్టి తప్పయిందని మరోసారి ఇలా చేయమని సారీ చెప్పించుకున్నారు. ఇది నచ్చని కొంతమంది జూనియర్ విద్యార్థులు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి మొదలు పెట్టి దేశంలో సంబంధిత శాఖాధి కారులకు, వరంగల్ పోలీస్ కమిషనర్ కు కూడా బాధిత విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో కళాశాల అధికారులు రంగంలోకి దిగి విచారణ జరిపి చర్యలకు సిద్ధం అయ్యారు. ఇలాంటి ఘటనలకు ఎవరు పాల్పడకూడదని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

# మంత్రి పొంగులేటిపై ఆరోపణలకు ఆధారాలు ఇవ్వండి

### మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేదు

### బిజెపి, బిఆర్‌ఎస్ రేపైనా కలుస్తాయి!

### గాంధీభవన్‌లో మీడియాతో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ చిట్‌చాట్

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** పొంగులేటి పై విమర్శలు కాదు ఆధారాలు ఉంటే గాంధీభవన్‌కు వచ్చి ఇవ్వండని అంటూ టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ సవాల్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం ఇష్టాగోష్టిగా ఆయన మాట్లా డుతూ మా మీద బట్ట కాల్చి వేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బిఆర్‌ఎస్ దోపిడీ గురించి ప్రజలకు అర్థమైంది ఆధారాలు తీసుకొని చర్చకు రండి నేను చర్చ సిద్ధమని పునరుద్ఘాటించారు. మంత్రులపై పసలేని ఆరోపణలు చేయెుద్దని ఆయన హరీష్‌రావుకు హితవు చెప్పారు. మంత్రి పొంగులేటిపై వచ్చిన ఆరోపణలపై ప్రూఫ్ ఉంటే అప్పుడు కాంగ్రెస్ ఆలోచిస్తుందనీ నాదర్గుల్ భూముల కుంభకోణం బి ఆర్ ఎస్ హయంలో జరిగిందనీ అన్నారు.

మేము కట్టిన ప్రాజెక్టుల కు ఇప్పటిదాకా ఎక్కడ గీత కూడా పడలేదు మీరు కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలిపోతుందనీ ఎద్దేవా చేశారు.జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ 14 సార్లు బి ఫామ్ ఇచ్చామనీ, పరిస్తితులను బట్టి ముందుకి వెళ్ళాలనీ జీవన్‌రెడ్డి విమర్శలు ప్రజలు పట్టించుకునే పరిస్తితిలో లేరనీ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ పోవాలని చెప్పడానికి జీవన్ రెడ్డి ఎవరు? అని నిలదీశారు. కాంగ్రెస్ కు విమర్శించే ముందు జీవన్ రెడ్డి గతంలో బిఆర్‌ఎస్‌పై చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు.

బిఆర్‌ఎస్ బిజెపి వేర్వేరు కాదని భాష్యం చెప్పారు. బిజెపి, బిఆర్‌ఎస్ రేపైన కలుస్తాయనీ జోస్యం చెప్పారు. బిజెపితో అంటకాగినవారు దేశంలో ఎవరు బాగుపడుద్ది లేదని, ప్రజలు మార్పు కోరుకున్నారు కాబట్టి బిఆర్‌ఎస్ పోయింది అని అన్నారు. మంత్రి వర్గ విస్తరణ ముఖ్యమంత్రి పరిధిలోని అంశం నాకున్న సమాచారం ప్రకారం మంత్రి వర్గ విస్తరణలో ఇప్పట్లో ఉండదనీ ఆయన తెలిపారు.

# విద్యార్థి రాజకీయాలతో జాతీయస్థాయికి ఎదగండి

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

### రాష్ట్రంలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

### ఇందిరాభవన్‌లో ఎన్‌ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవం



**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** విద్యార్థి చదువుతోపాటు రాజకీయాలతో బాధ్యతతో వ్యవహరించడం అలవర్చుకోంటూ ఓపిక, సహనం కలిగి క్రమంగా ముందుకు సాగుతూ జాతీయస్థాయి నాయకులుగా ఎదగాలని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యుఐ) నాయకులకు పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఇందిరాభవన్‌లో గురువారం నిర్వహించిన ఎన్‌ఎస్‌యుఐ 56వ ఆవిర్భావ దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఎన్‌ఎస్‌యుఐ నుంచి రాజకీయ నాయకులుగా ఎదిగి ప్రజసేవ చేయడానికి ఒక వేదికగా మారిందని, ఇక్కడ ఉన్న నాతోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్, వంశీచంద్‌రెడ్డి, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ఎస్‌టి సెల్ చైర్మన్ శంకర్‌నాయక్ అందరం కూడా అక్కడ నుంచి వచ్చినవాళ్లమే అని ఆయన వివరించారు. యుక్తవయస్సు విద్యార్థులతో ఎన్‌ఎస్‌యుఐ పూర్వ విద్యార్థులం ఆవిర్భావ దినోత్సవం జరుపు కొనడం ఆనందం కలిగిస్తోందని అన్నారు. ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడు వెంకటస్వామి నేతృ త్వంలో మరింత బలోపేతంగా ముందుకు సాగా లని కోరారు. జాతీయ స్థాయిలో ఎదిగిన అనేక మంది నాయకులు ఎన్‌ఎస్‌యూఐ నుంచే ఎదిగారని ప్రజాసమస్యలపై పోరాటంతోపాటు, ఆంగ్లం, హిందితోపాటు దేశంలోని వివిధ భాషలపై పట్టు సాధించడంతో వారు ఉన్నతస్థాయికి చేరారని ఆయన గుర్తు చేశారు. నిత్యం ప్రజల్లో ఉండడం ద్వారా సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు.

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగాలని, విద్యార్థి సంఘాల వల్ల ఎలాంటి అలజడి ఉండదని భవిష్యత్‌లో మంచి రాజకీయతరం రావడానికి విద్యార్థి సంఘాల ఎన్నికలు ఒక పునాది లాంటిదని అన్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు విషయంలో ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా ఉన్నారనీ ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణ దిశగా నిర్ణయం తీసుకొంటుందని చెప్పారు. ఎన్‌ఎస్‌యు శ్రేణులు నగరంలో భారీ ర్యాలీని గాంధీభవన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడబ్యుసి సభ్యులు చల్లా వంశీచందర్ రెడ్డి, బిసికార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 11 యేళ్లల్లో బిసి, ఎంబిసి కార్పొరేషన్ల ద్వారా

# ఖర్చు చేసింది రూ. 732 కోట్లే!

### కేటాయించింది రూ. 8,905 కోట్లు

### 2026-27లో బిసి సంక్షేమానికి రూ. 12,511 కోట్లు కేటాయింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 11 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో 56 శాతానికిపైగా ఉన్న వెనుకబడిన తరగతుల వారికి బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేసింది కేవలం రూ. 732.28 కోట్లు మాత్రమే. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఈ రెండు ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిపొందింది 89,239 మంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పడింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నారు. అందులో బీసీ సంక్షేమ శాఖకు బడ్జెట్‌ను ప్రవేశ పెడుతూ కేటాయింపులు చేస్తున్నారు. కేటాయింపుల తరువాత నిధుల విడుదల ఆ తరువాత నిధుల ఖర్చు చేస్తున్నారు. ఇలా గత 11 ఏళ్ల కాలంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌తోపాటు మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్స్(ఎంబీసీ) ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేసింది కేవలం రూ. 732 కోట్లు మాత్రమే. ప్రతి ఏడాది బీసీలకు బడ్జెట్‌ను కేటాయించడం.. అందులో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి నిధులను కేటాయించడం చేస్తున్నారు. బీసీల్లో ఆర్థికంగా వెనుకబడి వారి అభివృద్ధికి ఆర్థిక చేయూత పథకాలను బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తారు. అలాగే బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాల వారి అభివృద్ధి కోసం ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక చేయూత పథకాలను అమలు చేస్తారు. ఈ రెండు పథకాల ద్వారా ఎక్కువ మంది బీసీలకు ఆర్థిక చేయూత పథకాలను అమలు చేస్తారు. అలాంటిది గడచిన 11 ఏళ్ల కాలంలో రూ. 8905.08 కోట్లను కేటాయించారు. వాటిల్లో విడుదల చేసింది రూ. 1839.37 కోట్లు. ఇక విడుదల చేసిన వాటిల్లో ఖర్చు చేసింది రూ. 732.28 కోట్లు మాత్రమే. రాష్ట్రంలో 56 శాతంగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయడమే దామాషా ప్రకారం చేయకపోగా.. కేటాయించిన నిధులను సైతం పూర్తిగా విడుదల చేయలేదు. ఇక విడుదల చేసిన నిధులలోనూ పూర్తిగా ఖర్చు చేయలేదు. మొత్తాని రాష్ట్రంలో 56 శాతంగా ఉన్న బీసీలకు 11 ఏళ్ల కాలంలో బీసీ, ఎంబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 732.28 కోట్లను 89,239 మందికి ఖర్చు చేశారు. 11 ఏళ్లల్లో 89,239 మందికి అంటే ప్రతి ఏడాది సరాసరి 8112 మందికి లబ్ధి చేకూరినట్టు. ఇక ఈ ఏడాది బీసీల సంక్షేమం కోసం రూ. 12,511 కోట్లను కేటాయించింది. అందులో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి రూ. 647.41 కోట్లను కేటాయించగా.. ఎంబీసీ కార్పొరేషన్‌కి రూ. 402.35 కోట్లను కేటాయించారు. ఈ ఏడాది వీటిలో ఎంత ఖర్చు చేస్తారో చూడాలి.

## జనగణనలో ఒబిసిలను లెక్కించాకే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్9:**మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బిజెపి మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈ బిల్లు అమలులో 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికగా తీసుకుంటామని చెప్పటం మహిళా లోకాన్ని మోసం చేయటమే అని పేర్కొన్నారు. మహిళా కోటాకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో గురువారం ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. ప్రస్తుతం చేపట్టే జనగణనలో ఒబిసి గణన చేయాలని డిమాండ్ చేశారు.జనగణనలో కులం కాలమ్ ఉన్నా వాళ్లు ఒబిసిలకు చెందుతారు అనే స్పష్టత లేదని అన్నారు. దీంతో బిసిల జనాభా ఎంత అనే లెక్క తేలదని పేర్కొన్నారు.

జనగణనలో ఒబిసిలను లెక్కించి ఆ తర్వాతే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కోటా విషయంలో బిజెపి చేస్తున్న అన్యాయంపై పోరాటానికి బిసి మహిళలంతా సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు. డ్రాఫ్ట్ బిల్లు ముందే ఇవ్వాలి మహిళ రిజర్వేషన్ల బిల్లు అమలు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్లమెంట్ సమావేశాలకు ముందే డ్రాఫ్ట్ బిల్లును అన్ని పార్టీలకు ఇవ్వాలని కవిత కోరారు. లేదంటే అభ్యంతరాలు చెప్పే అవకాశం ఉండదని అన్నారు. బిల్లుపై చర్చ జరిగే రోజు ఉదయమే సభ్యులకు బిల్లు పత్రులను ఇస్తామని చెప్పటమంటే కచ్చితంగా ఇది అన్యాయం చేసే కుట్ర అని మండిపడ్డారు.

డ్రాఫ్ట్ బిల్లును ముందే ఇచ్చే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దేశంలోని జాతీయ పార్టీల నేతలతో మాట్లాడతానని చెప్పారు. పార్లమెంట్‌లో మహిళ బిల్లు విషయంలో బిజెపి వైఖరిని నిరసిస్తూ మహిళలకు న్యాయం చేసే విధంగా అన్ని పార్టీలు ఒక్కటి కావాలని కోరారు.

## బ్రాహ్మణులపై మంద కృష్ణ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

### బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ డిమాండ్




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బసవరాజు శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** బ్రాహ్మణ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారు తమ ధోరణిని వెంటనే మార్చుకోవాలని, చేసిన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ (బాస్ )చీఫ్ కోఆర్డినేటర్ బసవరాజు శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇటీవలి కాలంలో బ్రాహ్మణ జాతిని కించ పరుస్తూ మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. దళిత క్రైస్తవుల కుల హోదా అంశంపై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షి ంచాలని కోరుతూ, సంబంధం లేని బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని బ్రాహ్మణులను సమాజంలో దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది సమాజంలో అసమానతలు సృష్టించడమేనని మండిపడ్డారు. హిందూ ధర్మాన్ని, మతాన్ని అవమానపరుస్తూ క్రైస్తవ మత వ్యాప్తికి సహకరిస్తున్నారని ఆరోపిం చారు. భారత స్వాతంత్ర్య సమరంలో, రాజ్యాంగ రచనలో, ఆర్థిక సంస్క రణల్లో, అంటరాని తనం నివారణలో బ్రాహ్మణులు పోషించిన విశిష్ట పాత్రను మంద కృష్ణ మాదిగ తెలుసుకోవాలని సూచించారు. గూగుల్‌లో వెతికినా బ్రాహ్మణుల గొప్పతనం, సమాజానికి వారు చేసిన సేవలు తెలుస్తాయని ఎద్దేవా చేశారు. బ్రాహ్మణులను టార్గెట్ చేయడం మాని, చేస్తున్న విపరీత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే ధోరణి కొనసాగితే తాము కూడా ధీటుగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## టిజిఆర్‌జెసి ఎంట్రన్స్ టెస్ట్‌కు 45 వేల దరఖాస్తులు

### 15 వరకు దరఖాస్తుల స్వీకరణ.. మే 3న పరీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జనరల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలతోపాటు, 93 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టిజి ఆర్‌జేసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిఆర్‌జేసీ సెట్)-2026 పరీక్షకు ఇప్పటి వరకు 45వేల దరఖాస్తులు వచ్చాయి. మే 3న పరీక్షను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టిజిఆర్‌జేసీ సెట్- 2026 ద్వారా 35 తెలంగాణ గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజిలలో, 93 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, (ఇంగ్లీషు మీడియం. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో) ప్రవేశము కొరకు మే 3న పరీక్షను నిర్వహించనున్నట్టు తెలిపారు. 2026 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను మార్చి 16 నుంచి స్వీకరి స్తున్నామని ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు ఫీజును రూ.200గా నిర్ణయించినట్టు తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాల కొరకు టిజిఆర్‌జేసీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని, ఇతర వివరాల కోసం 040-24734899, 7842991708, 1800 425 2428 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రకటనలో సూచించారు.

## రెండు డిసిసి కార్యవర్గాల కమిటీలను ప్రకటించిన పిసిసి

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల, జయ శంకర్ భూపాలపల్లి డిసిసిలకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ పూర్తి కార్య వర్గాన్ని గురువారం ప్రకటించింది. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అధికారికంగా రెండు జిల్లా కార్యవర్గం ప్రకటించారు. జోగులాంబ గద్వాలలో నలుగురు ఉపాధ్యక్షులు ఎనిమిది మంది జనరల్‌సెక్రటేరలను 13మంది సెక్రటరీలు, నియమించారు. జయశంకర్ భూపాలపల్లి లో నలుగురు ఉపాధ్యక్షులు, తొమ్మిది మంది జనరల్‌సెక్రటరీలు, ఒకట్రెజరర్ ఒక స్పోక్స్ మెన్, 17 సెక్రటరీలు, ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నియించారు.

## పెట్టుబడుల కోసం ఫస్ట్ డెస్టినేషన్‌గా తెలంగాణ

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖచిత్రం మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసోందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 28 నెలలు రూ.24,000 కోట్ల రీస్ట్రక్చరింగ్‌తో రాష్ట్ర ఆర్థిక పునరుద్ధరణకు చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రాన్ని మళ్లీ ఆర్థికంగా పరుగులు పెట్టించే ప్రయత్నం కొనసాగుతోందనీ వివరించారు. మూసీ పునరుద్ధరణ, అభివృద్ధి తో పర్యాటకం, ఉపాధి, పెట్టుబడులకు కొత్త అభివృద్ధి అవకాశాలు వస్తాయనీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ తెలంగాణకు పరిశ్రమలు ఉపాధి వంటి కొత్త ఆర్థిక ఇంజిన్‌గా రూపుదిద్దుకుంటోందనీ అన్నారు. ఫ్యూచర్ సిటీని ప్రకృతికి అనుకూలంగా, గ్రీన్ ప్లానింగ్‌తో నిర్మిస్తున్నామనీ స్పోతర్షలు చెప్పారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రపంచ స్థాయి నగర నిర్మాణం లక్ష్యమనీ ఆయన తెలిపారు యుఎఇ సహా అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు గుర్తింపు పెరగడంతో పెట్టుబడుల కోసం తెలంగాణ ఫస్ట్ డెస్టినేషన్‌గా నిలుస్తోందనీ చెప్పారు. గ్లోబల్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయనీ అన్నారు. క్లీన్‌టెక్, ఐటీ, సేవలు, పరిశ్రమల రంగాల్లో పెట్టుబడుల ఆసక్తి పెరుగుతోందనీ వివరించారు. తెలంగాణను మళ్లీ ఆర్థికంగా నిలబెట్టే పునాది కాంగ్రెస్ ప్రభుత్వం వేయడంతో 28 నెలల్లో తెలంగాణలో కీలక రంగాల్లో గ్రోత్ కనిపిస్తోందనీ చెప్పారు.

## అంతర్గాం తహాశీల్దార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

### రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

**గోదావరిఖని, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం తహాశీల్దార్ కార్యాలయం అవినీతి కేంద్రంగా మారుతున్నట్లు మరో ఘటన రుజువైంది. భూమి ఎంక్వయిరీ పనిలో సహాయం చేస్తానంటూ రైతు వెంకటస్వామి నుంచి రూ.10,000 లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు గురువారం పట్టుకున్నారు. రైతు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ముందుగానే ప్రణాళిక రచించి వల పన్నారు. డబ్బులు స్వీకరిస్తున్న సమయంలో అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా అదుపు లోకి తీసుకున్నారు. ఘటన స్థలంలోనే విచారణ చేపట్టి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ఈ దాడిని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించారు.



కేసుపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ఇదే కార్యాలయంలో గతంలో కూడా ఎంఆర్వో సహా పలువురు అధికారులు ఏసీబీకి చిక్కిన సంఘటనలు చోటుచేసుకోవడం స్థానికంగా ఆందోళనకు గురిచేస్తోంది. వరుసగా బయటపడుతున్న లంచాల వ్యవహారాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవినీతికి అడ్డుకట్ట వేయాలంటే కఠిన చర్యలు తప్పవని వారు అభిప్రాయ పడుతున్నారు.

## పెచ్చుమీరిన భూకబ్జాలు, అవినీతి.. ప్రధానిని కలిసి సిబిఐ విచారణ కోరతాం

### రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూకబ్జాలు, అవినీతి హద్దుపద్దు లేకుండా పెరిగిపోయాయని, వీటిపై సమగ్ర సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ త్వరలోనే ప్రధానమంత్రిని కలవనున్నట్లు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వంలో కొందరు మంత్రులు, ఐఏఎస్ అధికారులు కుమ్మక్కై రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత 13 ఏళ్లుగా జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరగాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదవుల్లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధుల అక్రమాస్తులపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. 'మిగులు బడ్జెట్‌తో ఉన్న ధనిక రాష్ట్రం నేడు రూ. 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. తెచ్చిన అప్పులను సైతం కాంట్రాక్టర్ల పేరుతో కొల్లగొడుతున్నారు' అని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములను వేలం వేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ భూములను ప్రజా అవసరాలకు, పేదల ఇళ్ల నిర్మాణానికి, బీసీ హాస్టళ్లు మరియు గురుకుల భవనాల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో సుమారు 6 లక్షల మంది పేదలు అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే, ప్రభుత్వం భూములను వేలం వేస్తూ కబ్జాదారులకు అమ్ముకోవడం దారుణమని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై చేస్తున్న దోపిడీని అరికట్టాలని, అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## సంక్షేమంలో ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ ప్రాసెసింగ్‌ను వెబ్ పెడుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ శాఖలలో క్రమబద్ధీకరించబడిన హాస్టల్ నిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ విషయమై ఇటీవల ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ శాఖల సీనియర్ అధికారులు ఇటీవల ఒక సమావేశాన్ని నిర్వహించి దీనికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా హాస్టల్ నిర్వహణలో ఉమ్మడి ప్రాంతాలను గుర్తించి, ప్రతిపాదిత సాఫ్ట్‌వేర్‌కు అవసరమైన పరిమితులను వివరించారు. విద్యార్థుల సంక్షేమ నిర్వహణ, హాస్టల్ సౌకర్యాలు, ఆహార సరఫరా, వైద్య అత్యవసర పరిస్థితులు, తనిఖీలు మరియు నివేదిక సమర్పణ వంటి ముఖ్యమైన విధులు ఈ వ్యవస్థ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ఇంటిగ్రేటెడ్ సిస్టమ్‌లో చేర్చాల్సిన పరిమితులపై సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినట్లు సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు.

## తెలంగాణ రెరా కార్యదర్శిగా శ్రీలత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్9:** తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(టీజీరెరా) కార్యదర్శిగా శ్రీలతను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కన్జూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీలతను డిప్యూ టేషన్ బేసిస్‌లో ప్రభుత్వం రెరా కార్యదర్శిగా నియమించింది. ఇప్పటికే రెరా కార్యదర్శిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో పనిచేస్తున్న డి.శ్రీనివాస్‌రెడ్డికి అడిషనల్ కలెక్టర్‌గా ప్రమోషన్ కల్పించడంతో కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా పోస్టింగ్ ఇచ్చింది.

## 23న సమ్మెకు వెళ్లే అవకాశం
### ఆర్టీసీ జెఎసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 9:** ఈనెల 13 తర్వాత సమ్మెపై స్పష్టత ఇస్తామని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించారు. ఈనెల 13న లేబర్ కమిషనర్, ఆర్టీసీ యాజమాన్యంతో కార్మికుల డిమాండ్లపై చర్చలు సాగనున్నాయి. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని జేఏసీ నేతలు కోరారు. తమ డిమాండ్ల అమలులో యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉన్నందున ఇప్పటికే సమ్మె నోటీస్ ఇచ్చామన్నారు. ఏప్రిల్ 23న సమ్మెకు వెళ్లే అవకాశముందని జేఏసీ నేతలు ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి దేనికైనా సిద్ధమని వారు తెలిపారు.



## హార్ముజ్ దాటే నౌకలపై ఇరాన్ టోల్ వసూలు
### ఆంక్షలు అధిగమించేందుకు బిట్‌కాయిన్ వసూళ్లు

**టెహ్రాన్; ఏప్రిల్ 9** ప్రపంచ చమురు వాణిజ్యానికి గుండెకాయ లాంటి హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పూర్తిస్థాయి పట్టు బిగిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అడ్డుపెట్టుకొని, ఆయుధాల తరలింపును నిరోధిస్తున్నామనే పేరుతో సరికొత్త నిబంధనలను తెరపైకి తెచ్చింది. నౌకల రాకపోకలను తీవ్రంగా నియంత్రిస్తూ, టోల్ ఫీజును క్రిప్టో కరెన్సీలో వసూలు చేస్తుండటం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఇరాన్ కొత్త నిబంధనల ప్రకారం, సాధారణంగా రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించే ఈ మార్గంలో ఇకపై కేవలం 12 నౌకలను మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో పర్షియన్ గల్ఫ్‌లో వందలాది నౌకలు నిలిచిపోయి ఆ ప్రాంతం ఒక పార్కింగ్ ప్రాంతంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ ట్రాన్సిట్ టోల్ వసూలు చేస్తోంది. ఈ చెల్లింపులను డాలర్లలో కాకుండా బిట్‌కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీలు లేదా చైనా యువాన్లలో మాత్రమే చేయాలని షరతు విధించింది. అంతర్జాతీయ ఆంక్షల నుంచి తప్పించుకునేందుకే ఇరాన్ ఈ డిజిటల్ చెల్లింపుల మార్గాన్ని ఎంచుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. చమురు ట్యాంకర్లలోని ప్రతి బ్యారెల్ ముడి చమురుపై 1 డాలర్ చొప్పున టోల్ వసూలు చేస్తున్నారు. ఒక్కో భారీ ట్యాంకర్‌పై దాదాపు 2 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు 16.7 కోట్లు) భారంపడుతోంది. ఈమొత్తంతోనే దెబ్బతిన్న ఇరాన్‌ను పునర్మించుకుంటామని ఇరాన్ పాలకులు చెపుతున్నారు. అంతేకాకుండా అమెరికా అదనపు నష్టపరిహారం చెల్లించాలనికూడా పట్టుబడుతున్నారు. నౌకాయాన సంస్థలు తమ సరుకు వివరాలను ఈమెయిల్ చేయగానే, ఇరాన్ పంపిన పేమెంట్ లింక్‌పై సెకన్ల వ్యవధిలో చెల్లింపులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇరాన్ చర్యలను అమెరికా తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ జలమార్గంపై ఇలాంటి గేట్ కీపింగ్‌చట్టవిరుద్ధమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మండిపడ్డారు. సౌదీ అరేబియా, ఖతార్ వంటి గల్ఫ్ దేశాలు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. బుధవారం కేవలం 4 నౌకలనే అనుమతించడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్, అమెరికా దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో మొదట ఇరాన్ హార్ముజ్ జలసంధిని తెరిచింది. కానీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. హార్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనితో జలసంధిని దాటేందుకు వచ్చిన నౌకలు తిరుగుముఖం పట్టాయి.అమెరికా, ఇరాన్ దేశాలు కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత పలు నౌకలు హార్ముజ్ జలసంధిని దాటాయి. గ్రీక్‌కు చెందిన బల్క్ క్యారియర్ ఎన్‌జే ఎర్త్, లైబీరియా జెండా కలిగిన డేటోనా బీచ్ అనే రెండు నౌకలు ఈ జలసంధిని దాటాయి. అదే సమయంలో ఏయూఆర్‌ఓయూఆర్ఏ నౌక ఈ జలసంధిని దాటేందుకు సిద్ధమైన సమయంలో ఉద్రిక్తతలు తిరిగి చోటు చేసుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడంతో 250 మందికి పైగా మృతి చెందారు. దీనితో ఇరాన్ హార్ముజ్‌ను మూసివేసింది. దీనితో ముసందమ్ తీరం సమీపంలో ఈ నౌక వెనక్కి మళ్లింది.

## జలవిహార్‌లో పేలుడు ప్రమాదంలో గాయపడిన ఒకరు మృతి

**హైదరాబాద్ (బేగంపేట) ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** నెక్లెస్ రోడ్డులోని జలవిహార్ లో బుధవారం జరిగిన భారీ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.బుధవారం ఆర్వోప్లాంట్ వద్ద జరిగిన పేలుడు ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించారు.ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగులయ్య అలియాస్ లక్ష్మణ్ (50)మృతి చెందాడు. లేక్‌పోలీసులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జలవిహార్ ఆర్వో ప్లాంట్‌లో భారీ పేలుళ్లు జరిగిన విషయం పాఠకులకు విదితమే. అయితే ఈ ఘటనలో లక్ష్మణ్ (50) తీవ్రంగా గాయపడటంతో సోమాజీ గూడాలోని జాయ్ ఆస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు.మరో ఇద్దరిలో అంజి (25) ప్రాథమిక చికిత్స పొంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.మరో వ్యక్తి అప్పల నాయుడు (45)గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నట్లు లేక్ పోలీసు ఇన్స్పెక్టర్ తెలియజేసారు. వీరు ముగ్గురు జలవిహార్‌లోని క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ అక్కడే కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. లక్ష్మణ్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

# మంచు పర్వతాల్లో బిఎస్ఎఫ్ సేవలు అద్భుతం

### ఆపరేషన్ సిందూర్‌లో పోరాటం అద్వితీయం
### బిఎస్ఎఫ్ జవాన్ల భద్రతే మాకు ముఖ్యం
### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్
### దాల్‌లేక్‌లో బోటులో ప్రయాణించిన కేంద్రమంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మంచు పర్వతాలు, క్లిష్టమైన వాతావరణంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది అందిస్తున్న సేవలు అద్వితీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. ఆపరేషన్ సింధూర్‌లో బిఎస్ఎఫ్ సిబ్బంది చేసిన పోరాటం దేశానికి గర్వకారణమని అన్నారు. బిఎస్ఎఫ్ సిబ్బంది భద్రత తమ కర్తవ్యమని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం పక్షాన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. జమ్మూకాశ్మీర్ పర్యటనలో భాగంగా గురువారం ఉదయం శ్రీనగర్‌లోని బిఎస్ఎఫ్ క్యాంపస్ (ఎస్ హెచ్ క్యూ)లో ఐజి అశోక్ యాదవ్‌తోపాటు ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాశ్మీర్‌లో బిఎస్ఎఫ్ అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న ఇబ్బందులు, ఆపరేషన్ సింధూర్‌లో బిఎస్ఎఫ్ జవాన్ల పాత్రను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సముద్ర మట్టానికి 15,500 అడుగుల ఎత్తులో మంచుకప్పబడి ఉన్న ప్రాంతాల్లోనూ బిఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న విషయాన్ని, మంచు తుఫానును తట్టుకుని డ్యూటీ చేస్తున్న జవాన్ల ధైర్య సాహసాలను వీడియో ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అత్యంత క్లిష్టమైన వాతావరణం నెలకొన్న ప్రాంతాల్లో, పర్వతాలు, వలికి, అనుహ్యమైన వాతావరణ పరిస్థితులను తట్టుకుని విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.



బిఎస్ఎఫ్ జవాన్ల భాగస్వామ్యంతోనే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని వివరించారు. కనీస సౌకర్యాలు, వసతి లేకపోయినప్పటికీ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్న జవాన్ల ధైర్యసాహసాలను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. జవాన్ల భద్రత కేంద్ర ప్రభుత్వ కర్తవ్యమని, ఈ విషయంలో సంపూర్ణ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అంతకు ముందు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీనగర్‌లోని తులిప్ గార్డెన్ సందర్శించారు. యేటా నెల రోజులపాటు తెరిచి ఉంచే తులిప్ గార్డెన్ ను దర్శించుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. తులిప్ గార్డెన్ మొత్తం కలియ తిరుగుతూ రంగు రంగుల పూల తోటలను పరిశీలించారు. తులిప్ గార్డెన్ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. 75 ఏళ్ల చరిత్ర కలిగిన తులిప్ గార్డెన్‌కు ఒక్క నెలలోనే దాదాపు 8 నుండి 10 లక్షల మంది పర్యాటకులు విచ్చేస్తారని అక్కడున్న అధికారులు వివరించారు. అనంతరం భారీ భద్రత మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీనగర్‌లోని ప్రసిద్ధి గాంచిన దల్ లేక్ వద్దకు వెళ్లారు. కాసేపు దల్ లేక్‌లో బోటులో ప్రయాణించారు.

## కాల్పుల విరమణపై ఇరుదేశాల భేటీ
### నేడే ఇస్లామాబాద్‌లో అమెరికా, ఇరాన్ పెద్దల చర్చలు

**టెహ్రాన్, వాషింగ్టన్, ఏప్రిల్ 9:** ఇరాన్ యుద్ధం ముగింపుకోసం పాక్ తెర వెనుక చైనా చేసిన ప్రయత్నాలు ఇపుడు ఒకే వేదికపైకి రానున్నాయి. శాశ్వత ప్రాతిపదికన కాల్పుల విరమణకోసం అటు వాషింగ్టన్, ఇటు ఇరాన్ పాలకులు పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా శుక్రవారం హాజరవుతున్నారు. శాంతి ఒప్పందానికి అనువుగా ఈ భేటీలో ఇప్పటికే ఇరాన్ తన పది డిమాండ్లను మధ్యవర్తుల ద్వారా వాషింగ్టన్ పెద్దలకు అందచేసింది. వెంటనే కాల్పులు విరమించాలని, సరిహద్దులనుంచి అమెరికా దళాలు వైదొలగాలని, భవిష్యత్తులో దాడులు చేయబోమన్న స్పష్టమైన హామీ ఉండాలని పేర్కొంది. అలాగే ఈ ఒప్పందంలోని చర్చలన్నింటిలోనూ లెబనాన్ భాగం ఉంటుందని, లెబనాన్‌పైనా దాడులు చేయ కూడదని ప్రకటిస్తూ ఇరాన్‌పై ఇప్పటివరకూ అమెరికా విధించిన ఆంక్షలన్నింటినీ ఎత్తివేయాలని ఇరాన్ చెపుతోంది. హార్ముజ్‌పై ఇరాన్ పర్యవేక్షణ కొనసాగుతుందని, ఇకపై హార్ముజ్‌జలసంధినుంచి వెళ్లే ప్రపంచదేశాల నౌకలపై టోల్ లేదా సర్‌ఛార్జి వసూలుచేస్తామని, అలాగే యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లు అమెరికా ముందుకువచ్చాయి. ఇరాన్ తరపున పార్లమెంటు స్పీకర్ మహ్మద్ ఘాలిబ్ నేతృత్వంలో ప్రతినిధిబృందం వస్తుంటే చర్చల్లో ముందునుంచీ కీలకంగా వ్యవహరించిన అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ నాయకత్వంలోప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు చేరుతుంది. ఇదిలా ఉంటే ఇరాన్ చేస్తున్న డిమాండ్లు హాస్యాస్పదంగా ఉన్నాయని చెపుతున్న అమెరికా ఇకపై యురేనియం శుద్ధి, అణ్వాయుధ రహస్య తయారీలు ఉండకూడదని హార్ముజ్ జలసంధిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తోంది.
గడువులోపు దారికి రాకుంటే మళ్లీసైనిక చర్య తప్పదని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరిగే చర్చలపైనే ఇపుడు ప్రపంచదేశాలన్నీ ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్‌దేశాలు ఈ చర్చలపై కొంత ఆశాభావంతో ఉన్నాయి. ఎందు కంటే ఇరాన్ చేసిన దాడులన్నీ గల్ఫ్‌దేశాలపైనే ఎక్కువ ఉన్నాయి. కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఖతార్, ఎమిరేట్స్ వంటి దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లనే లక్ష్యంగా చేసుకుంది. వాటితోపాటే అమెరికాకు సహకరిస్తున్నదని విమర్శిస్తూ ఈ దేశాల్లోని మౌలికవనరులపైనా దాడులు చేయడంతో గల్ఫ్‌దేశాలు కూడా ఆందోళనలో మునిగిపోయాయి. అందుకే ఇపుడు ఇస్లామాబాద్ చర్చలపైనే ఈ దేశాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. సత్ఫలితాలు రాకుంటే మళ్లీ యుద్ధంతో పర్షియన్ గల్ఫ్ మంటలు మండు టుందన్న ఆందోలనలు ఇపుడు ఆదేశాలు పట్టిపీడిస్తున్నాయి.

## దక్షిణాదికి 2,600 మెగావాట్ల ఎన్టీపిసి విద్యుత్

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీకి చెందిన 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ దక్షిణాది విద్యుత్ అవసరాలను తీర్చంలో కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు రోజుకు 42 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. 2100 మెగావాట్ల సామర్థం ఉన్న స్టేజ్ 1, స్టేజ్ 2 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి సింగరేణి నుంచి రోజుకు 32వేల మెట్రిక్ టన్నుల కోల్ లింకేజీ ఒప్పందం ఉంది. అలాగే స్టేజ్ 3లోని 500 మెగావాట్ల 7 యూనిట్‌కు ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి 8వేల మెట్రిక్ టన్నుల బొగ్గు లింకేజీ ఒప్పందం ఉంది. ప్రాజెక్టు అవసరమైన 6.5 టీఎంసీల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుతారు. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు 754 మెగావాట్లు (29శాతం), తమిళనాడుకు 572 మెగావాట్లు (22శాతం), కర్నాటకకు 416 మెగావాట్లు (16శాతం), కేరళకు 312 మెగావాట్లు (12శాతం), గోవాకు 130 మెగావాట్లు (5శాతం), పాండిచ్చేరికి 52 మెగావాట్లు (2శాతం) సరఫరా చేస్తోంది. కాగా టిఎస్‌టిపిపి స్టేజ్ 2 నిర్మాణానికి రెడీ అవుతోంది. 2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీ ఆవరణలోనే 4000 మెగావాట్ల మరో ప్రాజెక్టును నిర్మిస్తోంది. మొదటి దశలో 800 మెగావాట్ల రెండు యూనిట్లు గత ఏడాదిలో పూర్తయి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నది. స్టేజ్ 2 కింద మరో 2400 మెగావాట్ల ప్లాంటు నిర్మించేందుకు అంతా సిద్ధం చేస్తోంది.

## 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదల
### ఫలితాలను విడుదల చేసిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలో 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల తుది ఫలితాలను గురువారం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన నర్సుల సెలక్షన్ లిస్టును బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉంచింది. పారదర్శకత కోసం పరీక్ష రాసిన సుమారు 42 వేల మంది అభ్యర్థుల పూర్తి వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2024లో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు మరో 2322 పోస్టులను భర్తీ చేసింది. దీంతో ప్రభుత్వ హాస్పిటళ్లలో నర్సుల కొరత పూర్తిగా తీరిపోయినట్టేనని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ బాధ్యతలు చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో 12,649 పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందులో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్ల, ల్యాబ్ టెక్నీషియన్లు సహా వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్నిరకాల పోస్టులు ఉన్నాయి.
మరో 4500 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ హాస్పిటళ్లలో సిబ్బంది కొరత లేకుండా చూడాల న్నది రేవంత్ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హాస్పిటళ్లు అంటే కేవలం జీవోలు ఇచ్చుడు కాదని.. అవసరమైన భవనాలు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఎక్విప్‌మెంట్, డయాగ్నస్టిక్, అవస రమైన మందులు వంటి సౌకర్యాలు అన్నీ ఉండాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ పలు సందర్భాల్లో చెప్పారు. నిరంతర పర్యవేక్షణ, వరస రివ్యూలు, కోర్టు కేసులపై ఎప్పటికప్పుడూ సమీక్షిస్తూ వాటిని క్లియర్ చేయించడంతో ఖాళీల భర్తీ ప్రక్రియ వేగంగా జరిగింది. సపోర్టింగ్ స్టాఫ్ మొదలుకొని స్పెషలిస్ట్ డాక్టర్ల వరకు అన్ని విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తుండటంతో ప్రభుత్వ వైద్య సేవలు బలోపేతమయ్యాయి. గతంలో ఎంబీబీఎస్ సీట్లు ఇవ్వడానికి అడ్డంకులు చెప్పిన నేషనల్ మెడికల్ కమిషన్, కొత్తగా 10 మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్లను సైతం మంజూరు చేసింది. ఈ ఏడాది మరో 250కి పైగా పీజీ సీట్ల కోసం మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఇవేగాకుండా, కొత్తగా 5 పీజీ సెంటర్లను సెకండరీ కేర్ హాస్పిటళ్లలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
తద్వారా జిల్లాల్లోనే స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రజలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే భర్తీ పూర్తయిన పోస్టుల వివరాలు.. నర్సింగ్ ఆఫీసర్లు 9278, ల్యాబ్ టెక్నీషియన్లు (గ్రేడ్2) 1,542, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు (సీఏఎస్) 425, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ 623, జూనియర్ అసిస్టెంట్లు (గ్రూప్4) 334, ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు 138, ఫిజియోథెర పిస్టులు 48, జూనియర్ అసిస్టెంట్లు (గ్రూప్3) 39, అసిస్టెంట్ ప్రొఫెసర్ 132, అసిస్టెంట్ ప్రొఫెసర్లు (ఎంఎన్‌జే) 28, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు 24, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (గ్రూప్1) 20, డ్రగ్ ఇన్స్పెక్టర్లు 18 పోస్టులను భర్తీ చేశారు.

## ఐదు గ్రామాల కోసం భద్రాచలం గర్జన!

### పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని అఖిలపక్షం అల్టిమేటం
### సరిహద్దుల్లో చిక్కుకున్న పట్టణం.. ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహం
### భద్రాచలం నుంచి ఢిల్లీ దాకా పోరాటానికి శ్రీకారం

**భద్రాచలం, ప్రభాతవార్త:** ఐదు గ్రామ పంచాయతీల విలీనంపై భద్రాచలంలో మళ్లీ ఉద్యమ జ్వాలలు రగులుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఆ ఐదు గ్రామాలను తిరిగి భద్రాచలం పరిధిలోకి తీసుకు రావాలని అఖిలపక్ష నేతలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంస్థలు ఏకమై గళమెత్తుతు న్నాయి. ఈ అంశాన్ని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు రూపంలో ప్రవేశపెట్టాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గురువారం హరిత హోటల్‌లో జరి గిన ఐక్యవేదిక సమావేశం ఈ ఉద్యమానికి కొత్త ఊపిరినిచ్చింది. రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ యూని యన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం చరిత్రలో ఇదో కీలక మలుపని పేర్కొన్నారు. ఐదు గ్రామాల విభజనతో ఏర్పడిన సమస్యలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయని అన్నారు.

**సరిహద్దుల మధ్య చిక్కుకున్న భద్రాచలం**

వివిధ పత్రికల కథనాల ప్రకారం, భద్రాచలం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలోనే ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ఉండటం వల్ల పరిపాలనలో అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయి. రెవెన్యూ, పోలీసు, ఆరోగ్యం, విద్య వంటి విభాగాల్లో సమన్వయం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని నివేదికలు చెబుతున్నాయి. కొన్ని పత్రికలు ప్రత్యేకంగా ప్రస్తావించిన విషయం ఏమిటంటే!! భద్రాచలం పట్టణ శివారు ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్ లో ఉండటం వల్ల పట్టణ విస్తరణకు పెద్ద అడ్డంకిగా మారింది. రోడ్లు, డ్రైనేజ్, తాగునీటి ప్రాజెక్టులు అమలు చేయడంలో అధికారులు తలమునకలవుతున్నారు.

**ప్రజల జీవితాల్లో ఇబ్బందుల పరంపర**

స్థానికుల వాదన ప్రకారం, ఒకే కుటుంబం రెండు రాష్ట్రాల్లో విభజించబడిన ఉదాహరణలు ఉన్నాయి. రేషన్ కార్డులు, పింఛన్లు, విద్యార్థుల చదువు, వైద్య సేవలు!!ప్రతి విషయంలో గందరగోళం నెలకొంది. ఈ సమస్యలను పలు పత్రికలు వరుస కథనాలుగా ప్రచురిస్తూ సమస్య తీవ్రతను వెలుగులోకి తీసుకువచ్చాయి.

**రాజకీయంగా కూడా హాట్‌టాపిక్**

ఇటీవల కాలంలో ఈ అంశం రాజకీయంగా కూడా వేడెక్కుతోంది. రాష్ట్ర మంత్రి తుమ్మల ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకుంటూ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కలిసినట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో సమస్యకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యత పెరిగింది. భద్రాచలంలో జరిగిన సమావేశంలో అన్ని పార్టీల నేతలు ఒకే వేదికపైకి రావడం విశేషం. ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఆదివాసీ సంస్థలు అన్నికలిసి ఉద్యమానికి మద్దతు ప్రకటించాయి. ఇది మరో తెలంగాణ ఉద్యమాన్ని తలపించేలా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

**ఢిల్లీ దాకా పోరాటం**

భద్రాచలం నుంచి పార్లమెంట్ వరకు పోరాటం తీసుకెళ్తాం" అని నేతలు స్పష్టం చేశారు. త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించి తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించనున్నారు. అవసరమైతే నిరసనలు, ర్యాలీలు, దీక్షలు చేపట్టేందుకు సిద్ధమని హెచ్చరించారు. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఐదు గ్రామాల విలీనం భద్రాచలం అభివృద్ధికి కీలకం. లేకపోతే పట్టణ విస్తరణ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం అత్యంత కీలకంగా మారింది.ఈ సమావేశంలో సర్పంచులు పూనెం కృష్ణ, తిప్పన సిద్దులు, గడ్డం స్వామి, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, యువ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు తనిఖీ చేసిన జెఎండి

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ 6 ఎస్.ఆర్. నగర్‌లో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యటించారు. డివిజన్ పరిధిలో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉన్న జూబ్లీహిల్స్, వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి?, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు. ఫిల్లింగ్ స్టేషన్ లో పెండింగ్‌లో ఉన్న ట్యాంకర్ సరఫరాలపై వివరాలు తెలుసుకుని నిర్వహణ పరిస్థితులను పరిశీలించారు. వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్ వద్ద నీటి ప్రవాహం, అందుతున్న నీటి పరిమాణాన్ని సమీక్షి ంచి, ప్రస్తుత డిమాండ్‌ను తీరుస్తున్న సరఫరా సరిపోతుందా అని ఆరదీశారు చేశారు. ఈ సందర్భంగా ట్యాంకర్‌లను సమయానికి పంపిణీ చేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, పెండింగ్‌లో ఉన్న అన్ని ట్యాంకర్‌లను ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంకర్‌ల కదలికపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి, ట్యాంకర్ డెలివరీలో ఆలస్యం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిజిఎం ప్రభు, జిఎం ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## గోదావరి పుష్కర ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, నిజామాబాద్ కందకుర్తి నుంచి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకై పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈఎన్సిలు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని సూచించారు.

## అత్తారింట్లో వంట గదిలోకి అనుమతించకపోవడమూ క్రూరత్వమే!
### బాంబే హైకోర్టు స్పష్టీకరణ

**ముంబై, ఏప్రిల్ 9:** అత్తారింట్లో మహిళను వంట గదిలోకి అనుమ తించక పోవడమూ మానసిక క్షోభకు గురిచేయడం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు తేల్చింది. భర్త తనను వంట గదిలోకి రానివ్వడం లేదంటూ ఇటీవల ఓ మహిళ అతడిపై కేసు పెట్టింది. దీంతో అతడు బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ.. ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని కించపరచడంతోపాటు మానసిక క్షోభకు గురిచేసినట్టే అవుతుందని తేల్చి చెప్పింది. వారిద్దరూ 2022లో వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికే వారి మధ్య వివాదాలు మొదలయ్యాయి. దీంతో అత్తింటి వారంతా ఆమె ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'నన్ను అసలు వంట గదిలోకే అనుమతించడం లేదు. ఆహారం కూడా బయట నుంచి తెచ్చుకోవాలని బలవంతపెట్టారు. పుట్టింటి వాళ్లను కూడా కలవనివ్వలేదు. విడాకులు ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నారు' అని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఆరోపణలను ఆమె భర్త ఖండించారు. 'విడాకులు ఇవ్వాల్సి వస్తుందనే కారణంతోనే ఆమె ఇవన్నీ సృష్టించారు' అని ఆమె భర్త తరఫు న్యాయమూర్తి కోర్టులో వాదనలు వినిపించారు. దీనిపై విచారణ చేసిన ధర్మాసనం అతనిపై వేధింపుల కేసును కొట్టివేసేందుకు అంగీకరించలేదు. ఇంట్లో ఆమె సాధారణ అవసరాలను కూడా తీర్చుకోనివ్వకుండా కట్టడి చేయడం కూడా మానసిక క్రూరత్వం కిందకే వస్తుంది అని పేర్కొంది. కానీ ఈ కేసులో ఆమె అత్తపై చేసిన ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయంటూ ధర్మాసనం కొట్టివేసింది.

## కేరళ టెక్కీ కర్ణాటక ట్రెక్కింగ్‌లో మిస్సింగ్



**బెంగళూరు, ఏప్రిల్ 9:** కర్ణాటకకొండల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లి కేరళకు చెందిన మరో బాలిక మిస్సయ్యింది. ఇటీవలే కేరళకు చెందిన ఓ టెక్కీ కర్ణాటక కొండల్లో ట్రెక్కింగ్‌కి వెళ్లి తప్పిపోయింది. అనంతరం పోలీసులు గాలింపులు చేపట్టడంతో నాలుగు రోజుల తర్వాత ఆమె ఆచూకీ దొరికింది. మళ్లీ అలాంటి ఘటనే చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేరళలోని పాలక్కడ్ జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలిక పదోతరగతి చదువుతున్నది. కర్ణాటకలోని చంద్రద్రోణ హిల్స్ పైకి ఈనెల 7న దాదాపు 40 మంది కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లింది. అదేరోజు సాయంత్రం తమ బృందం నుంచి ఆ బాలిక దారి తప్పిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే బాలిక కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. కొండలపై తాళ్ల సాయంతో వెతికారు. రాత్రి వేళల్లో డ్రోన్లతోనూ ఆమె కదలికలను గుర్తించేందుకు ప్రయత్నించారు.

## ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ స్క్రీనింగ్ కమిటీ పునర్వ్యవస్థీకరణ

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) అధికారుల ఉద్యోగోన్నతుల పరిశీలన కోసం స్క్రీనింగ్ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సాదారణ పరిపాలనా శాఖ జి.ఓ 718 ప్రకారం.. అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి (అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కజర్వేటర్) స్థాయి ప్రమోషన్లను పరిశీలించేందుకు ఈ కమిటీ పనిచేయనుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంతకుముందు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ, కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ / ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రధాన అటవీ సంరక్షణాధికారి, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి ఉంటారు. ఈ కమిటీ ఐఎఫ్ఎస్ అధికారుల పనితీరు, సీనియారిటీ తదితర అంశాలను పరిశీలించి, ఉద్యోగోన్నతులపై తుది సిఫారసులు చేయనుంది.

### ఉగ్ర లింకుల కేసులో మరో ఆరుగురిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విజయవాడ ఉగ్ర లింక్స్ కేసులో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో అరెస్టయిన మరో ఆరుగురు నిందితులను కొత్తపేట పోలీసులు గురువారం నుంచి ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న వీరిని మధ్యాహ్నం విజయవాడకు తరలించనున్నారు.

13వ తేదీ వరకు వీరిని విచారించేందుకు విజయవాడ సీజేఎం కోర్టు పోలీసులకు అనుమతి మంజూరు చేసింది. అంతకుముందు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించిన ఐదుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తాజా విచారణకు రంగం సిద్ధమైంది. వారి స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ ఆరుగురి నుంచి కీలక సమాచారం రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం కస్టడీలోకి తీసుకోనున్న నిందితుల్లో బిహార్‌కు చెందిన షాద్‌మాన్ దిల్కష్ (ఏ4), ఢిల్లీకి చెందిన లక్కీ అహ్మద్ ( ఏ7), రాజస్థాన్‌కు చెందిన జిషాన్ (ఏ9), పశ్చిమ బెంగాల్‌కు చెందిన మీర్ ఆసిఫ్ అలీ (ఏ10), పుణెకు చెందిన షారుక్ ఖాన్ (ఏ12), మహారాష్ట్రకు చెందిన షేక్ ఫయాజ్ రెహమాన్ (ఏ13) ఉన్నారు. కాగా, ఈ కేసులో మొత్తం 13 మందిపై కేసు నమోదు కాగా, పోలీసులు ఇప్పటివరకు 12 మందిని అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచి విచారణ కొనసాగిస్తున్నారు.

## జగన్ ఏమి చెప్పినా జనం వినే స్థితిలో లేరు

**- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

**విజయవాడ, ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత విధానాలను అనుసరిస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ఆయన ఏమీ చెప్పినా ప్రజలు ఆయనను విశ్వసించే పరిస్థితి లేదన్నారు. వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాంయిలో విరుచుకుపడ్డారు. మూడు రాజధానుల పేరుతో రుషికొండను మింగేసి, సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్.. ఇప్పుడు మావిగన్ జోకర్ గా మిగిలిపోయారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ కేవలం వైఎస్సార్ పేరును ఉపయోగించుకున్నారో తప్ప, ఆయన ఆశయాలకు వారసుడు కాలేకపోయారని విమర్శించారు. వైఎస్సార్ జీవితకాలం వ్యతిరేకించిన బీజేపీకి జగన్ దత్తపుత్రుడిగా ఎలా మారారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా క్రైస్తవ మైనారిటీలపై దాడులు జరుగుతున్నా వైఎస్సార్ వారసుడిగా జగన్ ఎందుకు ఖండించలేదని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు.



హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్ టెక్నాలజీ ప్రాజెక్ట్(ఉహాచిత్రం)

# క్వాంటమ్ హార్డ్‌వేర్ హబ్‌గా అమరావతి

**- 14న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం**

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతికి విశ్వవ్యాప్తం ఖ్యాతిని తీసుకుని వచ్చే,ఓ చారిత్రకత్మ ఆవిష్కరణకు తొలి అడుగు ఈ నెలలో పడనుంది.దేశంలోనే తొలి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్‌లతో భవిష్యత్ టెక్నాలజీలో అమరావతి మరో సంచలనానికి నాంది పలుకనున్నది. ఈ నెల 14న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమయ్యే ప్రాజెక్ట్ క్వాంటమ్ యుగానికి అంకుర్పారణ కానున్నది. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ హబ్‌గా మలిచే దిశగా ఇది చారిత్రక ఘట్టంగా నిలుస్తోంది. క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి క్వాంటమ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యం దిశగా కీలకమైన ముందడుగు పడింది. దేశంలోనే తొలి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్ బెడ్‌లు అమరావతిలోని ఎస్ ఆర్ఎం యూనివర్సిటీ, విజయవాడలోని మేధాటవర్స్‌లోనూ ఏర్పాటవుతున్నాయి. భారత్ క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ గా వ్యవహరిస్తున్న వీటిని ఈ నెల 14న ప్రపంచ ఈ రెండుచోట్ల దేశీయ పరిజ్ఞానంతో తయారుచేసిన రెండు చిన్న క్వాంటమ్ కంప్యూటర్లను ఏర్పాటు చేస్తున్నారు. క్వాంటమ్ వ్యాలీ ఆలోచన మొగ్గతొడిగాక, ఆ రంగంలో విశేష నైపుణ్యం ఉన్న దేశ, విదేశీ నిపుణులతో స్టార్టప్ కంపెనీగా ఏర్పాటైన క్యూబిట్ ఫోర్స్ సంస్థ ఈ క్వాంటమ్ కంప్యూటర్లను రూపొందించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తు న్న రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ను కేవలం క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్టింగ్ కోసమే కాకుండా, దేశంలోని పరిశోధకులు, స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమలు, యూనివర్సిటీలు, విద్యార్థులు వినియోగించు కోవచ్చు. క్వాంటమ్ టెక్నాలజీని ఇంత వరకు పాఠ్యపుస్తకాల్లో చదివి, సిమ్యులేటర్లపైనే ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు ఇకపై నేరుగా క్వాంటమ్ కంప్యూటర్లపై ప్రయోగాలు చేయవచ్చు. ఎస్ఆర్ఎం, మేధాటవర్స్‌లో ఏర్పాటు చేస్తున్న రిఫరెన్స్ ఫెసిలిటీల్లో 111 క్యూబిట్స్ వరకు క్వాంటమ్ ప్రాసెసర్‌లను పరీక్షించవచ్చు. రాబోయే పదేళ్లలో మిలియన్ క్యూబిట్స్ వరకు టెస్టింగ్ సదుపాయాన్ని అభివృద్ధి చేయాలని క్యూబిట్ ఫోర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోని 6 నగరాలకు చెందిన సంస్థలు తయారుచేసిన క్వాంటమ్ విడిభాగాల్ని అమరావతికి తీసుకొచ్చి వాటిని క్యూబిట్ ఫోర్స్ సంస్థ అసెంబుల్ చేస్తోంది. వాటికి కావలసిన ప్రాసెసర్‌లను టీఐఎఫ్ఆర్ ముంబయి, ఐఐఎస్‌సీ బెంగళూరు తయారు చేశాయి. పుణెలోని డీఆర్‌డీవో ల్యాబ్ క్వాంటమ్ కంట్రోల్ ఎలక్ట్రా నిక్స్‌ను అందజేసింది. అంబర్ ఎంటర్‌ప్రైజెస్, క్యూబిట్‌ఫోర్స్ సంస్థలు అత్యంత కీలకమైన డైల్యూషన్ రిఫ్రిజిరేటర్లను తయారుచేశాయి. క్యూట్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ప్రిసిషన్ కరెంట్ అండ్ వోల్టేజ్ సోర్సెస్‌ను అందజేసింది. దిమిరా సంస్థ ఫ్లెక్స్ కేబుళ్లు, క్రయోజెనిక్ వైరింగ్‌ను సమ కూర్చింది. సిస్టమ్ ఇంటిగ్రేషన్, అసెంబ్లింగ్, టెస్టింగ్ బాధ్యతలను క్యూబిట్ ఫోర్స్ నిర్వహి స్తోంది. క్వాంటమ్ కంప్యూటర్లలో ప్రాసెసర్లు ఎంత కీలకమో, డైల్యూషన్ క్రయోజెనిక్ రిఫ్రిజిరేటర్లూ అంతే కీలకం. క్వాంటమ్ కంప్యూటర్లలో 273 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్ర తను నిర్వహించేందుకు డైల్యూషన్ రిఫ్రిజ రేటర్లను వినియోగిస్తారు. వీటిలో హీలియం3, హీలియం 4 వాయువుల్ని వాడతారు. అమరావతి రిఫరెన్స్ ఫెసిలిటీస్‌లో ఏర్పాటుచేస్తున్న కంప్యూటర్లలో హీలియం4 వాయువుల్ని వినియోగించారు. దానితో ఉష్ణోగ్రతను 269 నుంచి 272 డిగ్రీల వరకు తగ్గించవచ్చు. హీలియం3 వాయువు చాలా అరుదుగా దొరుకుతుంది. మన దేశంలోని రక్షణరంగ పరిశోధన సంస్థల దగ్గరే అందుబాటులో ఉంది. ఇక వాటిలో వినియోగించిన కీలకమైన హార్డ్‌వేర్‌ను ప్రముఖ ప్రభుత్వరంగ రక్షణ, శాస్త్రసాంకేతిక పరిశోధన సంస్థలతో పాటు, ప్రైవేటు సంస్థలు తయారు చేశాయి.

### వైఎస్సార్ మొదలుపెట్టిన పాదయాత్ర - చరిత్రను తిరగ రాసిన ఘట్టం



**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్రకు ఏప్రిల్ 9కు 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, వైసీపీ అధినేత జగన్ తన తండ్రి స్మృతులను నెమరువేసుకున్నారు. ఎక్స్ వేదికగా ఆయన భావోద్వేగంతో కూడిన ఒక ట్వీట్ చేశారు.2003 ఏప్రిల్ 9వ తేదీన ఎర్రటి ఎండలో వైఎస్సార్ మొదలుపెట్టిన పాదయాత్ర కేవలం ఒక ప్రయాణం కాదని, అది రాష్ట్ర రాజకీయ చరిత్రనే తిరగరాసిన అపూర్వ ఘట్టమని జగన్ కొనియాడారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు సాగిన ఆ యాత్ర, జన హృదయాల్లో నేనున్నాననే భరోసాఖి నింపిందని గుర్తుచేశారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేసి, రైతన్నలను రాజులుగా నిలబెట్టిన ఘనత వైఎస్సార్‌దేనని జగన్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యేలా చేయడంతో పాటు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేదలకు ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు.

## దేశాభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరం

**- ప్రతి కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్తి: మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** దేశాభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరమని రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, భీమా శాఖ మంత్రి వాసంసెట్టి శుభాష్ వెల్లడించారు. నాగార్జున అగ్రికం కెమికల్ లిమిటెడ్ (ఎన్ఎసిఎల్)లో 55వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి మంత్రితో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గం శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలసి గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ ఏ సి ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లో నిర్వహిస్తున్న 55వ జాతీయ భద్రతా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సంస్థలోని యాజమాన్యం, ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల చూపుతున్న నిబద్ధతకు అభినందనలు తెలిపారు". జాతీయ భద్రతా దినోత్సవం ఒక సాధారణ వేడుక మాత్రమే కాదని, ఇది మనందరికీ భద్రతపై అవగాహన పెంచే ఒక జాతీయ ఉద్యమన్నారు. దేశ అభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరం. అయితే, ఆ అభివృద్ధి భద్రత, ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణతో కలిసి ఉండాలన్నారు. ప్రతి కార్మికుడు దేశానికి ఒక విలువైన ఆస్తి అని, వారి భద్రతను కాపాడటం కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదు, ఒక నైతిక బాధ్యత కూడా ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగి భద్రతలో భాగస్వామ్యం చేయాలని, వారికి అవగాహన కల్పించాలని, నియమాలను కచ్చితంగా ఉండాలని వివరించారు. ఎన్ ఏ సి ఎల్ ప్రోసెస్, భద్రత, మేనేజ్ మెంట్ సిస్టం అమలు చేస్తూ, స్టడీస్, రిస్క్ అసెస్మెంట్స్, మేనేజ్మెంట్ ఆఫ్ ఛేంజ్ విధానాలను పాటిస్తున్నట్లు తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇంటర్లాక్స్, గ్యాస్ డిటెక్టర్లు, ఎమర్జెన్సీ షట్ డౌన్ సిస్టమ్స్ వంటి ఇంజనీరింగ్ నియంత్రణలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రెగ్యులర్ ఆడిట్లు, మాక్ డ్రిల్, లీడర్షిప్ ఆధారిత సేఫ్టీ ఇనీషియేటివ్స్ ద్వారా ప్రమాదాలను ముందుగానే నివారించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిర క్షణలో భాగంగా జీరో లిక్విడ్ డిస్చార్జ్ వంటి విధానాలను అమలు చేయడం అభినందనీ యమన్నారు. ఉద్యోగులకు శిక్షణ, ఎమర్జెన్సీ సిద్ధపాటు, వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగం పై ప్రత్యేక దృష్టి పెట్టడం ప్రసంశనీయమన్నారు. ఇలాంటి సమగ్ర భద్రతా విధానాలు ప్రమాదాలను తగ్గించడమే కాకుండా సంస్థ పనితీరును మెరుగుపరుస్తాయని కొని యాడారు. ఎన్ ఏ సి ఎల్ సంస్థకు సి ఐ ఐ నుండి భద్రతా నాయకత్వం బహుమతి, ఐ సి సి నుండి పర్యావరణ పరిరక్షణ బహుమతి లభించడం గర్వకారణమన్నారు. ఇతర పరిశ్ర మలు కూడా ఇలాంటి ఉత్తమ పద్ధతులను అనుసరించాలన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, కార్మికులు కలిసి పనిచేసి జీరో హార్మ్ లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. భద్రత కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు జీవితంలో కూడా పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా అన్ని సంస్థలు భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని, శిక్షణలో పెట్టుబడులు పెట్టాలని, భద్రతను ఒక విలువగా మార్చాలని కోరారు. ఎన్ ఏ సి ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ను మరోసారి అభినందించారు.

## ఎర్రచందనం స్మగ్లర్లకు యేడాది జైలుశిక్ష

**తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ముగ్గురు ముద్దాయిలకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. తిరపతి జిల్లా పోలీసుల గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థతో స్మగ్లర్లకు శిక్ష,జరిమానా విధింపబడుతోందని పోలీసులు తెలిపారు.ఎర్రచందనం అక్రమ రవాణా ,తీవ్ర అటవీ నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష తప్పదని హెచ్చరికలు చేస్తున్నారు.. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పర్యవేక్షణలో అమలవుతున్న 'గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా ఈ కేసును సమర్థవంతంగా నడిపి, నిందితులకు శిక్ష ఖరారు చేయడంలో జిల్లా పోలీసులు విజయవంతమయ్యారన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదున 29/2016 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో, తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు కీలక తీర్పు వెలువరించింది. రైల్వే కోడూరు మండలంకు చెందిన కదదా హరిబాబు అనే బాలపల్లి బాబు (60.), నాగారం బాబు రెడ్డి (36 ) కొర్లగుంట తిరుపతి, గోడింలా మల్లికార్జున్ (51) నిందితులకు న్యాయమూర్తి ఏ. నరసింహ మూర్తి దోషులుగా నిర్ధారిస్తూ, ఒక్కొక్కరికి ఒక సంవత్సరం కారాగార శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కీలక కేసులో విచారణ, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్ విభాగాల్లో అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### లులు కంపెనీకి స్థల కేటాయింపు రద్దు ప్రజాపోరాట విజయం

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్ బాబురావు**

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** లులు కంపెనీకి స్థల కేటాయింపు రద్దు ప్రజాపోరాట విజయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు పేర్కొన్నారు. విజయవాడ పాత ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని లులు మాల్ కొరకు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరిస్తున్నట్లు, నిన్న హైకోర్టులో ప్రభుత్వం తరపున ఏజీ రాతపూర్వకంగా తెలియజేశారు. లులు కి భూముల కేటాయింపును వ్యతిరేకిస్తూ రైతు నేత శ్రీ వడ్డే శోభనాద్రిశ్వరరావు హైకోర్టులో పిల్ వేసారు. దీంతో ప్రభుత్వం భూ కేటాయింపును రద్దు చేసినట్లు రాతపూర్వకంగా కోర్టుకు తెలిపింది. ఇది ప్రజా పోరాట విజయం, ప్రభుత్వం చట్ట విరుద్ధంగా, నిబంధనలు ధిక్కరించి బడా కంపెనీలకు ప్రభుత్వ స్థలాలను ధారా దత్తం చేయటం, ఈ అడ్డగోలు కేటాయింపులపైన ప్రభుత్వానికి ఇదొక హెచ్చరిక అని సిహెచ్ బాబురావు పేర్కొన్నారు.

### వేసవిలో పశువుల తాగునీటికి నీటితొట్టెల ఏర్పాటు

**పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ టి. దామోదర్ నాయుడు**

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక అనుసంధానంతో గ్రామీణ ప్రాంతాలలో నీటి తొట్టెలను నిర్మించి, వేసవిలో పశువులకు తాగునీటి వసతి కల్పించడం జరిగిందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి దామోదర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసవి కాలంలో పశువులు, జీవాల నీటి కొరతను అధిగమించడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం

**సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ**

**పత్తికొండ,ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపడుదామని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పిలుపు నిచ్చారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో కామ్రేడ్ చదవుల రామయ్య శతజయంతి ఉత్సవాలు సిపిఐ మండల కార్యదర్శి యు.కారుమంచి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా చదవుల రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళీలు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేవానికి ప్రమాదకరంగా ఉన్నాయని, మోడీ 12 ఏళ్ళ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా చమురు, వాణిజ్య, ఆహార ధరలు విపరీతంగా పెరిగి పోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిచ్చోడిలా పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. భూస్వాముల నుండి వేలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన ఘనత చదువుల రామయ్యకే దక్కిందన్నారు. సిపిఐ శ్రేణులు కామ్రేడ్ చదువుల రామయ్య స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, పి.రామచంద్రయ్య, ఆవుల శేఖర్, బి.గిడ్డయ్య, ఉమ్మడి జిల్లాల నుండి సిపిఐ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిఆర్ఎన్ వలసలో ఉద్రిక్తత

**మాజీ ఎమ్మెల్సీ జగదీష్, ఎమ్మెల్యే విజయచంద్ర మద్దతుదారుల మధ్య వివాదం**

**పార్వతీపురం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండలంలోని పిన్నింటి రామినాయుడువలసలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జగదీష్ ఎమ్మెల్యే విజయ్ చంద్ర మద్దతుదారుల మధ్య వివాదం చోటు చేసుకుంది. పిఆర్ఎన్ వలస స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించి విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేను పిలవగా ఎమ్మెల్యే తనకు సమయం కేటాయించలేదని దానితో మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్ను పిలవడం జరిగిందని అన్నారు. దానితో స్థానిక ఎమ్మెల్యే మద్దతుదారులు తాము ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించడం జరిగిందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ విగ్రహవిష్కరణకు స్థలానికి చేరుకోగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దతుదారులు పిఆర్ఎన్ వలస చేరుకొని జగదీష్‌తో విగ్రహావిష్కరణ చేయించొద్దంటూ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు వివాదం వద్దకు చేరుకొని ఇరువర్గాలను సముదాయించి కార్యక్రమాన్ని వాయిదా వేయించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్వతీపురం చరిత్రలోనే మునుపెన్నడూ ఇటువంటి రాజకీయం జరగలేదని సొంత పార్టీ వాలే పార్టీ కార్యక్రమాల్ని అడ్డుకోవడం మంచి సంస్కృతి కాదని అన్నారు. ఇది సొంత కార్యక్రమం కాదని పార్టీ కార్యక్రమాన్ని శాసించే అధికారం ఎవరికి లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ పార్టీ కాదని ఒకరికి సంబంధించిన పార్టీ కాదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వాళ్ళు చేసిన మేము అభ్యంతరం చెప్పే వాళ్ళం కాదని అన్నారు. తాము వివాదానికి రాలేదని కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరం జీవులు, బిజెపి నాయకులు సురగాల ఉమామహేశ్వర రావు జగదీష్ మద్దతుదారులు పాల్గొన్నారు.

## విజయవాడలో 11న రాష్ట్ర స్థాయి జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవం

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** బడుగుల ఆశాజ్యోతి మహ్మాత్మా జ్యోతిరావు పూలే ద్విశతబ్ది జయంతి ఈ నెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పూలే జయంత్యోత్సవం నిర్వహించనున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కుల కోసం, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం జీవితాన్ని ధారపోశారన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారన్నారు. ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి పూలే జయంత్యోత్సవం నిర్వహించనున్నామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్ కు చెందిన శిల్ప కళాకారులు రూపొందించిన జ్యోతిరావు పూలే విగ్రహ నమూనాలను తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత పరిశీలించారు. వాటిని రూపొందించిన కళాకారులను మంత్రి అభినందించారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు నందం అబద్ధయ్య, మల్లె ఈశ్వరరావు, ఎర్రిబోతు రమణరావు, వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు 15 నుంచి ప్రత్యేక శిబిరాలు

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు ఈ నెల 15 నుంచి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు స్వర్ణ గ్రామ, వార్డుల (ఎస్‌జిఎస్‌డబ్ల్యు) శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల విద్యాశాఖ, సంబంధిత అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తొలి విడతలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ, మలి విడతలో ఈ నెల 21 నుంచి 24 వరకు ఈ శిబిరాలను స్వర్ణ గ్రామ, వార్డుల కార్యాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మార్చి 2026 వరకు ఆధార్ నమోదు కార్యక్రమాలు పూర్తయ్యాక, రాష్ట్రంలో సుమారు 12.09 లక్షల మంది బయోమెట్రిక్ నమోదు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన శిబిరాల ద్వారా 79 వేల బయోమెట్రిక్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. ముఖ్యంగా 15 నుంచి 17 ఏళ్ల వయసు గల జూనియర్ కాలేజీ విద్యార్థుల బయోమెట్రిక్ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. కొత్త ఆధార్ నమోదు, ఇతర సేవలు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. జిల్లాల వారీ పరిశీలిస్తే, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కువ బయోమెట్రిక్ నమోదులు పెండింగ్‌లో ఉన్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,09,554 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన ఆధార్ కిట్ల మొబిలైజేషన్ కోసం ప్రతి కేంద్రానికి రూ.1,000 చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. అదనపు భద్రత, సహాయక చర్యల కోసం మహిళా పోలీసులను కూడా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలు నిర్వహించే సమయంలో డిజిటల్ అసిస్టెంట్లు, డబ్ల్యుఇడిపిఎస్‌లను ఇతర పనులకు పంపొద్దని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం

**- తిరుపతిలో ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ వేడుకలు**



**తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాత వార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘాల్లో ఎన్ ఎస్ యు ఐ ఒకటని, విద్యార్థుల సమస్య లపై రాజీలేని పోరాటం చేస్తూ ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ముందుకు సాగుతున్నామని విద్యార్థి నాయకులు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతిలో గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు శివ బాలాజీ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ,స్వర్గీయ ఇందిరా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు కేకు కట్ చేసి విద్యార్థులకు, నాయకులకు పంచిపెట్టారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ విద్యార్థులకు అండగా నిలబడుతుందన్నారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 1971లో విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం,ఉన్నత చదువుల కోసం దీనిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ ఎస్ యు ఐ ఆ దిశగా ముందుకు సాగుతోందని, విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందిస్తూ సమానత్వం కోసం ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తుందని చిట్టిబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి , ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ కంభంపాటి ,చిత్తూరు శివ శంకర్ ,ఎన్ ఎస్ యు ఐ తిరుపతి నగర కార్యదర్శులు గౌతం, దీపక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జ్యోతిశ్వర్ నాయక్, తిరుపతి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వం



**తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం దేశంలోనే అత్యున్నత వేద విద్యా కేంద్రంగా వెలుగొందుతోంది. 'వేదాలకు పుట్టినిల్లు తిరుమల" అనే మహోన్నత భావాన్ని సార్థకం చేస్తూ శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించే దివ్య విద్యా కేంద్రంగా నిలుస్తోంది. భారతీయ సంస్కృతికి మూలాధారమైన వేద సంప్రదాయాల పరిరక్షణ, ప్రచారం, ప్రోత్సాహంలో టిటిడి తనదైన శైలిలో అగ్రగామిగా నిలుస్తోంది. వేద విజ్ఞాన పీఠం 1884 ఫిబ్రవరిలో మహంత్ ప్రయాగ్ దాస్ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ వేదపాఠశాల ప్రారంభంలో మూడు విభాగాలతో మొదలై కాలక్రమేణా వేద, ఆగమ, పౌరోహిత్యం, శాస్త్ర విద్యలను సమగ్రంగా బోధించే విశిష్ట సంస్థగా అభివృద్ధి చెందింది. 1992లో తిరుమల ధర్మగిరిలో శాశ్వతంగా స్థాపించబడిన ఈ సంస్థకు "వేద విజ్ఞానపీఠం"గా పునర్నామకరణం చేశారు. 17 విభాగాల్లో వేద విద్యా బోధన జరుగుతోంది. నాలుగు ప్రధాన విభాగాల కింద మొత్తం 17 ప్రత్యేక విద్యా శాఖలు నిర్వహించబడుతున్నాయి. వేదాధ్యయనంలో 7 వేదశాఖలు, ఆగమాధ్యయనంలో 5 ఆగమాలు, స్మార్త అధ్యయనంలో 4 విభాగాలు, దివ్యప్రబంధంలో ఆళ్వారుల 4000 పాశురాలు బోధించబడుతున్నాయి. ఈ కోర్సులు దీర్ఘకాలికంగా నిర్వహించబడుతూ విద్యార్థులకు లోతైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తున్నాయి ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం మొత్తం 374 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో వేద కోర్సుల్లో 140 మంది, ప్రబంధఆగమ కోర్సుల్లో 177 మంది, స్మార్త కోర్సుల్లో 57 మంది ఉన్నారు. వీరికి బోధన అందించేందుకు 43 మంది పండితులు సేవలందిస్తున్నారు. 540 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థం ఉన్న హాస్టల్ సౌకర్యాలు, శుభ్రమైన నివాస వాతావరణం, 24 గంటల నీటి సరఫరా, వేడి నీటి సదుపాయం అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించేందుకు ఉదయం పాలు, ఇడ్లీ, దోసె, ఉప్మా వంటి వంటకాలు, మధ్యాహ్నం అన్నం, పప్పు, కూరలు, సాంబారు, రసం, పెరుగు, సాయంత్రం పాలు, రాత్రి భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, నిత్యావసర వస్తువులు (సబ్బులు, నూనెలు, పేస్ట్ మొదలైనవి) అందించబడుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణ కోసం అశ్విని ఆసుపత్రి ద్వారా ప్రతిరోజూ వైద్య సేవలు అందించబడుతున్నాయి. అవసరమైతే తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల్లో కూడా ఉచిత చికిత్స అందిస్తున్నారు.

## సన్‌స్క్రీన్ తప్పనిసరి !



చాలామంది మేకప్ వేసుకున్నాం కదా.. ఇంక సన్‌స్క్రీన్ అవసరం ఉండదులే అనుకుంటారు. కానీ అది పొరపాటు. మిగిలిన సమయాల్లో ఎలా ఉన్నా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా సన్‌స్క్రీన్ రాసుకోవాలి. ఎందుకంటే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షించగలిగేది సన్‌స్క్రీన్ మాత్రమే. సన్‌స్క్రీన్ రాసుకున్న తర్వాత దాని మీద మామూలుగా మేకప్ వేసుకున్నా సెట్ అవుతుందంటున్నారు నిపుణులు.

**బ్రష్‌లు శుభ్రం చేస్తున్నారా..?** మీరు ఉపయోగించే మేకప్ బ్రష్‌లను తరచుగా శుభ్రం చేయాలనుకుంటున్నారు. ఎందుకంటే. చేయని బ్రష్లపై శుభ్రంగా చేరుతుంది.. వాటిని తిరిగి ఉపయోగిస్తే లేనిపోని చర్మ సమస్యలు కొని తెచ్చుకున్నట్లే. అందుకే మేకప్‌కి ఉపయోగించే బ్రష్లను శుభ్రం చేయడం తప్పనిసరి.

**గడువు తేదీ గమనిస్తున్నారా?**
మేకప్ సామగ్రి కొన్న తర్వాత అవి ఎన్ని రోజులు ఇంట్లో అలానే ఉన్నా వాటిని ఉపయోగిస్తూనే ఉంటాం. కానీ, వీటి గడువు తేదీని కూడా గుర్తించాలని నిపుణులు భావిస్తున్నారు. ఒకవేళ ఎక్స్‌పైరీ దాటిన ఉత్పత్తులను ఉపయోగిస్తే అలర్జీలు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువ. కాబట్టిసారి గడువు తేదీని బట్టి ఏడాదికో మేకప్ ఉత్పత్తులను మార్చడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు ▫

## ఒత్తిడి తగ్గించుకోవాలి!



గర్భధారణ మహిళల జీవితంలో ఆనందకరమైన దశ అయినప్పటికీ, ఇది భావోద్వేగ, శారీరక ఒత్తిడికి కూడా కారణమవుతుంది. గర్భధారణ సమయంలో దీర్ఘకాలిక ఒత్తిడి నిద్రలేమి, అధిక రక్తపోటు, ఆకలి తగ్గడం వంటి సమస్యలకు దారి తీస్తుంది. అంతేకాకుండా ముందస్తు ప్రసవం (ప్రిటర్మ్ బర్త్), తక్కువ బరువుతో శిశువు జననం వంటి ప్రమాదాలకూ కారణమవుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందువల్ల ఒత్తిడిని నియంత్రించడం ప్రీనేటల్ కేర్‌లో కీలక భాగంగా మారింది. గర్భధారణ అనేది శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా మార్పులు తీసుకువచ్చే ప్రయాణం. హార్మోన్ల మార్పులు, శరీర అసౌకర్యం, శిశువు ఆరోగ్యం, ప్రసవంపై ఆందోళనలు వంటివి ఒత్తిడికి కారణమవుతాయి. కొంతమేర ఒత్తిడి సహజమైనదే అయినప్పటికీ అధిక ఒత్తిడి తల్లి, గర్భంలోని శిశువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**నాణ్యమైన నిద్ర ఉండాలి..** దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల కార్టిసోల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి. ఇవి తల్లి ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు పరోక్షంగా శిశువు అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తాయి. నిద్రలేమి, రక్తపోటు పెరగడం, ఆకలి తగ్గడం వంటి సమస్యలు కలుగుతాయి. అలసట పెరిగే కొద్దీ ఒత్తిడి కూడా పెరుగుతుంది. కనుక నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర అవసరం. ▫

## వెయ్యి మంది బధిరులకు అండగా



ఆమెకు వినిపించదు.. మాట్లాడలేదు.. ఈ లోపాలతో అడుగడుగునా వివక్షను ఎదుర్కొంది. స్కూల్లో, కాలేజీలో ఎక్కడికెళ్లినా ఆమెను వేరు చేసి చూసేవారు. ఇంటర్వ్యూలోనైనా సక్సెసై తన కాళ్లపై తాను నిలబడదామంటే అక్కడ వరుస తిరస్కరణలే! ఇలాంటి పరిస్థితిలో ఎవరున్నా నిరాశకు లోనవుతారు. కానీ కీర్తిక మాత్రం ధైర్యంగా నిలబడింది. ప్రతి సమస్యకూ పరిష్కారం వెతుక్కుంటూ, సవాళ్లను సానుకూలంగా స్వీకరిస్తూ ముందుకు సాగింది. ఈ పాజిటివిటీనే ఇప్పుడు ఆమెను తనలాంటి బధిరుల కోసం నిలబడేలా చేసింది. మూగ, చెవిటి సమస్య ఉన్న మహిళలకు సంజ్ఞా భాష, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తూ వారు ఆర్థిక సాధికారత సాధించేలా, నాయకత్వ హోదా కోసం కృషి చేస్తోంది. మహిళలే తోటి మహిళలను ప్రోత్సహించగలరు.. అంటోన్న కీర్తిక స్ఫూర్తి కథ.. మీరూ చదివేయండి!

**ఆ ఇబ్బందులు పడలేక !**
నాగ్‌పూర్‌లో కీర్తిక పుట్టి పెరిగింది. వినికిడి లోపంతో పుట్టిన ఆమెకు పెరిగి పెద్దయ్యే మాటలూ రాలేదు. దీంతో స్కూల్లో అందరూ దూరం పెట్టేవారని చెబుతోంది. 'స్కూల్లో కొన్ని రోజులు అతి కష్టంమీద గడిచాయి. టీచర్లు, విద్యార్థులతో కమ్యూనికేట్ చేయడం ఇబ్బందిగా అనిపించేది. మరోవైపు పాఠాలూ అర్థమయ్యేవి కావు. దాంతో తరగతిలో జరిగే చర్చల్లోనూ పాల్గొనలేకపోయింది. ఏ విషయం అర్థం చేసుకోవాలన్నా పెదల కదలికల్ని తెలుసుకోవడం, చూస్తూ కొన్ని విషయాలు నేర్చుకోవడం, అవతలి వారికి ఏం చెప్పాలన్నా రాతపూర్వకంగా తెలియజేయడం.. స్టేజ్ బట్టీ చేసేదాన్ని. ఈ అమ్మానాన్నల ప్రోత్సాహంతో సంజ్ఞా భాష నేర్చుకున్నా.. తిరిగి సొంతంగా డిగ్రీ పూర్తిచేశా. అంటోంది కీర్తిక వరుస తిరస్కరణలు అయినా! చదువు పూర్తయ్యాక తన కాళ్లపై ఉద్యోగం సంపాదించుకుంది. కీర్తిక. ఈ ఆలోచనతోనే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అయితే తన సమస్య కారణంగా పలుమార్లు తిరస్కరణకు గురైంది. ఈ ఉద్యోగమైనా వస్తుందేమోనన్న ఆశతో ప్రతిసారీ ఇంటర్వ్యూకు హాజరయ్యేదాన్ని. కానీ నాతో ఎలా మాట్లాడాలో అవతలి వారికి అర్థం కాకపోయేది. అందుకే నాలో ప్రతిభ ఉన్నా కమ్యూనికేషన్ స్కిల్స్ లేవని నన్ను తిరస్కరించారు. అలా చాలాసార్లు ఇంటర్వ్యూలో వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ప్రతికూల అనుభవాలు నాకెన్నో పాఠాలు నేర్పాయి. మానసికంగా నన్ను నేను దృఢంగా మార్చుకునేలా చేశాయి.. అయితే ఇలా ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నప్పుడే 'రైజింగ్ క్వీన్స్' అనే ఆన్‌లైన్ మహిళ కమ్యూనిటీ గురించి తెలుసుకున్నా ఆర్థికంగా వారిని స్వతంనరతుల్ని చేయడం ఈ వేదిక ముఖ్యోద్దేశం. ఈ సంస్థలో మెంటర్‌గా చేరా.. అంటోంది కీర్తిక.

**వాళ్లకు అండగా.!** అలాగే బధిర మహిళలను సాధికారత దిశగా ప్రోత్సహించాలని 2023లో 'కీర్తికా డెఫ్ క్వీన్స్' పేరుతో ఓ ఇన్స్టా పేజీ తెరిచింది. ఈ వేదికపై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. వారు తమ లోపాల్ని అధిగమించి కెరీర్‌లో సక్సెసయ్యేలా ప్రోత్సహిస్తున్నారు.. ప్రస్తుతం మా డిజిటల్ కమ్యూనిటీ వేదికగా బధిర మహిళల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా వారికి సంజ్ఞా భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలు నేర్పించడం, వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేయడం, ఆయా వృత్తి నైపుణ్యాలు పెంపొందించడం. అంతేకాదు.. తమ వ్యక్తిగత అనుభవాలు పంచుకునేలా ప్రోత్సహిస్తున్నాం. దీని వల్ల తాము ఒంటరి కాదు.. అన్న భావన చాలామంది మహిళల్లో కలుగుతుంది. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇలా ఒకరిని చూసి మరొకరు ఉత్సాహంగా అడుగు ముందుకేయగలుగుతారు.. అంటోన్న కీర్తిక.. ఈ మూడేళ్లలో వెయ్యి మందికి పైగా బధిర మహిళలను సాధికారత వైపు నడిపించింది. వీళ్లలో చాలామంది తమ శారీరక లోపాల్ని అధిగమించి ఆయా ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.. మరికొందరు నాయకత్వ హోదాను అందుకున్నారు. వీళ్ల సక్సెస్ స్టోరీస్ని కూడా ఇన్స్టా వేదికగా పంచుకుంటూ మరింతమంది బధిర మహిళల్లో స్ఫూర్తి రగిలిస్తోంది ఇద్దరు కూతుళ్లకు తల్లైన కీర్తి.. తన పిల్లల్ని నలుగురికి సహాయపడేలా, ఆర్థిక స్వావలంబన సాధించేలా పెంచుతున్నానంటోంది. ▫



## జపమాల

దైవనామాన్ని స్మరించేటప్పుడు.. జప సంఖ్యను లెక్కించడానికి ఉపయోగించే పూసల సరాలను తావళం, జపమాల అంటారు. ఇది ప్రశాంతత కలిగిస్తుంది. ఏకాగ్రత పెంచుతుంది. 54 లేదా 108 పూసలతో పాటు లెక్కలోకి రాని మరో అదనపు పూస ఉంటుంది. దీన్ని 'మేరువు' అంటారు. గుండ్రం గా తిప్పుతూ జప సంఖ్యను చివరకు తోడ్పడుతుందీ మేరువు. పత్ర మాలికలు: దైవారాధనలో పత్రాలకూ ప్రాముఖ్యత ఉంది. తులసి, మరువం, దవనం, తమల పాకు.. ఇలా వివిధ రకాలైన ఆకులతో మాలలల్లి సమర్పిస్తారు. తులసితో అల్లిన మాలలు విష్ణు మూర్తికి ప్రీతికరమైనవని పురాణ కథలు ఉన్నాయి. 'ఆముక్తమాల్యద' కావ్యానికి ఆ పేరు రావడానికి కారణం తులసి మాలలే. తాను ధరించి విడిచినది అనేది అర్థం. తండ్రి అల్లిన తులసి మాలలను శ్రీరంగనాథునికి అలంకరించకముందే గోదాదేవి తాను ధరించి తర్వాత స్వామికి సమర్పించేది. తమలపాకుల దండలతో ఆంజనేయస్వామిని అర్చిస్తారు. మరువం, దవనం, వంటి సుగంధ పత్రాలను మాలలల్లి భగవంతుని సేవలో వినియోగిస్తారు. ఇవే కాకుండా యాలకులు లాంటి సుగంధ ద్రవ్యాలతోనూ 'సరం' కూర్చి ఆరాధిస్తారు. అయ్యప్ప దీక్షధారులు రుద్రాక్ష, తులసి మాలలనూ ధరిస్తారు. దీక్షను మాల ధారణ అంటారు. అటే కఠినమైన వ్రతాచరణ నియమాలతో ఆధ్యాత్మిక ప్రయాణం మొదలైందని సూచించడం. స్వాతి కార్తెలో కురిసే వాన చినుకలు ముత్యపు చిపనపల్లో చేరి ముత్యాలుగా రూపొందుతాయి. ఇవి చంద్రునికి ఇష్టమైనవి. ముత్యాలను ధరిసేనత చూపరులకు చెడు ఆలోచనలు కలగకుండా రక్షణ కలుగుతుందని పెద్దలు చెబుతారు. ▫

## ఎండుమిర్చి నిల్వ ఎలా ?



వేసవి వచ్చిందంటే చాలు... చాలా మంది మహిళలు కూరలు, పచ్చళ్లకు కావలసిన కారాన్నీ, తాలింపుల కోసం మిరపకాయల్ని నిల్వ చేస్తారు. వీటిని సరిగా భద్రపరచ రంగుతో పాటు రుచి, వాసన లేకపోతే కోల్పోతాయి. అలా కాకూడదంటే...

✦ కొన్ని మిరపకాయల్లో ముందుగా రంగు మారిన, పాడయిన వాటిని ఏరి పక్కన పెట్టుకోవాలి. వంట చేసేటప్పుడు తడి చేతులతో మిరపకాయలను తీయకూడదు. నిల్వ చేసే డబ్బాలను నేరుగా ఎండ తగిలే కాకుండా, చల్లని, చీకటి ప్రదేశంలో ఉంచాలి. మిరపకాయలు మెత్తబడితే, వాటిని కాసేపు పెనంపై వేడి చేసి ఆరిస్తే మళ్లీ కరకరలాడతాయి. ✦ నిల్వ చేయడానికి ముందే కనీసం 23 రోజులపాటు మిరపకాయల్ని ఎండలో ఆరనివ్వాలి. అవి గలగలలాడుతున్నప్పుడు తొడిమలు తీసి నిల్వ చేసుకోవాలి. లేదంటే తేమకి బూజు పట్టే అవకాశం ఉంది. తొడిమల్ని ఉంచితే... పురుగు పట్టొచ్చు. ✦.ఎండిన మిరపకాయలను ప్లాస్టిక్ కవర్లలో కాకుండా, గాలి చొరని గాజు సీసాల్లో, స్టీల్ డబ్బాల్లో నిల్వ చేయాలి. డబ్బా అడుగున చిన్న ఇంగువ ముక్కను ఉంచినా లేదా కొన్ని ఎండిన వేప ఆకులు లేదా కొద్దిగా పసుపు కలిపినా పురుగు చేరదు. రంగూ మారవు. ✦.కూరల కోసం ఒట్టి మిరపకాయల్ని మాత్రమే కారం పట్టించొద్దు. బదులుగా కాసిని దనియాలు, మెంతులు, జీలకర్ర, వెల్లుల్లి... వంటి వాటిని నూనె లేకుండా దొరగా వేయించుకుని ఈ మిరపకాయల్లో కలిపితే రుచి బాగుంటుంది. దీన్ని జిలక్ కవర్లలో పెట్టి ఫ్రిజ్లో పెడితే రంగూ, రుచితో పాటు సువాసనా పోదు. ✦ పచ్చళ్లలో వాడే కారానికి... కాస్త ఘాటుగా ఉంటే గుంటూరు మిర్చి 70 శాతం, రంగు కోసం 30 శాతం బ్యాడగి మిర్చి లేదా కాశ్మీరీ చిల్లీని ఎంచుకోవాలి. మిర్చిలోని తేమను తొలగించి సువాసనను పెంచడానికి తక్కువ మంట మీద కొద్ది సమయం తేలిగ్గా వేయించి ఆపై కారం కోసం దంచితే మేలు. ▫

## జీడిపప్పు కీరా సలాడ్



**కావలసిన పదార్థాలు**
కీరా: రెండు
జీడిపప్పు: గుప్పెడు
పచ్చిమిరపకాయ: ఒకటికొత్తిమీర: నాలుగు
రెబ్బలువెల్లుల్లి రెబ్బలు: రెండుపెరుగు: రెండు టేబుల్ స్పూన్లుఉప్పు: తగినంత

**తయారీ విధానం:**
జీడిపప్పును వేడి నీళ్లలో గంటసేపు నానబెట్టుకోవాలి. కీరాను శుభ్రంగా కడిగి, చెక్కు తీసి సన్నటి ముక్కలుగా తరిగి పక్కకు పెట్టుకోవాలి. నానిన జీడిపప్పుతోపాటు రెండు వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి, ఉప్పు కలిపి మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. పేస్ట్‌లా వచ్చేందుకు కొద్దిగా నీళ్ల చిలకరించుకొంటే సరి! ఇందులో రుచిని బట్టి మిరపకాయ.. అది వద్దనుకుంటే మిరియాల పొడి (అర టీస్పూన్) వాడుకోవచ్చు. కొత్తిమీరను సన్నగా తరిగి పెట్టుకోవాలి. తినాలనుకునే ముందు కీరాముక్కల్లో ఈ కాజు పేస్ట్‌ను కలుపుకొని కొత్తిమీర చల్లుకోవాలి. చివర్లో పెరుగును కూడా జోడిస్తే మరింత రుచిగా ఉంటుంది. ▫

## అఖిల్ 'లెనిన్' స్పెషల్ పోస్టర్ రిలీజ్



అండ్ డైనమిక్ హీరో అఖిల్ అక్కినేని 'లెనిన్' మీదున్న హైప్ గురించి అందరికీ తెలిసిందే. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన 'లెనిన్' ఓ డిఫరెంట్ స్టోరీతో రాబోతోంది. ఇప్పటికే ఫస్ట్ సింగిల్‌తో మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. భావోద్వేగాలతో పాటుగా ఆకట్టుకునే కథనంతో కంప్లీట్ సినిమాటిక్ ప్యాకేజీగా 'లెనిన్' రూపుదిద్దుకుంటోంది. అఖిల్ అక్కినేని పుట్టినరోజు సందర్భంగా నిర్మాతలు స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆయనకు బర్త్ డే విషెస్ చెబుతూ ఈ పవర్ ఫుల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అఖిల్ కొత్త లుక్‌లో కనిపించగా, ఆయన చిరునవ్వు మరింత అట్రాక్టివ్‌గా ఉంది. అభిమానుల్లో ఇప్పటికే ఎన్నో అంచనాల్ని క్రియేట్ చేసిన ఈ చిత్రం జూన్ 26, 2026న విడుదల కానుంది. మురళీ కిషోర్ అబ్బూరు 'లెనిన్' చిత్రాన్ని భారీ స్థాయిలో, అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరి యెన్స్ ఇచ్చేలా రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు ఆయన మ్యూజిక్, ఆర్ఆర్‌తో సినిమా నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తుందని టీం చెబుతోంది.

# తెర

## 101 మిలియన్ + వ్యూస్‌తో కొత్త రికార్డు సృష్టించిన 'ఆయా షేర్' సాంగ్



న్యాచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ది ప్యారడైజ్' హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం గ్లింప్స్, పోస్టర్లు, సింగిల్ సింగిల్ 'ఆయా షేర్'కు వస్తున్న భారీ స్పందనతో సినిమాపై అంచనాలు నెక్స్ట్ లెవల్‌కి చేరుకున్నాయి. ముఖ్యంగా, ఆయా షేర్ పాట భారీ చార్ట్‌బస్టర్‌గా నిలిచి, సినిమాపై మ్యాసీవ్ హైప్‌ని క్రియేట్ చేసింది, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన హైవోల్టేజ్ మ్యూజిక్ మరో స్థాయికి తీసుకెళ్లింది. 'ఆయా షేర్' విడుదలైన రోజు నుండి యూట్యూబ్, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఇప్పుడు ఈ పాట 101 మిలియన్ + వ్యూస్ సాధించి, నాని పాటలలోనే వేగంగా ఈ ఫీట్ సాధించిన పాటగా నిలిచింది. సినిమా రిలీజ్‌కు ముందే 100 మిలియన్ మార్క్ దాటిన నాని తొలి పాటగా "ఆయా షేర్" రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ పాటను వైరల్ జోన్‌లోకి తీసుకెళ్లిన ప్రధాన కారణం నాని స్క్రీన్‌పై చూపించిన మాగ్నెటిక్ ఎనర్జీ. ఆయన డైనమిక్ మూవ్స్, ఫియర్స్ అటిట్యూడ్, అలాగే ఆకట్టుకునే హుక్ స్టెప్ సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇన్స్టాలో రీల్స్ వరదలా వచ్చాయి, యూట్యూబ్‌లో డ్యాన్స్ కవర్లు హోరెత్తించాయి, ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఆ స్టెప్స్‌ను రీక్రియేట్ చేశారు. పాట ఎంత గ్రాండ్‌గా వినిపిస్తుందో, అంతే గ్రాండ్‌గా కనిపించేం దుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. షూట్ కోసం ప్రత్యేకంగా భారీ స్లమ్ సెట్ నిర్మించారు. ఆ విజువల్స్‌కు లార్జర్‌దెన్‌లైఫ్ ఫీల్ ఇవ్వడంతో పాటకు సరిపోయే ఇంటెన్సిటీ వచ్చింది.

## 'ఓ..! సుకుమారి' చిత్రం షూటింగ్ పూర్తి



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ గత చిత్రాలతో బ్లాక్ బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ..! సుకుమారి' చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వరరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఫోటోలో హీరో తిరువీర్‌తో పాటు టీమ్ మొత్తం ఒకేచోట చేరి సెలబ్రేట్ చేసుకుంటూ హ్యాపీ వైబ్‌లో కనిపించారు. ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం సినిమాకి పని చేస్తోంది. రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరా మ్యాన్. ఎం.ఎం.కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం.తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అనురెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## కన్నీళ్లు తెప్పించే 'డైమండ్ డెకాయిట్' చిత్రం



టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారిన కంప్లీట్ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా 'డైమండ్ డెకాయిట్' చిత్రం శుక్రవారం (ఏప్రిల్ 10న) తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా థియేటర్లలో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మహిళా ప్రేక్షకులకు ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల కానున్న థియే టర్లలో 4 షోలు మహిళలకు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు వెల్లడించింది. మహిళలు ఎక్కువ సంఖ్యలో థియేటర్లకు వచ్చి సినిమాను ఆస్వాదించాలని చిత్ర బృందం కోరింది. ఈ చిత్రంలో పార్థా గోపాల్ హీరోగా నటించడమే కాకుండా నిర్మాతగా వ్యవహరించగా, మేఘనా రెడ్డి హీరోయిన్‌గా నటించారు. రచయిత-దర్శకుడు సూర్య జి.యాదవ్ దర్శ కత్వంలో రూపొందిన ఈ చిత్రం పూర్తి కుటుంబ వినోదంతో పాటు హృద్యమైన భావోద్వేగాలతో కూడిన ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది. ఈ సినిమా చూస్తే కన్నీళ్లు ఆపుకోవడం కష్టమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ మూవీ ప్రచార చిత్రా లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇటీవల దర్శకేం ద్రుడు కే. రాఘవేంద్ర రావు ట్రైలర్‌ను వీక్షించి చిత్ర బృందాన్ని అభినందించారు. ఇప్పటికే నిర్వ హించిన ప్రివ్యూ షోలలో పలు వురు సినీ ప్రము ఖులు ఈ చిత్రాన్ని ప్రశంసించినట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

## కల్ట్ సీరియల్స్ తీసుకొస్తున్నాం: శరత్ చంద్ర



ఈ నెల శరత్ చంద్ర డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన చాయ్ బిస్కెట్ ఇటీవలే లాంచ్ చేసిన షార్ట్ సిరీస్ ఓటీటీ ప్లాట్‌ఫారం 'చాయ్ షాట్స్' సూపర్ సక్సెస్ సాధించింది. స్మార్ట్‌ఫోన్ ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'చాయ్ షాట్స్' కంటెంట్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రెస్ మీట్‌లో చాయ్ షాట్స్ కోఫౌండర్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. డిసెంబర్‌లో చాయ్ షాట్స్ లాంచ్ ఈవెంట్ నిర్వహించాం. అప్పటికి యాప్‌ను ఎలా డిజైన్ చేయాలి, ఎలాంటి కంటెంట్ ఇవ్వాలని ఆలోచనల్లో ఉన్నాం. ఇప్పుడు మూడు నెలలు గడిచాయి. ఈ సమయంలో మేము గుర్తించిన విషయం ఏమిటంటే..మా ఆడియన్స్‌లో దాదాపు 70% 35 ఏళ్లు పైబడిన వారు. చాయ్ బిస్కెట్‌లో మేము యంగ్ ఆడియన్స్ కోసం కంటెంట్ చేయడం అలవాటు. చాయ్ షాట్స్‌ను టీవీ, ఓటీటీ కలిపి ఒక ప్యాకేజ్‌గా చేయాలని అనుకుంటున్నాం. అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ. కరోనా సమయంలో ఆఫీస్‌కు ఎవరు రాకపోవడంతో ఒక నిమిషం నిడివి గల వీడియోలు చేయడం ప్రారంభించాం.

## 24న అర్జున్ అంబటి 'పరమపద సోపానం'



'అర్ధనారి' 'తెప్ప సముద్రం' 'వెడ్డింగ్ డైరీస్' వంటి వైవిధ్యమైన సినిమాలతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ అంబటి.. అటు తర్వాత బుల్లితెరపై 'బిగ్ బాస్' రియాలిటీ షోతో ఫ్యామిలీ ఆడియన్స్ కి మరింత దగ్గరయ్యారు.ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'పెద్ది'లో కూడా అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు అర్జున్ అంబటి. అతను హీరోగా రూపొందిన లేటెస్ట్ మూవీ 'పరమపద సోపానం'. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటించిన ఈ సినిమాని 'గణపర్తి శ్వేత' సమర్పణలో 'స్వయంభూ క్రియేషన్స్' సంస్థ పై గణపర్తి నారాయణ రావు తేల్రపోలు ప్రసన్న ఆంజనేయులు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. పులగం సుప్రియ సహ నిర్మాత. స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేసిన నాగ శివ 'పరమపద సోపానం' చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు.అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నాగ శివ. ఇక మాస్ మహారాజ్ రవితేజ 'ఈగల్ వంటి భారీ బడ్జెట్ సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవ్ జాండ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

## 'సర్కార్ బాయి' మూవీ పూజా కార్యక్రమం



తెలంగాణ సామాజిక నేపథ్యంతో రాబోతున్న చిత్రం 'సర్కార్ బాయి'. శ్రీరామ్ నిర్మల, సాయి కీర్తన హీరోహీరోయిన్లుగా, లారా దర్శకత్వంలో రూపొందుతున్న 'సర్కార్ బాయి' చిత్రానికి సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముహూర్తం కార్యక్రమంలో భాగంగా నిర్మాత తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు లారా సీన్ డైరెక్షన్ చేశారు. ముహూర్తం షాట్‌ను తెలంగాణ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి దాస్య నాయక్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కు అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకురాలు లారా మాట్లాడుతూ.. 1985 సంవత్సరంలో జరిగిన నీటి సంఘట నలు, కుల వివక్షత వంటి అంశాలను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కి స్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రతిబింబించే కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ పొందుతుందనే నమ్మకాన్ని మూవీ యూనిట్ వ్యక్తం చేసింది. ప్రేక్షకులు ఈ సామాజిక కథాంశంతో వచ్చే చిత్రాన్ని ఆదరించాలని డైరెక్టర్ కోరారు. ఈ చిత్రంలో హీరోగా శ్రీరామ్ నిర్మల, హీరోయిన్‌గా సాయి కీర్తన నటిస్తున్నారు

# శతకానికి ఇంకెంత దూరం!



**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభమై రెండు వారాలు పూర్తయింది.15 మ్యాచ్‌లు ముగిశాయి. సిక్స్‌ల మోత మోగుతోంది. ఇప్పటికే 229 సిక్స్‌లు, మరో 427 ఫోర్లు బాదారు. ధనాధన్ ఇన్నింగ్స్‌లకూ కొదవలేదు. అయినా ఇప్పటికీ ఆ ఒకటి లోటుగా ఉంది. ఏ మ్యాచ్‌కు ఆ మ్యాచ్‌లో ఆ లోటు తీరుతుందని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా ఆశ నెరవేరడం లేదు. హాఫ్‌సెంచరీల వరద పారుతున్నా పులల్‌సెంచరీ ఎపుడన్నది ఆసక్తిగా మారింది. ఐపీఎల్‌లో మొదటగా సెంచరీ సాధించే హీరో ఎక్కడ అని క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.**

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ 2025 సీజన్ రెండో మ్యాచ్‌లోనే శతకం నమోదైంది. రాజస్థాన్ రాయల్స్‌పై ఇషాన్ కిషన్ (ఎస్ఆర్‌హెచ్) కేవలం 45 బంతుల్లోనే సెంచరీ మోత మోగించాడు. ఆ సీజన్‌లో తొలి సెంచరీ చేసిన మొనగాడిగా నిలిచాడు. మొత్తంగా గత ఏడాది ఐపీఎల్‌లో 9సెంచరీలు నమోదయ్యాయి. అభిషేక్ 55 బంతుల్లో 141 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇషాన్, అభిషేక్‌తో పాటు రిషబ్ పంత్, రాహుల్, సాయి సుదర్శన్, క్లాసెన్, ప్రియాన్ష్ ఆర్యా, వైభవ్ సూర్యవంశీ శతకాలు బాదారు. ముఖ్యంగా వైభవ్... గుజరాత్‌పై 37 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో మెరుపు శతకం సాధించాడు.

ఐపీఎల్ 2026లో ఇప్పటివరకు కేఎల్ రాహుల్ (92), సమీర్ రిజ్వీ(90) మాత్రమే నైంటీస్ లోకి వచ్చారు. ఇద్దరూ కూడా ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లే. కఎల్ రాహుల్... గుజరాత్‌పై సెంచరీ సాధించే ఊపులో కనిపించినా తృటిలో చేజార్చుకున్నాడు. మరో ఇద్దరు రికల్టన్(81), ఇషాన్ కిషన్(80) 80 ప్లస్ రన్స్ చేశారు. కానీ ఎవ్వరూ సెంచరీ సాధించలేకపోయారు.

మ్యాచ్‌లో ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ ఓ హోదాను, ప్రత్యేకతను సూచిస్తుంది. ఆరెంజ్ క్యాప్ ధరించారంటే అప్పటివరకు అతనే అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ కింద లెక్క. అత్యధిక వికెట్లుతో ఉన్న వారు పర్పుల్ క్యాప్ ధరిస్తారు. ఈ రేసులో యశస్వి జైస్వాల్(170 రన్స్), రవి బిష్ణోయ్ (7 వికెట్లు) ముందున్నారు.

**పరుగుల వేటలో యశస్వి జైస్వాల్**

ఐపీఎల్ 2026 సీజన్ ఇప్పుడిప్పుడే అసలైన హీట్ అందుకుంటోంది. లీగ్‌లో 15 మ్యాచ్‌లు ముగిసేసరికి పాయింట్ల పట్టికతో పాటు, ఆరెంజ్ క్యాప్ (అత్యధిక పరుగులు), పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు) రేసు



రసవత్తరంగా మారింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, మార్క్రమ్, అభిషేక్, ఇషాన్, సంజూ లాంటి వాళ్లను వెనక్కి నెట్టిరాజస్థాన్ రాయల్స్ యంగ్ సెన్సేషన్ యశస్వి జైస్వాల్.. ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు.3 మ్యాచ్‌ల్లో 170 స్ట్రైక్ రేట్‌తో 170 పరుగులు సాధించాడు. అందులో రెండు అర్ధసెంచరీలు ఉన్నాయి. మరో యువ సంచలనం సమీర్ రిజ్వీ 160 పరుగులతో రెండో స్థానంలో ఉంటే, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ హెన్రిక్ క్లాసెన్145 పరుగులతో మూడో స్థానంలోఉన్నాడు. ఇక 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 122 పరుగులతో టాప్4లో నిలిచి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.రోహిత్ శర్మ(118) అయిదో స్థానంలో ఉన్నాడు.

**రవి బిష్ణోయ్ పర్పుల్ క్యాప్**

వికెట్ల వేటలో స్పిన్ మాంత్రికుడు బిష్ణోయ్ ముందు నిలిచి పర్పుల్ క్యాప్‌ను తన ఆధీనంలో ఉంచు కున్నాడు. ఈ రాజస్థాన్ రాయల్స్ లెగ్ స్పిన్నర్ 3 మ్యాచ్‌ల్లో 7 వికెట్లు పడగొట్టాడు. ప్రసిద్ధ్ కృష్ణ 6 వికెట్లతో గట్టి పోటీ ఇస్తుండగా... రషీద్ ఖాన్, లుంగే ఎన్గిడి వంటి స్టార్ బౌలర్లు 5 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ సీజన్‌లో స్పిన్నర్లు, పేసర్ల మధ్య వికెట్ల వేట పోటాపోటీగా సాగుతోంది.

ఐపీఎల్ 2026 సీజన్‌లో సిక్సర్ల మోత మోగుతోంది. ఇప్పవరకు 229 సిక్స్‌లు నమోదయ్యాయి. ఎక్కువ సిక్స్‌లు బాదిన ప్లేయర్లలో వైభవ్ సూర్యవంశీ, సమీర్ రిజ్వీ టాప్ ప్లేస్‌లో ఉన్నారు. చెరో 11 సిక్స్‌లు బాదారు. రికల్టన్ (ముంబై), టిమ్ డేవిడ్(ఆర్సీబీ), రజత్ పాటిదార్(ఆర్సీబీ) తలా 9 సిక్స్‌లు, యశస్వి జైశ్వాల్ 8 సిక్స్‌లు నమోదుచేశారు.

ఈ సీజన్ లో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు కేఎల్ రాహుల్ పేరిట ఉంది. గుజరాత్ టైటాన్స్‌పై ఆయన చేసిన 92 పరుగులు హైలైట్‌గా నిలిచాయి. రవి బిష్ణోయ్ గుజరాత్ టైటాన్స్‌పై 4 ఓవర్లలో 41 పరుగులిచ్చి 4 వికెట్లు తీసి ఈ సీజన్ బెస్ట్ స్పెల్ నమోదు చేశాడు. ముజరబానీ కూడా ఒక మ్యాచ్‌లో 4 వికెట్లు తీశాడు. ఈ సీజన్‌లో మేటి ప్లేయర్లను వెనక్కి నెడుతూ యంగ్ గన్స్ దూసుకువస్తున్నారు. చూస్తుంటే యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞుల మధ్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది.



### తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్, శ్రీకాంత్ పరాజయం

## ఏడో సీడ్‌పై ఆయుష్ సంచలనం



**నింగ్బో (చైనా):** ఆసియా సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టి సంచలనంతో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో 21-13, 21-16తో ప్రపంచ 7ర్యాంకర్ లిన్ షి ఫెంగ్ (చైనా)ను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 51 నిమిషాల్లో ముగించాడు. రెండు గేముల్లోనూ ఆయుశ్ తొలుత వెనుక బడ్డా... సంయమనం కోల్పోకుండా ఆడి ఆధిక్యం చాటాడు. అదే జోరులో గేమ్‌లను సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన హెచ్ఎస్ ప్రణయ్ కూడా ముందంజ వేశాడు. ప్రణయ్ 24-22, 21-12తో నుగుయెన్ హాయ్ డాంగ్ (వియత్నాం)పై గెలుపొందాడు. అయితే భారత నంబంవన్ లక్ష్య సేన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించి నిరాశపరిచారు. ప్రపంచ 22వ ర్యాంకర్ లీ చెయుక్ యి (హాంకాంగ్)తో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య సేన్ 12-21, 19-21తో ఓడిపోయాడు. లీ చెయుక్ చేతిలో లక్ష్య సేన్‌కిది నాలుగో ఓటమి కావడం గమనార్హం. ఈ ఏడాది మలేసియా ఓపెన్ లోనూ లీ చెయుక్ చేతిలో లక్ష్య సేన్ పరాజయం పాలయ్యాడు. ప్రపంచ మాజీ చాంపియన్ లోకీన్ యెవ్ (సింగపూర్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-18, 9-21, 11-21తో ఓటమి చవిచూశాడు. 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నా... అదే జోరును కొనసాగించడంలో

## లక్నో సూపర్ జెయింట్ ముకుంద్




**కోల్‌కతా:**కోల్‌కతా: ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. కేకేఆర్ గెలుపు బోణీ ఆశలపై ముకుంద్ చౌదరీ(27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లతో 54 నాటౌట్) నీళ్లు చల్లాడు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను అద్భుత విజయాన్ని అందించాడు. 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో ఓ దశలో 128పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. అప్పటికే 16 ఓవర్లు ముగిశాయి. విజయం సాధించాలంటే 24 బంతుల్లో 54 పరుగులు సాధించాల్సిన పరిస్థితి. ఈ దశలో ముకుల్ చౌదరీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 17వ ఓవర్లో అరోరా బంతులకు 4, 6... 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు, 19వ ఓవర్లో గ్రీన్ బంతులపై 6,4,6తో 19 రన్స్ సాధించాడు.చివరి ఓవర్లో విజయానికి 6 బంతుల్లో 14పరుగులు చేయాలి. అరోరా వేసిన చివరి ఓవర్లో రెండో బంతికి సిక్స్, అయిదో బంతికి సిక్స్ బాది లక్నోకు అద్భుత విజయాన్ని అందించాడు.మిగతా బ్యాట్స్‌మెన్లలో బదోనా (54) అర్ధసెంచరీతో రాణించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లలో వైభవ్ అరోరా, అంకుల్ రాయ్ చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు రహానే(41) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకోగా.. రఘువంశీ(45)మరోసారి మెరిశాడు. ఆఖర్లో పావెల్(39 నాటౌట్),కామెరూన్ గ్రీన్(32 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 181 పరుగులు చేసింది.

## భారత్ తొలి టెస్ట్ విక్టరీ హీరో కన్నుమూత



**చెన్నై:** భారత క్రికెట్‌లో విషాదం చోటు చేసుకుంది. టీమిండియా తొలి టెస్ట్ గెలిచిన జట్టులోని చివరి ఆటగాడు దొరైస్వామి గోపీనాథ్(96) కన్నుమూశారు. భారత అత్యంత వృద్ధ టెస్ట్ క్రికెటర్ కూడా ఆయనే.చెన్నైలోని తన నివాసంలో వృద్ధాప్య సమస్యలతో గోపీనాథ్ గురువారం తుదిశ్వాస విడిచారు. 1952లో ఇంగ్లండ్‌పై భారత్ సాధించిన తొలి టెస్ట్ విజయంలో గోపీనాథ్ కీలక పాత్ర పోషించారు. ఈటెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 8 పరుగుల తేడాతో గెలిచి చరిత్ర సృష్టించింది. ఆ చారిత్రత్మ మ్యాచ్‌లో గోపీనాథ్ 35 పరుగులు చేశారు. తొలి టెస్టు విజయం సాధించిన భారత జట్టులో ఇప్పటివరకు జీవించి ఉన్న ఏకైక క్రికెటర్ గోపీనాథ్ కావడం విశేషం. ఇప్పుడు ఆయన మరణంతో భారత క్రికెట్‌లో ఒక శకం ముగిసింది.

1951లో ఇంగ్లండ్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేసిన గోపీనాథ్ తన కెరీర్‌లో భారత్ తరపున 8 టెస్టులు ఆడారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మద్రాస్ తరపున 83 మ్యాచ్‌లు ఆడారు. గోపీనాథ్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే మెరుపులు మెరిపించాడు. తన అరంగేట్ర టెస్టులో 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన గోపీనాథ్ మొదటి ఇన్నింగ్స్‌లో అజేయంగా 50, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. మొత్తంగా ఆయన 8 మ్యాచ్‌లలో 242 పరుగులు చేశారు. ఆయన మృతి పట్ల బిసిసిఐ, పలువురు క్రికెటర్లు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.




## టిసిఎస్ లాభం 13వేల కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 9:** టాటా గ్రూప్‌నకు చెందిన దిగ్గజ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) త్రైమాసిక ఫలితాలను గురువారం స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కంపెనీ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే నాలుగో త్రైమాసికం ఫలితాలతో పోలిస్తే ఈసారి కంపెనీ నికరలాభం ఏకంగా 12 శాతం పెరిగింది. మార్కెట్ అంచనాలను మించి లాభాలనుఆర్జించింది. కంపెనీ ఆదాయం సైతం ఏకంగా 10 శాతం మేర పెరిగింది.

నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.70,698 కోట్లుగా నమోదైనట్లు టీసీఎస్ తెలిపింది. ఈ క్రమంలో టీసీఎస్. తమ వాటాదారులకు ఫైనల్ డివిడెండ్ కింద ఒక్కోషేరుకు రూ.31 చొప్పున చెల్లిస్తామని తెలిపింది. ఇందుకు కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నుంచి ఆమోదం లభించిందని, షేర్ల హోల్డర్ల ఆమోదానికి లోబడి ఈ డివిడెండ్ చెల్లింపులు ఉంటాయని పేర్కొంది. గడిచిన నాలుగో త్రైమాసికంలో తమకు మూడు మెగా డీల్స్ లభించినట్లు టీసీఎస్ వెల్లడించింది. ఈమూడు మెగా డీల్స్ మొత్తం కాంట్రాక్ట్ విలువ 12 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించింది.

వరుసగా మూడో త్రైమాసికంలో మేము లాభాలను నమోదు చేశామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. 12 బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్ విలువ గల మూడు మెగా డీల్స్ అందుకోవడం వల్ల ఇది సాధ్యమైంది. అలాగే మా 5 పిల్లర్ల వ్యూహం, మా ఏఐ ఆధారిత సేవలు సైతం ఇందుకు దోహదపడ్డాయని టీసీఎస్ సీఈఓ, ఎండీ కే క్రితివాసన్ పేర్కొన్నారు. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో కంపెనీని మంచి స్థానంలో ఎలా నిలబెట్టాలి, ఏఐని పూర్తి స్థాయిలో ఎలా అందిపుచ్చుకోవాలని అనే అంశాలావైనే ఫోకస్ చేస్తున్నట్లు తెలిపారు.

టీసీఎస్ గత ఆర్థిక సంవత్సరాన్ని మొత్తం 40.7 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ సాధించింది. ఒక ఏడాదిలో ఐదు మెగా డీల్స్ సాధించి అత్యధిక డీల్స్ సాధించిన ఏడాదిల్లో ఒకటిగా నిలిచింది. కంపెనీ తన బిల్డ్ పార్ట్‌నర్ అక్వైర్ విధానం ద్వారా పెట్టుబడులను ముమ్మరం చేసింది.

కోస్టల్ క్లౌడ్, లిస్ట్ ఎంగేజ్‌లను కొనుగోలు చేసి, హైపర్‌వాల్ట్‌ను స్థాపించింది. గత ఆర్థిక ఏడాదిలో టీసీఎస్ కంపెనీకి మొత్తం రూ.2.67 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన చూసుకుంటే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు 5 శాతం మేర ఆదాయం పెరిగింది.

## జైప్రకాష్ ప్లాట్ల లబ్ధిదారులకు అదానీ భరోసా




**ముంబయి, ఏప్రిల్ 9:** జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్)లో ఫ్లాట్లు బుకింగ్ చేసుకుని 15 ఏళ్లుగా స్వాధీనం కోసం ఎదురుచూస్తున్న వందలాది మంది ఇంటి కొనుగోలుదారులకు ఊరట లభించింది.అదానీ గ్రూప్ రూ.14,500కోట్ల రుణ పరిష్కార ప్రణాళిక అమలుపై స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించిన క్రమంలో వారందరికీ 15 ఏళ్ల తర్వాత సొంతిళ్లు దక్కుతాయన్న ఆనందం కలుగుతోంది. దశాబ్దం న్నర కాలంగా ఎదురుచూస్తున్న బయ్యర్లకు అదానీ ఇప్పుడు ఆశాకిరణంగా కనిపిస్తున్నారు. జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌లో ఇళ్లు బుకింగ్ చేసుకుని స్వాధీనం చేసుకునేందుకు ఏళ్ల తరబడి చట్ట పరంగా పోరాడుతున్నట్లు ఇంటి కొనుగోలుదారుల సంఘం సభ్యులు తెలిపారు. తమ రుణ పరిష్కార ప్రణాళిక ద్వారా ఈ ప్రాజెక్టులను అదానీ గ్రూప్ పూర్తి చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి కోసం డబ్బులు చెల్లించి ఏళ్ల తరబడి ఈఎంఐలతో పాటు ఇంటి రెంటు సైతం కడుతున్న కొనుగోలుదారులు ఉన్నారు.

జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో దాదాపు 8వేల మంది బయర్లున్నారు. అదానీ గ్రూప్ ఈ ప్రాజెక్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత రెండేళ్లలో తమ చేతికి ప్రాపర్టీలు వస్తాయని వారంతా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల్లో ప్రధానమైన నోయిడాలోని జేపీ గ్రీన్ విష్ టౌన్‌లో 2011లో చాలా మంది అపార్ట్‌మెంట్ల కోసం బుకింగ్ చేసుకున్నారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ 2025, మార్చి 17న అదానీ ఎంటర్ ప్రైజెస్ రూ.14,535 కోట్ల రుణ పరిష్కార ప్రణాళికకు ఆమోదం తెలిపింది. జేఏఎల్ సంస్థకు సంబంధించి ప్రధాన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు జేపీ గ్రీన్, జేపీ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ వంటివి ఉన్నాయి. డిఫాల్ట్‌ల తర్వాత జేఏఎల్ దివాలా తీసింది. బయ్యర్లంతా అదానీ గ్రూప్‌కు జై కొట్టారు.

# ఈక్విటీలకు హార్ముజ్ ఎఫెక్ట్

## నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఏప్రిల్ 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. వరుసగా 5 రోజుల పాటు లాభాలు అందుకున్న సూచీలు ఈరోజు భారీగా పడిపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టినట్లు కనిపించినా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయాలు నెలకొన్నాయి. ఇరాన్‌అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో యుద్ధానికి బ్రేకులు పడినట్లు కనిపించినా లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చాయి. ఈ దాడులకు ప్రతిగా హార్ముజ్ జల సంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మళ్లీ దూసుకెళ్లాయి. ఇది స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించింది. ఇన్వెస్టర్లకు లాభాల స్వీకరణకు దిగడం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కూడా నష్టాలకు కారణమయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఒక దశలో 1000కి పైగా పాయింట్లు కోల్పోయింది. గురువారం రోజున ఉదయం సెన్సెక్స్ 77,319 పాయింట్ల వద్ద నష్టాల్లో ట్రేడింగ్ మొదలు పెట్టింది.రోజు మొత్తం నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,347 వద్ద కనిష్ఠ స్థాయిని తాకి చివరకు 931 పాయింట్లు కోల్పోయి 76,631 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 222 పాయింట్లు నష్టపోయి 23,775 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 92.62 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్ అండ్ టీ, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్, వంటి స్టాక్స్ లాభపడ్డాయి.

అంతర్జాతీయ మార్కెట్లో మళ్లీ క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణతో 95 డాలర్ల దిగువకు వచ్చిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర మళ్లీ 98.42 డాలర్ల స్థాయికి ఎగబాకింది. బంగారం ధర ఔన్సుకు 4728 డాలర్ల స్థాయికి చేరింది. అనిశ్చిత పరిస్థితుల్లోనూ హిందాల్కో షేర్లు 3.56 శాతం లాభపడ్డాయి. ఆ తర్వాత డాక్టర్ రెడ్డీస్, బజాజ్ ఆటో, భారత్ ఎలక్ట్రానిక్స్, మ్యాక్స్ హెల్త్ కేర్ వంటి షేర్లు సగటున 1 శాతానికిపైగా లాభాలు అందుకున్నాయి. ఇండిగో, జియో ఫైనాన్షియల్ సగటున 3.25 శాతం మేర పడిపోయాయి. లార్సెన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు 2.35శాతం వరకు పడిపోయాయి.కీలక రంగాల్లో షేర్లు భారీగా నష్టపోవడంతో దేశీయ మార్కెట్ సూచీలు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇరాన్ అమెరికా మధ్య యుద్ధం ఇంకా ముగియలేదన్న వార్తలు ఇన్వెస్టర్లను అప్రమత్తం చేశాయి

## అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్ 2.2 లక్షలకోట్లు




**ముంబయి, ఏప్రిల్ 9:** బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీలు, ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ అకౌంట్లు, మ్యూచుఫండ్లలో గత ఏడాది 2025 డిసెంబర్ నాటికి ఎవరూ క్లెయిమ్ చేయని సంపద రూ.2.2 లక్షల కోట్లుగా ఉన్నట్లు వ్యక్తిగత ఫైనాన్స్ అడ్వైజరీ సంస్థ ఫైనాన్స్ మ్యాగజైన్ వెల్లడించింది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లో ఎవరూ తీసుకోని సొమ్ము వేగంగా పెరుగుతోంది. షేర్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.89,000 కోట్లుగా ఉన్నట్లు నివేదిక అంచనావేసింది.మొత్తం 1671 కంపెనీల వద్ద ఇన్వెస్టర్ల సొమ్ము మూలుగుతోందని తెలిపింది. బ్యాంకు డిపాజిట్ల తర్వాత షేర్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రెండో స్థానంలో ఉన్నాయి. రూ. 2.2 లక్షల కోట్లకు పైగా విలువైన ఈ పెట్టుబడులు తక్కువ రాబడినిచ్చే నిద్రాణమైన పొదుపులు కావు. కానీ క్లెయిమ్‌లు అందకపోవడం, పని చేయని ఖాతాలు లేదా పెట్టుబడిదారులు, వారి కుటుంబాలలో అవగాహన లోపం కారణంగా అందుబాటులో లేకుండా పోయిన అధిక వృద్ధి సామర్థ్యం గల పెట్టుబడులు ఉన్నాయి.

లక్షల కోట్ల సొమ్ము సరైన వ్యక్తులకు చేరడం లేదు. బహుళ ఫైనాన్షియల్ అసెట్స్ రూపంలో ఈ సొమ్ము ఉన్నట్లు నివేదిక తెలిపింది. బ్యాంక్ డిపాజిట్లలో రూ.97,545 కోట్లతో 44.2 శాతం సొమ్ము ఎవరూ తీసుకోలేదు. ఈక్విటీ షేర్లలో రూ.89,004 కోట్లతో 40.3 శాతం, ఇన్సూరెన్స్ పాలసీల్లో రూ.20,062 కోట్లతో 9.1, ఈపీఎఫ్ అకౌంట్లలో రూ.10,915 కోట్లతో 4.9 శాతం, మ్యూచువల్ ఫండ్లలో రూ.3,452 కోట్లతో 1.6 శాతం,ఆర్ఈఐటీఎస్, ఇన్విట్స్, ఎన్సీడీల్లో 764 కోట్లతో 0.3 శాతం, చొప్పున అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్ నిలిచిపోయాయి.వన్ ఫైనాన్స్ మ్యాగజైన్ ప్రకారం పైన చెప్పిన డేటా ఆర్‌బీఐ నోటిఫికేషన్స్, ఎన్ఎస్ఈ బీఎస్ఈ షేర్ హోల్డింగ్ ప్యాటర్న్లు, ఐఈపీఎఫ్ రూల్స్, ఐఆర్‌డీఏఐ యాన్యువల్ రిపోర్ట్స్, ఈపీఎఫ్ఓ డేటా, సెబీ యాన్యువల్ రిపోర్ట్స్ ఆధారంగా తీసుకున్నారు. బ్యాంకుల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవర్నెస్ ఫండ్‌లో జమ చేస్తున్నారు. వీటికి 3 శాతం సింపుల్ ఇంట్రెస్ట్ వస్తుంది. ద్రవ్యోల్బణం కారణంగా ఈ డబ్బు విలువ భారీగా తగ్గిపోతుందని చెప్పవచ్చు.గడిచిన 10 ఏళ్ల కాలంలోనే ఈ డబ్బు 34 రెట్లు పెరిగింది.2015లో రూ.7875కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉంటే 2025 నాటికి 98,545 కోట్లకు పెరిగాయి.ఇక షేర్ మార్కెట్లో చూసుకుంటే దాదాపు 1671 కంపెనీలకు చెందిన 166 కోట్ల షేర్లు కొనుగోలు చేసి ఎవరూ క్లెయిమ్ చేసుకోని సొమ్ము విలువ రూ.89,004 కోట్లుగా ఉంది. ఇది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ వద్ద ఉంటాయి. ఈ లింకులోకి లాగిన్ అయ్యి కస్టమర్లు తమకు సంబంధించిన సొమ్మును తనిఖీ చేసి క్లెయిమ్ చేసుకోవచ్చు.

## డిమాండ్ సరఫరాలు మాత్రమే.. రూపాయి విలువ నిర్ధారిస్తాయి: ఆర్బీఐ



**ముంబయి, ఏప్రిల్ 9:**పశ్చిమాసియా ఉద్రిక్తతలతో చమురుధరలు గ్లోబల్‌స్థాయిలోపెరగడంతో డాలర్ చెల్లింపులు పెరిగి రూపాయి భారీగా క్షీణించింది. అయితే ఈ క్షీణత కట్టడికి ఆర్‌బిఐ జోక్యం అవసరం లేదని తీవ్రస్థాయిలో ఉంటే డాలర్ల కౌంటర్లు తెరిచి రూపాయి క్షీణత కట్టడిచేస్తుందన్నారు. భాగంగానే కరెన్సీ విలువల్లో అధిక హెచ్చుతగ్గులు కనిపిస్తే మాత్రమే ఆర్బీఐ జోక్యంచేసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతానికి మాత్రం ఎలాంటి ఆందోళనా అవసరం లేదని,జోక్యం చేసుకోబోమని చెప్పుకొచ్చారు. రూపాయి విలువను ఒక నిర్దిష్ట స్థాయి (90 లేదా 95 ఇలా) దగ్గర ఉంచడం తమ లక్ష్యం కాదని అన్నారు. డిమాండ్ అండ్ సప్లై మాత్రమే రూపాయి విలువను నియంత్రిస్తాయని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక మూలాలు ఉన్నప్పటికీ అంతకుముందు ఏడాదులతో పోలిస్తే 202526 ఆర్థిక సంవత్సరంలో రూపాయి విలువ కాస్త ఎక్కువ మాత్రమే క్షీణించిందని మల్హోత్రా వివరించారు.

## మూడేళ్ల తర్వాత విప్రో షేర్ బైబాక్




**బెంగళూరు, ఏప్రిల్ 9:** టెక్నాలజీ దిగ్గజకంపెనీ విప్రో ఈఎల 15,16 తేదీల్లోనే షేర్ల బైబాక్‌నుప్రకటిస్తుందని కంపెనీ వర్గాలు చెపుతున్నాయి. ఆరోజే కంపెనీ నాలుగో త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతోపాటు బోర్డు ఆమోదంపొందిన తర్వాత షేర్‌బైబాక్‌ను కూడా ప్రకటిస్తుందని అంచనా.ఈనెల 16వ తేదీ కంపెనీ బోర్డు సమావేశం జరగనున్నది. ఈ వివరాలను కూడా ఎక్స్ఛేంజికి నివేదిస్తుంది. గడచిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా విప్రో బైబాక్‌ను ప్రకటిస్తోంది. 2023జూన్‌లో ఒకసారి షేర్‌బైబాక్‌చేసిన కంపెనీ ఆనాడు షేర్లను రూ.445 చొప్పున రూ.12 వేల కోట్ల ఆఫర్‌తో ఆనాడు షేర్లు కొనుగోలుచేసింది. కంపెనీ మొత్తం ఈక్విటీ వాటాల్లో 4.91శాతం బైబాక్‌చేసింది. అంతకుముందు 2020లో విప్రో కంపెనీ రూ.400 చొప్పున రూ.9500 కోట్లవిలువైన షేర్లను బైబాక్‌చేసింది. మళ్లీ షేర్‌బైబాక్ ఉండవచ్చని అంచనా.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.